# ఆర్గాన్ న్యూస్
VOICE OF DEMOCRACY
తెలుగు దినపత్రిక

సంపుటి : 17 సంచిక : 291 ఖమ్మం, తెలంగాణ శనివారం 06.12.2025 పేజీలు : 12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar



WE ARE HIRING

ఆర్గాన్ NEWS

విలేఖరులు కావలెను

జిల్లాస్థాయి రిపోర్టర్లు.. ఫ్రీలాన్స్ జర్నలిస్టులు కావలెను

2009లో సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో ప్రారంభమై దిగ్విజయంగా నడుస్తూ.. ప్రజాధరణ పొందిన ఆర్గాన్ న్యూస్ ఇప్పుడు వెబ్ ఛానల్ ద్వారా 24 గంటలు నిరంతర వార్తా ప్రసారాలతో ప్రపంచ వ్యాప్తంగా రాబోతుంది.. ఉమ్మడి రాష్ట్రాలలోని అన్ని జిల్లాల్లోని నియోజకవర్గ రిపోర్టర్‌గా పని చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాము..

కావలసిన ప్రాంతాలు:
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రజాస్వామ్యపు విలువలు కలిగి ప్రజల గొంతుకగా నిలిచే వార్తలు అందించగలిగే నైపుణ్యం గలవారు మాత్రమే మాతో కలిసి నడవండి..

SEND RESUME :
organ.today@gmail.com
9848156178




## గుడ్ న్యూస్ చెప్పిన ఆర్‌బీఐ

**వడ్డీ రేట్లపై మరో 0.25 శాతం కోత**

**ఆర్‌బిఐ మరోమారు కీలక నిర్ణయం**

**తాజా నిర్ణయంతో తగ్గనున్న రుణాల వడ్డీలు**

ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్‌బీఐ.. మరోసారి గుడ్‌న్యూస్ చెప్పింది. కీలక వడ్డీరేట్లను మరో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి పడిపోవడం, వృద్ధి రేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టినట్లు మల్హోత్రా వెల్లడించారు. వడ్డీ రేట్లను తగ్గించడంతో గృహ, వాహన రుణ గ్రహీతలకు మరికొంత ఉపశమనం లభించినట్లయ్యింది. కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టిన సంగతి తెలిసిందే.

10

## మేము తటస్థం కాదు..
# శాంతి పక్షం

- ఇరుదేశాల మధ్య నమ్మకం అనేది గొప్ప బలం
- దౌత్యం తోనే రష్యా, ఉక్రెయిన్‌ల విభేదాలు పరిష్కారం
- పుతిన్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ

### భారత్, రష్యాల శాంతిమార్గం



న్యూఢిల్లీ, డిసెంబర్ 5 : శాంతిపక్షానే భారత్ నిలుస్తుందని, ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా, చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సహకరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ తో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాని పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ, దేశాల సంక్షేమం శాంతి మార్గంలోనే ఉందని, దౌత్యం ద్వారానే రష్యా, ఉక్రెయిన్‌లు విభేదాలను పరిష్కరించుకుంటారనే నమ్మకం తనకు

-మిగతా 2 లో..

## అమెరికా ఆంక్షలు ఉన్నా చమురు రవాణా ఆగదు

- భారత్‌తో బంధం మరింత బలోపేతం
- భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం
- ఇరుదేశాల మధ్య మరింత వాణిజ్య సహకారం
- సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం
- అణువిద్యుత్ తదితర రంగాల్లో సహకారం కొనసాగిస్తాం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలసి నడుస్తాం
- ఉక్రెయిన్‌తో యుద్ధంపై మోడీ సూచనలు స్వాగతిస్తున్నాం
- మోడీతో భేటీలో సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్

03





# గందరగోళంగా ఇండిగో సేవలు

**రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం**

- ఇండిగో సంక్షోభంపై దర్యాప్తునకు ఆదేశం
- సర్వీసుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
- కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు

**ఇండిగో సంక్షోభంపై విచారణకు కేంద్రం ఆదేశించింది. సంక్షోభం నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు వెంటనే కేంద్రం రంగంలోకి దిగింది. నిర్వహణాపరమైన లోపాల కారణంగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దాంతో వేలాది మంది ప్రయాణికులు అవస్థలు పడుతుండగా.. ఈ గందరగోళం ఇప్పడప్పడే కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది.**

న్యూఢిల్లీ, డిసెంబర్ 5 : శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా ఈ విచారణలో భాగంగా అధికారులు సిఫార్సులు చేయనున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులపై పౌరవిమానయాన శాఖ నిరంతరం సమీక్ష జరుపుతోంది. విమాన కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్లు అందించేలా

-మిగతా 2 లో..

## రాష్ట్రం కోసం ఎన్ని సార్లయినా
# ఢిల్లీకి వెళ్తా

- నిధులు, అనుమతుల కోసం సీఎంగా నా బాధ్యత
- నాకు ఓపిక ఉంది.. కొట్లాడే దమ్ముంది
- నర్సంపేట సభలో సిఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

### ప్రధానిని, కేంద్రమంత్రులను కలుస్తూనే ఉంటా

ఒకటికి వంద సార్లు తిరుగుతా. నాకు ఓపిక ఉంది. వయసుంది. విషయాన్ని వివరించే కనీస పరిజ్ఞానం నాకుందని సిఎం రేవంత్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. కాకతీయ కాలం నుంచి ప్రపంచానికి పోరాట పంథాను చాటిచెప్పిన వరంగల్ గడ్డ, సమ్మక్క-సారలమ్మ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, దాశరథి కృష్ణమాచార్యులు, కాళోజీ నారాయణ రావు, పీవీ నర్సింహరావు నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొ జయశంకర్ ప్రజా ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలుస్తారు. వారి స్ఫూర్తిగానే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

02






## హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టులో విచారణ

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ**

హైదరాబాద్, డిసెంబర్ 5 : హిల్ట్ పాలసీపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హిల్ట్ పాలసీపై

-మిగతా 2 లో..

## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ
# ఇల్లు మా లక్ష్యం

**అర్బన్ ఏరియాల్లో కూడా బహుళ అంతస్థుల నివాసాలు**

**హిల్ట్ పాలసీపై కెటిఆర్‌వి అర్థం లేని విమర్శలు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, డిసెంబర్ 5 : తమ ప్రభుత్వం వచ్చాక పేదలకు అనేక సంక్షే మ కార్యక్రమాలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయించే బాధ్యత తీసుకున్నట్లు పేర్కొన్నారు. వచ్చే మూడేళ్లలో అర్బన్ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ

-మిగతా 2 లో..





## కారులో రూ.4 కోట్ల
# హవాలా నగదు

**ఛేజ్ చేసి పోలీసుల స్వాధీనం**

కంటోన్మెంట్: నగరంలోని శామీర్‌పేటలో కారులో భారీగా హవాలా నగదు లభ్యమైంది. టైర్లు, సీట్ల కింద రూ.4 కోట్ల నగదును పోలీసులు గుర్తించారు. హవాలా మార్గంలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బోయిన్‌పల్లి క్రైమ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. హవాలా డబ్బు కేసులో 2024లో

-మిగతా 2 లో..

## తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర

**కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ**

హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలక పాత్ర పోషించనుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోనియాగాంధీ సందేశం పంపించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే

-మిగతా 2 లో..



## సాయి ఈశ్వర్ మరణానికి
# ప్రభుత్వానిదే బాధ్యత

**బిసి రిజర్వేషన్లతో మోసం వల్లే అతను ఆత్మహత్య**

**అతని కుటుంబానికి 50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్**

హైదరాబాద్, డిసెంబర్ 5 : సాయిఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యతని బిఆర్ఎస్ ఆరోపించింది. బిసి రిజర్వేషన్ల పేరుతో మోసం చేయడం వల్లనే అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడని విమర్శించింది. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి సాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల

-మిగతా 2 లో..



ఆర్గాన్ న్యూస్
2
తెలంగాణ
శనివారం
06 డిసెంబర్ 2025
www.organnews.in
organ.today@gmail.com
@organnews



## మేము తటస్థం కాదు.. శాంతి పక్షం

(మొదటిపేజీ తరువాయి)

ఉందని చెప్పారు. భారత్, రష్యా కలిసి ప్రపంచాన్ని శాంతి మార్గంలో నడిపిద్దామని పుతిన్‌తో అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి పుతిన్ ప్రభుత్వం భారత్‌పై విశ్వాసం ఉంచి ప్రతి విషయాన్ని తమతో పంచుకుందని మోదీ అన్నారు. ఇరుదేశాల మధ్య నమ్మకం అనేది గొప్ప బలమని, ఇదే విషయాన్ని తాము పదేపదే చెబుతూ వచ్చామని, ప్రపంచానికి కూడా తెలియజేశామని అన్నారు. ఇటీవల కాలంలో గ్లోబల్ నేతలతో తాను ఎప్పుడు మాట్లాడినా ఇండియా తటస్థం కాదనీ, ఇండియాకు స్పష్టమైన వైఖరి ఉందని, శాంతియుతంగా జరిగే ఏ పరిష్కారానికైనా తమ మద్దతు ఉంటుందని చాలా స్పష్టంగా చెప్పామని మోదీ తెలిపారు. భారత్-రష్యా మధ్య భాగస్వామ్యానికి ఇంధన భద్రత అనేది బలమైన స్తంభం వంటిందని, పరస్పర లాభదాయక సహకారాన్ని తాము కొనసాగిస్తామని మోదీ చెప్పారు. సివిల్ న్యూక్లియర్ ఎనర్జీలో తమ భాగస్వామ్యం దశాబ్దాల నాటిదని, క్రిటికల్ మినిరల్స్ అంశంలోనూ పరస్పర సహకారం తప్పనిసరని అన్నారు. ఆర్థిక సహకారం పెంపునకు విజన్ 2023 డాక్యుమెంట్‌పై ఉభయదేశాలు సంతకం చేసినట్టు చెప్పారు. ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంలోనూ ఈరోజు తామిరువురూ పాల్గొంటామని, ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసేందుకు ఇది వేదిక అవుతుందని తాము బలంగా నమ్ముతున్నామని చెప్పారు. కాగా, ఉక్రెయిన్‌తో శాంతియుత పరిష్కారానికి తాము పని చేస్తున్నట్టు పుతిన్ కూడా ప్రధాని మోదీకి తెలిపారు. కాగా, దీనికి ముందు పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. తన పర్యటనలో భాగంగా రాజ్‌ఘాట్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పుతిన్ నివాళులర్పించారు. మోడ్రన్ ఇండియా వ్యవస్థాపకుల్లో ఒకరిగా, గొప్ప ఫిలాసఫర్‌గా, మానవతావాదిగా మహాత్మాగాంధీ నిలిచారని, ప్రపంచ శాంతికి ఎనలేని కృషి చేశారని పుతిన్ అక్కడి విజిటర్స్ బుక్‌లో రాశారు. స్వేచ్ఛ, మంచితనం, మానవత్వంపై మహాత్మాగాంధీ ఆలోచన నేటికీ నిత్య నూతనమని గుర్తుచేసుకున్నారు.

## గందరగోళంగా ఇండిగో సేవలు

(మొదటిపేజీ తరువాయి)

24/7 అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. విమానయాన సంస్థలతో సమన్వయం, ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే లక్ష్యంతో దీనిని అందుబాటులోకి తెచ్చారు. కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయాల్సిన నంబర్లు 011-24610843, 011-24693963, 096503-91859 అని తెలిపింది. ఈ క్రమంలో ఇండిగో సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు నిర్ణయించినట్టు తెలిపింది. సంక్షోభానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత నాలుగైదు రోజులుగా ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దుతో తలెత్తిన సంక్షోభంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ప్రభుత్వం నిర్ణయించినట్టు కేంద్ర విమానయాన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇండిగో సర్వీసుల్లో ఎక్కడ పొరపాటు జరిగింది, ఇందుకు బాధ్యులెవరనేది దర్యాప్తులో గుర్తించి, అవరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. భవిష్యత్తుల్లో ఇలాంటి అంతరాయాలు తలెత్తకుండా, ప్రయాణికులకు కష్టం కలకుండా చూస్తామని వివరించింది. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, పేషెంట్లు, ఇతరులు అవసరాల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సి ఉంటుందని పేర్కొంది. సర్వీసులు శనివారం నుంచి తిరిగి ప్రారంభమవుతాయని అంచనా వేస్తున్నామని, మూడు రోజుల్లోగా పూర్తిగా పునరుద్ధిస్తామని తెలిపింది.కాగా, నలుగురు సభ్యులతో కూడిన దర్యాప్తు కమిటీని కేంద్రం పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఇండిగో ఫ్లైట్స్‌కు కలిగిన తీవ్ర అంతరాయం, ఇందుకు దారితీసిన పరిస్థితులపై కమిటీ దర్యాప్తు చేసి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించనుంది.

## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లు మంజూరు చేస్తాం. ఇక్కడ జీ ప్లస్ త్రీ, జీ ప్లస్ ఫోర్ విధానంలో నిర్మిస్తాం. మధ్యతరగతి వర్గాలకూ మంజూరయ్యేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 3.82 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో మూడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. త్వరలో లక్ష ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధం అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు లక్షల ఇళ్లకు గృహప్రవేశం పూర్తి అవుతుందని వివరించారు. వచ్చే ఏప్రిల్ నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందని చెప్పుకొచ్చారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం కూడా ప్రణాళిక సిద్ధమైందని వెల్లడించారు. గ్రౌండ్ ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మించి పేదలకు ఇచ్చే ప్రణాళికలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో అర్బన్ ప్రణాళిక ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఓ ఆర్ ఆర్‌కు ఆనుకుని నలువైపులా ఉన్న స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఒక్కో చోట 10వేల ఇళ్లు నిర్మించి నో ప్రాఫిట్, నో లాస్ కింద మధ్యతరగతి ప్రజలకు ఇస్తామని వివరించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ప్రణాళికలు ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గగత కేసీఆర్ ప్రభుత్వం హౌసింగ్ శాఖను నిర్వీర్యం చేసిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖను తిరిగి తాము బలోపేతం చేశామని వివరించారు. గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన ఇళ్లకు కూడా ఇందిరమ్మ పథకం వర్తింపజేయాలని తాము ఆలోచిస్తున్నామని చెప్పుకొచ్చారు. రూరల్‌లో, అర్బన్‌లో ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు కూడా త్వరలో శుభవార్త చెబుతామని పేర్కొన్నారు. ఒక విడతలోనే ఇళ్లు ఇచ్చి తాము చేతులు దులుపుకోమని చెప్పుకొచ్చారు. హిల్ట్‌పాలసీ పై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. హిల్ట్ పాలసీపై కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వస్తే హిల్ట్ పాలసీ రద్దు చేస్తామని అంటున్నారని... నోటికొచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ అని.. వారి హయాంలో ఇష్టం వచ్చినట్లుగా చేశారని ఫైర్ అయ్యారు. తమ ప్రభుత్వం చాలా వినూత్న నిర్ణయాలు తీసుకుంటుందని.. కేసీఆర్ హయాంలో లాగా తాము చేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్ తరహాలో వరంగల్ అభివృద్ధి

### నర్సంపేటలో రూ.532 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

**వరంగల్, డిసెంబర్ 5 :** బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉండగా గత పదేళ్లలో భారీగా ఆస్తులు సంపాదించారు.. కానీ ఈ ప్రాంతం అభివృద్ధిని గాలికి వదిలేశారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ ఆనాడు వరి వేసుకుంటే ఉరి వేసుకున్నట్లేనని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం.. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తూ.. వరికి ప్రోత్సాహకాలిచ్చామని తెలిపారు. సన్న వడ్డుల పండిస్తే 500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ మా పార్టీదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గత పాలకులు ఫాంహౌస్ లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు.. ఉద్యమగడ్డ వరంగల్ కు మాత్రం ఏమీ ఇవ్వలేదని ఘాటు విమర్శలు చేశారు. గత పాలకులు రైతు రుణమాఫీ చేయలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేసింది.. రాష్ట్రంలో కోటి 10 లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం.. 3 కోట్ల 10 లక్షల మందికి ఈ ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టు ను కూడా సాధించలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో పర్యటించారు. రూ.532 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నర్సంపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. వరంగల్ గడ్డకు చెందిన ఎందరో వీరులు తమ పరాక్రమాన్ని ప్రపంచానికి చూపారు. కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ జిల్లా ప్రజలు ఆశించారు. కుర్చీలో కూర్చున్న వారి ఆస్తులు పెరిగాయి కానీ, ప్రజల జీవితాలు మారలేదు. మీ ఓటునే ఆయుధంగా మార్చి.. గడీల పాలనను కూల్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతోంది. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే



అని ఆనాటి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోంది. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమ్ కట్ అయ్యింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్‌కు మాత్రమే. గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చాం. ఈ దేశంలో వరి అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా.. 3.10 కోట్ల మంది లబ్దిదారులకు సన్నబియ్యం ఇస్తున్నాం. రేషన్ కార్డుల్లో కొత్తవారికి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాం. సన్నబియ్యం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం అని సీఎం అన్నారు. రేవంత్ తో సహా వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. వరంగల్ ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు సీఎం రేవంత్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నర్సంపేటపై వరాల జల్లు కురిపించారు సీఎం రేవంత్. రూ.532.24 కోట్లతో నర్సంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సీఎం. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మార్చి 31 లోపల వరంగల్ లో ఎయిర్ పోర్టును ప్రారంభించుకుంటామన్నారు. వరంగల్ లో అండర్ డ్రైనేజ్, ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించుకుంటాం.. సౌర విద్యుత్ ని ఉత్పత్తి చేసే బాధ్యతను మహిళలకు అప్పగించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## రాష్ట్రం కోసం ఎన్ని సార్లయినా ఢిల్లీకి వెళ్తా

**వరంగల్, డిసెంబర్ 5 :** నిరుపేదలు, దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ పిల్లలు చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన చదువులు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. తాతముత్తాల కాలం పది తరాలుగా వృత్తులు చేసుకుంటూ వచ్చినా బతుకులు మారలేదు. చదువొక్కటే మన బతుకుల్లో మార్పు తీసుకొస్తుంది. నిలబెడుతుంది. ప్రపంచంతో పోటీ పడేలా చేస్తుంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అనేక సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకుని.. ఒకవైపు రైతులు, మరోవైపు మహిళలు, ఇంకోవైపు యువత కోసం కార్యక్రమాలు చేపట్టింది. యువత కోసం ఉద్యోగ నియాకాలు చేపట్టాం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది లోపే 61 వేల ఉద్యోగాలిచ్చాం. ఇంకా 40 వేల ఉద్యోగాలిచ్చే పక్రియ మొదలవుతుంది. అభివృద్ధిపథంలో సాగాలంటే ఎడ్యుకేషన్,ఇరిగేషన్,కమ్యునికేషన్ అత్యంత కీలకమని, ఆయా రంగాల్లో లక్ష్యాలను సాధించడానికి ఈ నెల 8, 9, తేదీల్లో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నాం అని వివరించారు. హైదరాబాద్‌తో సమంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. పక్క రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలుంటే, తెలంగాణలో ఒక్కటి మాత్రమే ఉంది. పదేండ్లలో వీటి గురించి పట్టించుకోలేదు. కనీసం రోడ్లు వేయలేదు. డిసెంబర్ ఆఖరునాటికి భూ సేకరణ పూర్తి చేసి మార్చి 31 లోపు వరంగల్ విమానాశ్రయ పనులు ప్రారంభిస్తాం అన్నారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సమ్మక్క, సారలమ్మ మందిరం అద్భుతంగా నిర్మాణమవుతోందని, అదే తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం అన్నారు. రాష్ట్రంలో ప్రతి మారుమూల తండాకు రోడ్డు కనెక్టివిటీ ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఏ గ్రామానికీ రోడ్డు లేదన్న మాట వినదలచుకోలేదని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 20 వేల కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నాం. ప్రతి గూడెం నుంచి మండల



కేంద్రానికి, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసలు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు వేస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో మహిళాభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఉచిత బస్సు సౌకర్యం, సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్, బస్సులకు యజమానులుగా.. ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్నాం అన్నారు. ఇంటి ఆడబిడ్డకు చీరె పెట్టడం ఒక సంప్రదాయం. ఇంట్లో సొంత సోదరుడి తరహాలో ప్రతి ఏటా సారె పండుగ చేసుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది ఆడబిడ్డలకు చీర అందిస్తున్నాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరె చేరాలి. రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ కూడా నాకు చీర రాలేదని అనొద్దు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయ్యాక, మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ, మున్సిపాలిటీల్లో చీరె అందజేస్తాం. ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోందన్నారు.

## సాయి ఈశ్వర్ మరణానాకి ప్రభుత్వానిదే బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)



ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్‌కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి ఆడిన రాక్షస రాజకీయ క్రీడలో తమ్ముడు సాయి ఈశ్వర్ బలైపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. బీసీ బిడ్డ ఆత్మబలిదానానికి కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీ సమాజం ఎన్నటికీ క్షమించదని తెలిపారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్య అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి అధికార దాహానికి బలైన ప్రాణం ఇది అని పేర్కొన్నారు. సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి కూరాలని ఆ దేవుడిని హరీశ్‌రావు ప్రార్థించారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, రూ. 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సాయి ఈశ్వర్ ఇటీవల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తీన్మార్ మల్లన్నను కలవడానికి వెళ్లిన సాయిఈశ్వర్ గురువారం సాయంత్రం.. ఆయన ఆఫీసు ముందు పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికుల్గ ÷రిరజన్, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న వారు మంటలను ఆర్పివేసి సాయిఈశ్వర్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయిఈశ్వర్ ప్రాణాలు కోల్పోయాడు.

## అమెరికాలో అగ్నిప్రమాదం

### ఇద్దరు హైదరాబాద్ విద్యార్థుల మృతి

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్ కంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతిచెందారు. బర్మింగ్‌హామ్‌లోని అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో పదిమంది తెలుగు విద్యార్థులు నివసిస్తున్నట్లు సమాచారం. హఠాత్తుగా చెలరేగిన మంటలతో ఉక్కిరిబిక్కిరైనా విద్యార్థులు.. అపార్ట్‌మెంట్‌లో ఫైర్ ప్రారంభమైన కాసేపటిలోనే ఘాటైన పొగ వెలువడడంతో విద్యార్థులు శ్వాస తీసుకోలేక భయంతో కేకలు వేశారు. ప్రాణ భయంతో వణికిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు.లోపల చిక్కుకుపోయిన 13 మంది విద్యార్థులను అగ్నిమాపక సిబ్బంది బయటకు తీసుకొని వచ్చారు. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హైదరాబాద్ చెందిన ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. మృతి చెందిన వారిలో ఉడుముల సహజ రెడ్డి, కూకట్ పల్లికి చెందిన మరొక విద్యార్థి ఉన్నట్లు సమాచారం. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## సోమాజిగూడ రెస్టారెంట్‌లో స్వల్ప అగ్నిప్రమాదం

**హైదరాబాద్,డిసెంబర్5 :** సోమాజిగూడ లోని శ్రీకన్య కంఫర్ట్ రెస్టారెంట్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్ కిచెన్ నుండి దట్టంగా పొగలు వెలువడ్డాయి. బిల్డింగ్ 5వ అంతస్తులో రెస్టారెంట్ ఉంది. భవనం నాలుగో అంతస్తులో ఉఖి జ్యూవెలర్స్ ఉంది. అయిదవ అంతస్తులో ఉన్న రెస్టారెంట్ నుండి పొగలు వెలువడ్డాయి. దీంతో అంతా భయాందోళనకు గురయ్యారు. ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లిన వారు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో అగ్నిప్రమాదం ఆందోళన కలిగించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానిక్కి ÷ర్, డిజార్డర్ సిబ్బంది చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు ప్రారంభించి భవనం లోపల ఉన్న వారిని బయటికి తరలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## హిల్ట్ పాలసీపై హైకోర్టులో విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్లు దాఖలు చేశారు. 9,292 ఎకరాల భూ కేటాయింపుల విషయంలో రూపొందించిన జీఓ నిబంధనలకు విరుద్ధంగా ఉందని హైకోర్టుకు ఆయన తెలిపారు. దీనిపై సీబీఐ లేదా ఈడీ దర్యాప్తు చేయించాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు ఉన్న రికార్డులను సీజ్ చేసి ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని కోర్టుకు విన్నవించారు. పిటిషనర్ వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. వెంటనే రిప్లై దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 29వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు.

## కారులో రూ.4 కోట్ల హవాలా నగదు

(మొదటిపేజీ తరువాయి)

ఓ వ్యక్తి పరారయ్యాడు. ఇవాళ ఆ వ్యక్తి భారీ మొత్తంలో నగదుతో నిజామాబాద్ నుంచి వస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకొని, డబ్బును స్వాధీనం చేసుకున్నారు.

## తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర

(మొదటిపేజీ తరువాయి)

వారికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇచ్చేలా మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార, సాంకేతిక నైపుణ్యాలు, అంతర్జాతీయ ప్రతిభ అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహించనున్నందుకు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొనన్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## టెర్రస్‌పై గంజాయి మొక్కల పెంపకం

### ఇద్దరు బీహారీలను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** టెర్రస్‌పై గంజాయి పెంచుతున్న ఇద్దరు బీహారీ వాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. మలక్ పేట్ గంజ్ మిషన్ మార్కెట్లో ఒక భవనం టెర్రస్ పై బీహార్ కి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి మొక్కలను పెంచుతూ శుక్రవారం హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందికి పట్టుబడ్డారు. మహబూబ్ మాన్షన్ మార్కెట్ భవనంలో కింద మొత్తం మార్కెట్ షాపులుగా ఉన్నాయి. పైన టెర్రస్ లో బీహార్ కు చెందినటువంటి లవకుశ, బీమ్లేష్ అనే ఇద్దరు అద్దెకు ఉంటున్నారు. టెర్రస్ పై గత ఆరు నెలలుగా గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని ఏపుగా పెరిగిన అనంతరం గంజాయిగా మార్చి అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. టెర్రస్ పై గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారం అందుకున్న హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ గౌడ్ ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది కలిసి టెర్రస్ పై దాడి నిర్వహించారు.ఈ దాడిలో మూడు నుంచి 6 మీటర్ల ఎత్తులో పెరిగినటువంటి ఐదు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొక్కలతో పాటు 55 గ్రాముల ఎండు గంజాయి రెండు సెల్‌ఫోన్‌లతో నిందితులను అరెస్ట్ చేశారు. ఈ గంజాయి చెట్ల నుంచి సుమారు 10 కిలో కేజీల గంజాయి దిగుబడిగా వచ్చే అవకాశాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అంచనాలు వేశారు. నిందితులను గంజాయి మొక్కలను కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సీఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

# అమెరికా ఆంక్షలు ఉన్నా

# చమురు రవాణా ఆగదు

- భారత్‌తో బంధం మరింత బలోపేతం
- భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం
- ఇరుదేశాల మధ్య మరింత వాణిజ్య సహకారం
- సొంత కరెన్సీలతో వ్యాపారానికి చేరువగా ఉన్నాం
- అణువిద్యుత్ తదితర రంగాల్లో సహకారం కొనసాగిస్తాం
- ఉగ్రవాదంపై పోరులో భారత్‌తో కలసి నడుస్తాం
- ఉక్రెయిన్‌తో యుద్ధంపై మోడీ సూచనలు స్వాగతిస్తున్నాం
- మోడీతో భేటీలో సంయుక్త మీడియా సమావేశంలో పుతిన్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** టెర్రరిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో భారత్‌తో కలిసి నడుస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. టెర్రరిజాన్ని పూర్తిగా నాశనం చేసేందుకు భారత్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ, పుతిన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ.. 'మోదీతో నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. భారత్ ఆతిథ్యం ఎంతో సంతోషాన్నిచ్చింది. అనేక అంశాల్లో ఇరుదేశాల మధ్య అవగాహన కుదిరింది. విభిన్న అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-రష్యా మధ్య 64 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగింది. ఇరుదేశాల మధ్య ట్రేడ్ మరింత పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయిల్ సహా అన్ని రంగాల్లో సహకారం అందిస్తాం. ఉమ్మడి ప్రాజెక్టులు, సాంకేతిక అంశాల్లో పరస్పర సహకారం ఉంటుంది. సొంత కరెన్సీల్లో ఇరుదేశాల మధ్య వాణిజ్యం జరుగుతోంది. కొడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్టుకు సహకరిస్తాం. విద్యుత్ రంగంలో ఖర్చు తగ్గింపునకు సాయం అందిస్తాం. భారత్‌తో కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. భారత్‌కు నిరంతరంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందని అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. వచ్చే ఏడాది భారతదేశం బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపడుతుందన్నారు. భారత్‌కు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామన్నారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపటానికి ప్రధాని మోదీ ఎంతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. యుద్ధం ఆపే ప్లాన్ గురించి తనకు వివరించి చెప్పారని అన్నారు. అమెరికా లాంటి దేశాల నుంచి వాణిజ్య ఒత్తిడులు ఎదురైతున్నప్పటికీ .. భారత్- రష్యా మధ్య ఇంధన సరఫరా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల నుంచి వస్తున్న ఒత్తిడుల కారణంగా కొంతకాలంగా చమురు దిగుమతులను భారత్ తగ్గించినప్పటికీ.. ఆ దేశాభివృద్ధికి సహకరించడం కోసం సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గతేడాది భారత్-రష్యా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 12 శాతం పెరిగి.. రికార్డు సృష్టించిందని రష్యా అధ్యక్షుడు అన్నారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో పెరుగుదల ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు చేరుతుందని పుతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. రక్షణ సహకారాన్ని కూడా మరింత విస్తరిస్తామని తెలిపారు. రష్యా దృష్టి పెట్టాల్సిన కీలక సవాళ్ల గురించి మోదీ తనతో చర్చించారని.. భారత్- యురేషియా ఆర్థిక సంఘం మధ్య స్వేచ్ఛా వాణిజ్య మండలాన్ని సృష్టించడం వంటి వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. అంతే కాకుండా భారత్-రష్యా క్రమంగా చెల్లింపుల కోసం తమ జాతీయ కరెన్సీలను ఉపయోగించే దిశగా కదులు తున్నాయని.. దాదాపు 96 శాతం వాణిజ్య చెల్లింపులు జాతీ య కరెన్సీలలోనే జరుగుతున్నాయన్నారు. మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై పోరుకు భారత్- రష్యా కలిసి నడుస్తాయన్నారు. ఇటీవల పహల్గాంలో జరిగిన దాడికి, గతేడాది రష్యా రాజధాని మాస్కో లోని క్రాకస్ సిటీ కాన్సర్ట్ హాల్‌లో జరిగిన దాడికి మూల కారణం ఉగ్రవాదమేనని అన్నారు. మానవత్వ విలువ లపై చేస్తున్న ఈ ప్రత్యక్ష దాడులకు వ్యతిరేకంగా ఉగ్రవాదంపై పోరుకు ఇరుదేశాలు ఏకమైనట్లు తెలిపారు. భారత్, రష్యా, యూఎన్, జీ20, బ్రిక్స్ వేదికలు సన్నిహిత సహకారాన్ని కలిగి ఉన్నాయని.. ఈ వేదికలన్నింటిలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.



## పోటీ పరీక్షలకు సిద్ధం కండి

- త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇస్తాం
- రాజకీయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు
- నిరుద్యోగులకు సిఎం రేవంత్ కీలక సూచన

**వరంగల్, డిసెంబర్ 5 :** నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని.. త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామని చెప్పారు. పంచాయితీ ఎన్నికల కోసం చదువుకున్న యువత సమయం వృధా చేసుకోవద్దని సూచించారు. రాజకీయాలు ఎప్పుడైనా చేయొచ్చని.. వయోపరిమితి దాటితే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు అవుతారని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించు కోవాలని.. చదువుకుంటేనే మీ పిల్లలు.. కుటుంబాలు బాగుపడతాయని అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా శుక్రవారం నర్సంపేటలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.508 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. వరంగల్ పర్యటనకు వస్తే స్ఫూర్తి కలుగుతుందన్నారు. పోరాట యోధుల స్ఫూర్తితో పాలన కొనసాగిస్తున్నామని.. కానీ గత పాలకులు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నరు.. కార్లు కొన్నారు.. పదేండ్లు పాలించిన వాళ్లే ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజలకు పదేండ్లలో ఏమీ రాలేదన్నారు. వరి వేస్తే ఉరి అని ఆనాడు కేసీఆర్ అన్నారు.. కానీ మేం సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని తెలిపారు. దుక్కిదున్నే ప్రతి రైతుకు 24 గంటల కరెంటు ఇస్తున్నామని.. ఉచిత కరెంట్ పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు. రెండేండ్ల క్రితం గడీలను కూల్చి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని.. పదేండ్లు దోచుకున్న వారి గడీలకు కరెంటు పీకేశామన్నారు. మార్చి 31లోపు వరంగల్ ఎయిర్ పోర్టు పనులు స్టార్ట్ చేస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోపు మమునూరు ఎయిర్ పోర్టు భూసేకరణ పూర్తి అవుతుందని చెప్పారు. పదేళ్లలో కేసీఆర్ ఒక్కరోజైనా వరంగల్ ఎయిర్ పోర్టు గురించి ఆలోచించాడా అని ప్రశ్నించారు. విదేశాలలో చదువుకున్నామని పొడుగుపోడుగు మాటలు చెప్పే వాళ్లకు తెలంగాణలో రెండవ ఎయిర్ పోర్టు తేవాలనే సోయి ఎందుకు లేదని నిలదీశారు.

## మరో బాలుడిపై వీధికుక్క దాడి

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** హైదరాబాద్‌లో మరో బాలుడిపై వీధి కుక్కలు దాడికి తెగబడ్డాయి. యూసుఫ్‌గూడ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహనగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న మాన్విత్ నందన్ అనే రెండేళ్ల చిన్నారిపై వీధి కుక్క దాడికి దిగింది. చిన్నారి చేతిని కరిచే ప్రయత్నం చేసింది. అక్కడే ఉన్న బాలుడి తాత అప్రమత్తమై కర్రతో కొట్టడంతో వీధికుక్క అక్కడి నుంచి వెళ్లిపోయింది. అనంతరం గాయాలపాలైన బాలుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, వీధికుక్కల విజృంభణపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో వీధి కుక్కల దాడులు జరుగుతున్నా, ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

## పాన్ మసాలాపై కొత్త సెస్సు..

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధించేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగిం చనున్నారు. 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు, 2025'పై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడా రు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని వెల్లడించారు. అనంతరం ఈ బిల్లు మజూవాణి ఓటుతో లోక్‌సభలో ఆమోదం పొందింది. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు ఈ సెస్సు విధిస్తారు. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులను వినియోగిస్తామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీలో గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు చెప్పారు. సెస్సు వల్ల జీఎస్టీ రెవెన్యూపై ఎలాంటి ప్రభవమూ పడబోదని వివరించారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్సును విధించనున్నట్లు తెలిపారు. 2010–2014 మధ్య సెస్సుల రూపంలో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 7 శాతంగా ఉండగా.. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు.

## మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

**హైదరాబాద్:** సైఫాబాద్‌లో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సైఫాబాద్ పీఎస్ పరిధిలోని ఐమ్యాక్స్ ఓపెన్ గ్రౌండ్ సమీపంలో.. సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్, సైఫాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు డ్రగ్స్ విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ గులాం జిలానీ, ఫిరోజ్ బిన్ అలీ సులేమాన్ ఖాన్‌ల వద్ద నుంచి.. 100 గ్రాముల బ్రౌన్ షుగర్, 1350 గ్రాముల డ్రై గంజాయి, 7 మొబైల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ సుమారు రూ. 23.50 లక్షలు ఉంటుందని, జిలానీ ఒడిశా నుంచి డ్రగ్స్ తెచ్చి సాహిల్, సులేమాన్‌లకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. నవంబరు 4న రేతిబౌలి ప్రాంత వ్యక్తి మహమ్మద్ అహ్మద్‌కు 3 గ్రాముల బ్రౌన్ షుగర్ విక్రయించగా.. అతడు అధిక మోతాదులో తీసుకుని మరణించాడు. దీనిపై రాజేంద్రనగర్ పీఎస్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను సైఫాబాద్ పీఎస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించారు.




## మెడికల్ కోడింగ్‌లో శిక్షణ పేరుతో నిరుద్యోగులకు కుచ్చు టోపి

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** మెడికల్ కోడింగ్‌లో శిక్షణతోపాటు ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసిన ఇద్దరు నిందితులు పత్తాలేకుండా పోయారు. మోసపోయిన బాధితులు తమకు న్యాయం చేయాలంటూ మాదాపూర్ పోలీసులను ఆశ్రయించడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో మైండ్ స్పార్క్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్, మాదాపూర్‌లో ప్రిడెక్స్ పేరిట దిలీప్‌కుమార్ అనే వ్యక్తి రెండు శిక్షణ సంస్థలను నిర్వహిస్తున్నాడు. ఇదే సంస్థలో శివారెడ్డి మేనేజర్‌గా, శ్రీకాంత్ జోషి లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సైన్స్ సబ్జెక్ట్‌తో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో శిక్షణ ఇచ్చి, ఆ తర్వాత ఉపాధి కల్పిస్తామని నమ్మించారు. ఇందులో భాగంగా మొదట ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో కరీంనగర్, సిద్దిపేటతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన దాదాపు 50 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో సర్టిఫైడ్ ప్రొఫెషనల్ కోడర్ (సీపీసీ) కోర్సులో శిక్షణ కోసం రూ.15 వేల చొప్పున చెల్లించారు. ఆరు నెలల శిక్షణ అనంతరం విద్యార్థులకు సీపీసీ సర్టిఫికెట్లు జారీ చేశారు. అనంతరం అమెరికన్ అకాడమీ ఆఫ్ ప్రొఫెషనల్ కోడర్స్(ఏఏపీసీ) నిర్వహించే పరీక్ష రాయాల్సి ఉంటుందని, సదరు పరీక్ష రాసిన తర్వాత మెడికల్ కోడింగ్‌కు సంబంధించిన కంపెనీల్లో ఉద్యోగం కల్పిస్తామని శ్రీకాంత్ జోషి విద్యార్థులను నమ్మించాడు. తాను ఏఏపీసీ సర్టిఫైడ్ మెంబర్‌ని అని మాయమాటలు చెప్పి ఒక్కో విద్యార్థి నుంచి పరీక్ష ఫీజుతోపాటు, ఉద్యోగం కోసమంటూ రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశాడు. నవంబర్ 30న ఏఏపీసీ పరీక్ష ఉంటుందని, నగరంలోని అమీర్‌పేట, గచ్చిబౌలిలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయని చెప్పాడు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను నవంబర్ 29న జారీ చేస్తానని చెప్పడంతో ఆయా జిల్లాల నుంచి విద్యార్థులు 29న నగరానికి చేరుకున్నారు. హాల్ టికెట్ల కోసం ఫోన్‌లో శ్రీకాంత్ జోషిని సంప్రదించే ప్రయత్నం చేయగా.. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. శివారెడ్డి సైతం అందుబాటులోకి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన విద్యార్థులు మరుసటి రోజున మాదాపూర్లో ఉన్న ప్రిడెక్స్ కార్యాలయం వద్దకు వచ్చారు. నిందితులిద్దరూ అక్కడ లేకపోవడంతో సంస్థ సీఈఓ దిలీప్‌కుమార్‌ని కలిసి విషయం చెప్పారు. అయితే వారిద్దరూ డబ్బులు వసూలు చేసిన విషయం తన దృష్టికి రాలేదని, తమకు తెలియకుండా వారు డబ్బులు వసూలు చేశారని చెప్పాడు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. తమ వద్ద మొత్తం రూ.47 లక్షలు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం శివారెడ్డిని అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీకాంత్ జోషి పరారీలో ఉన్నాడు.

## హెల్త్ వర్సిటీ ఇంచార్జ్ వీసీగా రమేష్ రెడ్డి

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఇంచార్జ్ వీసీగా డా. రమేష్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ రెడ్డి ప్రస్తుతం యాదాద్రి భువనగిరి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు.గతంలో డీఎంఈగా పని చేసిన విషయం తెలిసిందే. కాగా,అక్రమమార్గంలో విద్యార్థులను పాస్ చేశారని ఆరోపణలు రావడంతో విజిలెన్స్ విచారణ కొనసాగుతున్న క్రమంలో నందకుమార్‌రెడ్డి వీసీ పదవికి రాజీనామా చేశారు. ఐదుగురు విద్యార్థులు అక్రమ మార్గంలో పాస్ అయ్యారని వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నది. ఇలాంటి నాటకీయ పరిణామాల మధ్య డాక్టర్ రమేష్ రెడ్డిని ఈ నియామకం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.



## హిడ్మా ఎన్‌కౌంటర్‌కు దేవ్‌జీ కారణం కాదు

### : మావోయిస్టులు

**చర్ల:** దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి వికల్ప్ పేరిట మావోయిస్టులు మరో లేఖ విడుదల చేశారు. నవంబర్ 27 నాటి లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చికిత్స కోసం ఓ కలప వ్యాపారి ద్వారా హిడ్మా విజయవాడ వెళ్లారని వికల్ప్ అందులో పేర్కొన్నారు. నిరాయుధుడైన హిడ్మా సహా ఆరుగురిని పోలీసులు హత్య చేశారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌లో హిడ్మా చనిపోయాడని కట్టుకథ ప్రచారం చేశారన్నారు. ఆయన హత్యకు కలప వ్యాపారి, బిల్డర్, ఐటీడీఏ కాంట్రాక్టరే కారణమని పేర్కొన్నారు. హిడ్మా, శంకర్ ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మనీశ్ కుంజాం, సోని చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించారు. "అరెస్టైన వారిలో కామ్రేడ్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి లేరు. పోలీసులతో వారిద్దరూ ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు దేవ్‌జీ కారణమని మాజీ ఎమ్మెల్యే మనీశ్ కుంజా ఆరోపించడం కుట్రే. విజయవాడలో అరెస్టైన కామ్రేడ్లకు న్యాయ సహాయం అందించాలి. ప్రజాపక్ష న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు వారికి సహాయం చేయాలి" అని లేఖలో వికల్ప్ కోరారు.




## ఇండిగో సంక్షోభం..

### శనివారం 1000లోపు సర్వీసులు రద్దు : సీఈవో

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** ఇండిగో విమాన సర్వీసుల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతూనే ఉంది. శుక్రవారం వెయ్యికి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ క్రమంలో సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ మరోసారి స్పందిస్తూ.. ప్రయాణికులకు కలుగుతోన్న అసౌకర్యానికి క్షమాపణ చెప్పారు. శనివారం ఈ సంఖ్య వెయ్యి కన్నా తక్కువ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసెంబర్ 10–15 మధ్య కాలంలో పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. "గత కొన్ని రోజులుగా తీసుకుంటున్న ముందస్తు చర్యలు సరిపోవడం లేదని రుజువైంది. అందుకే.. అన్ని వ్యవస్థలు, షెడ్యూల్‌లను రీబూట్ చేయాలని నిర్ణయించాం. ఫలితంగా నేడు భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. రేపటి నుంచి పరిస్థితులు మెరుగుపడాలంటే ఈ చర్యలు తప్పనిసరి. దీంతో శనివారం 1000 కన్నా తక్కువ సర్వీసులు రద్దవుతాయని అంచనా వేస్తున్నాం. ఎఫ్‌డీటీఎల్ (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) విషయంలో డీజీసీఏ తీసుకున్న ఉపశమన చర్యలు చాలా దోహదపడ్డాయి" అని పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. ఇండిగో నిత్యం దాదాపు 2300 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను నడుపుతోంది. కొన్ని రోజులుగా వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దుకాగా.. శుక్రవారం ఆ సంఖ్య వెయ్యి దాటినట్లు అంచనా. సాంకేతిక లోపాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, షెడ్యూల్ మార్పులు, అప్‌డేట్ చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాల (ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) అమలు వంటి అంశాలు ఈ సంక్షోభానికి కారణాలుగా తెలుస్తున్నాయి.

## ఏసీబీకి చిక్కిన అడిషనల్ కలెక్టర్

### 60వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హన్మకొండ, డిసెంబర్ 5 :** లంచం తీసుకోవడం నేరం అని అవగాహన కల్పించాల్సిన అధికారులే లంచాలకు ఆశపడుతున్నారు. లంచగొండి ఉద్యోగులను ఏసీబీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొందరు అధికారుల్లో మాత్రం మార్పురావడం లేదు. తాజాగా హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఏసీబీకి పట్టుబడ్డారు. రూ. 60 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. హనుమకొండ అదనపు కలెక్టర్, జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారి వెంకట్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన రూ.60,000 లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. విద్యాశాఖ వ్యవహారానికి సంబంధించి ఈ లంచం తీసుకున్నట్లు సమాచారం. వెంకట్ రెడ్డితో పాటు మరో ఉద్యోగిని కూడా ఏసీబీ అధికారులు విచారిస్తున్నారు. ఇంకా హనుమకొండ కలెక్టరేట్లో ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు. హనుమకొండ కలెక్టరేట్ లో రైడ్స్ చేసిన ఏసీబీ అధికారులు.. ఓ ప్రైవేట్ స్కూల్ రెన్యువల్ చేసేందుకు సంస్థ యాజమన్యం నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. వెంకట్ రెడ్డి ప్రస్తుత హనుమకొండ డీఈవోగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ స్కూల్ రెన్యువల్ కోసం లంచం డిమాండ్ చేసి రూ. 60 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. సుమారు వంద కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశారు. అక్రమాస్తుల కేసులో ఏసీబీ ఆయనపై పలు కేసులు నమోదు చేశారు ఏసీబీ అధికారులు. లంచం తీసుకునే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## పవన్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా : మంత్రి కోమటిరెడ్డి



**అమరావతి :** చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానిం చేందుకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. "పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా.. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చా. రెండు రాష్ట్రాలు కలిసి ఉండాలి.. అదే స్నేహం కొనసాగాలి. చంద్రబాబు విజన్ 2020 అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్" అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

## ఓట్ల రాజకీయంలో కుదేలవుతున్న
# ఆర్థిక వ్యవస్థ!



**సమాజం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను ప్రభుత్వాలు అస్సలు పట్టించుకోవడం లేదు. ఏదైనా ఘోరం జరినప్పుడు సంతాపం తెలియచేయడం.. తరవాత మర్చిపోవడం షరమామూలుగా మారింది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పాలనలో కొత్తదనం కనిపించడంలేదు. భవిష్యత్ నిర్మాణం దిశగా వారి ఆలోచనలు లేవు. అధికారం ఉందికదాని ప్రజాధానం వృధాగా ఖర్చు చేస్తున్నారు. లక్షల కోట్లు అప్పులు చేసి కుప్పలు పెడుతున్నారు. కెసిఆర్, జగన్ బాటలోనే రేవంత్, చంద్రబాబు నాయుడుల పాలన సాగుతోంది. ఉట్టి కెగరలేనమ్మ ఆకాశానికి ఎగిరిందన్న రీతిలో పాలకుల తీరు ఉంది.**

తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ గ్రామాల్లో ప్రధానంగా కోతుల బెడద విపరీతంగా ఉంది. గత సిఎం కెసిఆర్ కోతులు వాపస్ పోవాలె అని నినాదం ఇచ్చారు. అది అక్కడికే ఆగిపోయింది. కోతులు కూడా కెసిఆర్‌వి కోతలే అనుకున్నాయేమో గ్రామాలు వదలడం లేదు. గ్రామాలు మొదలుకుని పట్టణాల వరకు వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మొన్నటికి మొన్న వీధి కుక్కల బారిన పడి ఓ మూగబాలుడు ఆస్పత్రి పాలయ్యాడు. వీటిని నిరోధించే కార్యక్రమం చేపట్టడం లేదు. కోతుల కారణంగా తెలంగాణ పల్లెల్లో జనజీవనం తీవ్ర ప్రభావం చూపుతోంది. పంటలు నాశనం అవుతున్నాయి. ఇళ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి. ప్రజలపై పడి రక్కుతున్నాయి. దీంతో ప్రతి ఇల్లూ ఓ జైలులాగా తయారయ్యింది. ఇంటికి గేట్లు పెట్టుకుని ప్రజలు తాళాలు వేసుకుంటున్నారు. తినడానికి గతిలేని వారు కూడా ఇంటికో గేటు పెట్టుకోవడం తప్పనిసరి అయ్యింది. తాజాగా ఈ విషయాన్ని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి లోక్‌సభలో ప్రస్తావించారు. తెలంగాణతో పాటు దేశం యావత్తూ సమస్య ఉందన్నారు. దీనిపై జాతీయ విధానం తీసుకోవాలని, కోతుల నిర్మూలన చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ ఆయన అధికారపార్టీ ఎంపి అయినా చెవిటివాడి ముందు శంఖం పూరించినట్లే. దీనిపై స్పందిస్తారని అనుకోవడానికి లేదు. ఎందుకంటే పార్లమెంట్ ఆవరణలోకి కుక్కతో వచ్చారని కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరిపై అధికార పార్టీ ఎంపి జగదాంబికాపాల్ రచ్చ చేశారు.

ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత బస్సు పేరుతో వందలకోట్లు తగలేస్తున్నారు. ఉచిత బస్సు బదులు టిక్కెట్ల రేట్లు తగ్గించి, రోడ్లు వేసి, బస్ సర్వీసులను పెంచితే ప్రజలందరికీ ఉపయోగం. ఇవన్నీ ఎందుకు చర్చించాల్సి వస్తోందంటే సామాజిక సమస్యలపై ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉంటున్నాయి. గ్రామాల్లో కోతులు నిర్మూలించే వారికే ఓటు వేస్తామని పలు గ్రామాల్లో ప్రకటనలు చేస్తున్నారు. పోస్టర్లు అంటిస్తున్నారు. ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దీనిగురించి ఆలోచించాలి. ఇదొక్కటే కాదు..ఉచితాలపై ఆలోచించాలి. సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్న ఉచిత పథకాలపై ఆలోచన చేయాలి. లేకుంటే దేశం అధోగతి పాలు కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పోటీపడి అమలు చేసే ఉచిత పథకాల వల్ల అభివృద్ధి కుంటు పడుతుందని గుర్తించాలి. అప్పులు చేసి ఉచిత పథకాలను అమలు చేయడం మంచిది కాదని వీరు గుర్తించడం లేదు. ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ఇవే కాకుండా దండగమారి ఖర్చులు కూడా తగ్గించాలి. హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల ఖర్చులు కూడా వేలకోట్లల్లో ఉంటున్నాయి. రాజకీయ నాయకులు తమ పర్యటనలు, వ్యక్తిగత ఖర్చులు చూస్తే గుండె గుభేల్ మంటోంది.

ప్రజలనుకూడా ఉచిత పథకాలతో సోమరిపోతులను తయారుచేయడం తప్ప మరోటి కాదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అభివృద్ధికి సూచిక కానేకాదు. ఈ పథకాన్ని అమలుచేయాలని మహిళలెవరూ కోరలేదు. దీనిని గొప్పగా ప్రకటించుకుని ఇన్ని వందల కోట్లు ఆర్టీసికి కట్టామని చెప్పు కోవడం సిగ్గుచేటు. అర్హులైన పేదవారి అభివృద్ధికి ప్రభుత్వాలు నిర్మాణాత్మకమైన సహాయ సహకారాలు అందించడంలో తప్పులేదు. అయితే ప్రజలను సోమరిపోతులుగా మార్చే ఉచిత పథకాలు ప్రగతిని దెబ్బతీస్తాయి. ఉచిత పథకాల వల్ల అనర్హులు సైతం వాటిని పొందడం ఎలా అని చూస్తున్నారు. తప్పుడు మార్గాలు అవలంబించి తమ పేర్లు పథకాల్లో ఉండేలా పైరవీలు చేస్తున్నారు. మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఒరిగేదమి లేదు. ఆ డబ్బులను రోడ్లు బాగు చేయడానికి, బస్ టిక్కెట్ రేట్లను తగ్గించి, సర్వీసులను పెంచడానికి ఉపయోగిస్తే బాగుండేది. చార్జీ చెల్లించి ప్రయాణం చేయలేని వృద్దులు, వికలాంగులు, విద్యార్థులు, మహిళలకు ఈ సౌకర్యం కల్పిస్తే అభ్యంతరం ఉండదు. కానీ అందరినీ ఒకే గాటన కట్టి అమలు చేయడం సరికాదు. ప్రభుత్వ ఉద్యోగులైన స్త్రీలు, ఆర్థికంగా ఉన్న స్త్రీలు ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనవసర ప్రయాణాలు పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంత నష్టం కలిగినా ఫరవాలేదు, మా పార్టీ ఎన్నికల్లో గెలవాలనే దుర్నీతిని రాజకీయ పార్టీలు అనుసరించి, ఉచిత పథకాలను అమలు చేస్తున్నాయి. వృద్ధాప్య పింఛన్లు, వికలాంగుల పింఛన్ల విషయంలో అనేక అవకతవకలు బయటపడు తున్నాయి. వాస్తవిక వయసును తగ్గించి, బోగస్ ఆధార కార్డులు పొంది, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న కేసులు ఎన్నో ఉన్నాయి. అంగవైకల్యం లేకపోయినా, డాక్టర్లను మేనేజ్ చేసి అనేకమంది వికలాంగుల పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక రేషన్ కార్డులు, బియ్యం జనాభాను మించి అమలు అవుతున్నాయి. రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేసే బియ్యం మాఫీయాలకు ఆదాయ వనరుగా మారింది. ఎపిలో పోర్టు నుంచి టన్నులకొద్దీ బియ్యం తరలినట్లు ప్రభుత్వమే గుర్తించింది. ప్రభుత్వం కిలో బియ్యానికి 42 రూపాయలు ఖర్చు చేస్తోంది. రేషన్ బియ్యం తినడానికి ఇష్టపడని ప్రజలు కేజీ 12 రూపాయల వంతున బయట అమ్ముకుంటున్నారు. వేల కోట్ల రూపాయలు ప్రజాధనం ఇలా వృథా అయిపోతోంది. ఈ విషయంలో పత్రికలు గానీ, రాజకీయ నాయకులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గానీ, జాతీయవాద సంస్థల నాయకులు గానీ చర్చించడం లేదు. ఎక్కడ తమ ఓట్లు పోతాయో అన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే విపక్షంలో ఉన్నవారు సైతం ఉచిత పథకాలు మరిన్ని అమలుకు పట్టుబడుతున్నారు. ఉచిత పథకాలకు ఖర్చు చేసే ధనాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తే రాష్ట్రాలు బాగుపడతాయి. విద్య,వైద్యరంగాలకు ఖర్చు చేయాలి. ఇలా దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. అప్పుడే రాష్ట్రలు స్వయంశక్తితో ముందుకు సాగుతాయి. ఇందుకోసం ప్రజలే నడుం బిగించాలి.

06-12-2025 — ఎడిటర్

# ఎగరని ఇండిగో విమానాలు..

### ఆకాశాన్నంటిన టికెట్ ధరలు



**న్యూఢిల్లీ :** నిర్వహణపరమైన లోపాల కారణంగా వందలాది ఇండిగో విమాన సర్వీసులు రద్దవడం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. అటు వేలాది మంది ఎయిర్‌పోర్టుల్లో పడిగాపులు కాస్తుండగా.. ఇటు టికెట్ల ధరల మోతతో మరికొంత మంది ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఇండిగో ఎఫెక్ట్‌తో దేశంలో విమాన టికెట్ల ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజులతో పోలిస్తే టికెట్ ధరలు దాదాపు రెండు, మూడు రెట్లు పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ముంబయి-దిల్లీ మధ్య విమాన సర్వీసుల టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ముంబయి-దిల్లీ, దిల్లీ-ముంబయి మార్గంలో పలు ఎయిర్‌లైన్ల టికెట్ ధరలు రూ.20 వేల నుంచి రూ.40 వేలు వరకు ఉన్నాయి. మిగిలిన మార్గాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. సాధారణ సమయాల్లో దిల్లీ-ముంబయి రౌండ్‌ట్రిప్ టికెట్ ధరలు చివరి నిమిషంలో బుక్ చేసుకున్నా దాదాపు రూ.20వేలు వరకు ఉంటాయి. ఇప్పుడు ఆ ధర ఏకంగా దాదాపు రూ.60వేలు వరకు పెరగడం గమనార్హం. ముంబయి-శ్రీనగర్‌లలో సాధారణ రోజుల్లో రూ.10వేలు ఉండే టికెట్ ధర.. ఇప్పుడు ఏకంగా రూ.62 వేలకు పెరిగింది. రౌండ్‌ట్రిప్ అయితే దాదాపు రూ.92వేల వరకు ఉంది. భారత్‌లో అతిపెద్ద విమాన యాన సంస్థ ఇండిగో కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం.. రోజుకు దాదా పు 2,200 విమాన సర్వీసులను నడుపుతోంది. ఎయిరిండియాతో పోలిస్తే ఇది రెండింతలు. అలాంటి ఎయిర్‌లైన్ ఇప్పుడు సాంకేతిక సమస్యలు, సిబ్బందికి సంబంధించిన కొత్త రోస్టర్ నియమాలు తదితర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. దీంతో శుక్రవారం దాదాపు 500 విమానాలను రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే దిల్లీ, హైదరాబాద్, చెన్నై సహా పలు విమానాశ్రయాల్లో ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరికొన్నిచోట్ల ఆలస్యంగా నడుస్తున్నాయి.

## శంషాబాద్ విమానాశ్రయంలో
# ప్రయాణికుల ఆందోళన

- ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికుల ఆగ్రహం
- ఏపీ మంత్రి పార్థసారథి చొరవతో అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమానం



**హైదరాబాద్, డిసెంబర్ 5 :** ఇండిగో విమానాల రాకపోకలను నిలిపేయడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 92 విమానాలు రద్దు చేసినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇందులో శంషాబాద్‌కు రావాల్సినవి 43, ఇక్కడి నుంచి వెళ్లాల్సినవి 49 ఉన్నాయి. ముందుగా బుక్ చేసుకున్న సర్వీసుల రద్దుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెక్‌ఇన్ అయిన తర్వాత రద్దు సమాచారం ఇవ్వడంపై నిరసన తెలిపారు. మరోవైపు విశాఖ నుంచి 8 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్‌కు వెళ్లాల్సినవి ఉన్నాయి. ఏపీ మంత్రి పార్థసారథి జోక్యంతో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక విమాన సదుపాయాన్ని కల్పించారు. అంతకుముందు విజయవాడ వెళ్లేందుకు శంషాబాద్‌లో ఇండిగో విమానం కోసం పార్థసారథి వేచి ఉన్నారు. అయ్యప్ప భక్తులు ప్రయాణించే విమానం ఆలస్యంపై అడిగి తెలుసుకున్నారు. వారి ఆందోళనను గమనించి స్వయంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌తో మాట్లాడారు. శబరిమలకు విమాన సర్వీసు ఏర్పాటు చేయించారు. విజయవాడకు వెళ్లాల్సిన విమానం మిస్ కావడంతో మంత్రి పార్థసారథి రోడ్డు మార్గంలో బయలుదేరారు. తమకోసం శ్రమపడి ప్రయాణ సదుపాయం కల్పించిన ఆయనకు అయ్యప్ప భక్తులు ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే దేశీయ విమానయాన సంస్థ ఇండిగో విమానాల రద్దు పరంపర కొనసాగుతున్నది. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలతో వరుసగా మూడో రోజూ పెద్ద సంఖ్యలో సర్వీసులు నిలిచిపోయాయి. శుక్రవారం మొత్తం 500కుపైగా విమానాలను సంస్థ రద్దు చేసింది. దీంతో ఎయిర్‌పోర్టుల్లో ఇండిగో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బోర్డింగ్ పక్రియ ముగిసి 12 గంటలవుతున్నా తాము వెళ్లాల్సిన విమానానికి సంబంధించిన ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆందోళనకు దిగుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో అయ్యప్ప స్వాముల నిరసనతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకున్నది. హైదరా బాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సిన విమానం 12 గంటల పాటు ఆలస్యం కావడంతో అయ్యప్పలు ఆందోళనకు దిగారు. ఇండిగో విమానం గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి కొచ్చి వెళ్లాల్సి ఉంది. ఈ విమానంలో వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు సాయంత్రమే శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, విమానం శుక్రవారం ఉదయానికి కూడా బయలుదేరకపోవ డంతో వారు ఆందోళనకు దిగారు. బోర్డింగ్ గేటుకు అడ్డంగా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 12 గంటలుగా తాము విమానాశ్రయంలోనే ఉన్నామని, విమానం గురించి తమకు సమాచారం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నా య ఏర్పాట్లు కూడా చేయలేదని ఆసహనం వ్యక్తం చేశారు. కాగా, ఇండిగో విమానాల రద్దు కారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు, మూడు రోజులుగా విమానా సర్వీసులు లేకపోవడంతో ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు.



## హైకోర్టుకు హైడ్రా కమిషనర్
# రంగనాథ్ క్షమాపణ

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలంగాణ హైకోర్టుకు హాజరై క్షమాపణ చెప్పారు. బతుకమ్మ కుంట కేసు విచారణలో భాగంగా ఆయన హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై ఎ.సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈక్రమంలో న్యాయస్థానం ఆదేశాలతో రంగనాథ్ శుక్రవారం కోర్టుకు వచ్చారు. గతంలోనే హాజరు కావాల్సి ఉండగా హాజరు కాలేదు. దీంతో హైకోర్టు తీవ్రంగా పరిగణించి ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయన హాజరయ్యారు. హైదరాబాద్ బతుకమ్మకుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథస్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలంటూ సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబరు 31న విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబరు 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బి.ఆర్. మధుసూదన్‌రావులతో కూడిన ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదనలు వినిపిస్తూ తప్పనిసరి అధికారిక విధులతో పాటు, తన హాజరుతో కోర్టును ఇబ్బంది పెట్టరాదన్న కారణంగా మినహాయింపు కోరుతున్నారనగా ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ ఆయన కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు తెలియజేస్తున్నామని వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణను ఎదుర్కొంటున్న కమిషనర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులో నిలబెట్టగలదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. హాజరు మినహాయింపునకు నిరాకరిస్తూ కమిషనర్ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. ఈక్రమంలో శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా హైకోర్టు ఎదుట హాజరై క్షమాపణలు చెప్పారు.

# సీఎం నిర్ణయంపైనే రాజీనామా ఆధారం

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలు



**హైదరాబాద్, డిసెంబర్ 5 :** రాజీనామాపై ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజీనామా అంశాన్ని సీఎం నిర్ణయంతో ముడిపెట్టాడు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే రాజీనామా చేయమని వెనకాడనన్నారు. తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఫైట్ చేయడం, గెలవడం తన రక్తంలోనే ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని హిమాయత్‌నగర్, నారాయణగూడలో రూ.1.40 కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అనర్హత వేటు అంశంపై దానం స్పందించారు. రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. నాకు ఎన్నికలు కొత్త కాదు.. ఇప్పటికి 11 సార్లు కొట్లాడిన చరిత్ర ఉంది. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. నా వాదనలు వినిపిస్తానని అన్నారు. రేవంత్‌రెడ్డి మరో పదేళ్లు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంది. రైజింగ్ తెలంగాణ కోసం తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని దానం నాగేందర్ అన్నారు.అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ జరుతుందని గుర్తు చేశారు. 'సుప్రీంకోర్టులో అప్పీల్ చేశా.. కేసు కోర్టులో పెండింగ్ ఉంది.. స్పీకర్ దగ్గర కూడా అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉంది.. సుప్రీంకోర్టులో నా వైపు నుంచి వాదనలు వినిపిస్తా.. సందర్భాన్ని బట్టి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటా.. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉంటా.. ఎన్నికలు ఎదుర్కోవడం నాకు కొత్తేం కాదు.. ఎన్నో ఎన్నికలు చూశా.. 11 సార్లు కొట్లాడిన చరిత్ర నాది. రేవంత్ రెడ్డి మరో పదేళ్ల పాటు సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని వ్యాఖ్యానించారు.



## ఎవరిని సంప్రదించకుండానే
# లేబర్ కోడ్లు

### కేంద్రం తీరుపై మండిపడ్డ మాజీ ఎంపి వినోద్

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** కేంద్ర ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండానే నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆరోపించారు. బీఆర్టీయూ అధక్షుడు రాంబాబు యాదవ్‌తో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక చట్టాలను కుదించి 29 కు పరిమితం చేసి నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చిందని మండిపడ్డారు. కార్మిక వర్గాలు ఈ కొత్త లేబర్ కోడ్స్‌పై ఆందోళనగా ఉన్నాయన్నారు. చట్టాలు పాస్ చేసే ముందు కార్మికు వర్గాల అభిప్రాయాన్ని కేంద్రం తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.చట్టాలకు నిబంధనలు రూపొందించే క్రమంలో ఇప్పుడు కేంద్రం అభిప్రాయం చెప్పమంటున్నది. బీఆర్ఎస్ పార్టీ తరపున లేబర్ కోడ్‌లపై అభిప్రాయాలు సేకరించి ఓ నిర్ణయం తీసుకునేందుకు రేపు తెలంగాణ భవన్‌లో ఉదయం పదకొండు గంటల నుంచి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల కార్మికు సంఘాల నేతలు, వివిధ పరిశ్రమల కార్మిక సంఘాల నాయకులు, అసంఘటిత రంగ కార్మిక సంఘాల నేతలు, బీఆర్ఎస్ కార్మిక విభాగం నేతలు ఈ రౌండ్ టేబుల్ మీటింగ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

## సాయి ఈశ్వర్ కుటుంబానికి
# మాజీ మంత్రుల పరామర్శ

### 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్



**హైదరాబాద్, డిసెంబర్ 5 :** రిజర్వేషన్ల పరంగా బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సాయి ఈశ్వర్ మరణించడంపై మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వీరు ఆస్పత్రిలో అంతకుముందు పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. సాయి ఈశ్వర్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. అయితే చికిత్స పొందుతూ మరణించాడు. అనంతరం మాజీ మంత్రులు మీడియాతో మాట్లాడుతూ.. సాయి ఈశ్వర్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ మిమ్మల్ని ఎవరు అడిగారని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలకు నిర్మల్ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్త రవీందర్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. నల్లగొండ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్తను మంత్రి కోమటిరెడ్డి అనుచరులు కిడ్నాప్ చేసి మూత్రం తాగించారని పేర్కొన్నారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలు ఏకమై ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. బీసీ బిడ్డలు ఆవేశాలకు గురై బలవన్మరణాలకు పాల్పడవొద్దని కోరారు

ప్రాంతీయం

# రెండో దఫా ర్యాండమైజేషన్ పూర్తి

- పోలింగ్ సిబ్బందికి కొత్త కేటాయింపులు
- సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు
- పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ తో కలిసి పాల్గొన్న సాధారణ ఎన్నికల పరిశీలకులు



**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్ డిసెంబర్ 5:** ఖమ్మం జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది కేటాయింపు కొరకు రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేసామని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు అన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించి మండలాల వారీగా సిబ్బందిని కేటాయించడం జరిగిందని అన్నారు. 200 ఓటర్ల వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1 పిఓ, 1 ఓపిఓ , 201 నుండి 400 ఓటర్ల వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1 పిఓ, 2 ఓపిఓలు, 401 నుండి 650 ఓటర్ల వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలకు 1 పిఓ, 3 ఓపిఓ లతో బృందాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ఎలక్షన్ కమీషన్ కంప్యూటర్ సాఫ్ట్వేర్ ద్వారా ర్యాండమైజేషన్ చేసామని, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించు కునేందుకు 20 శాతం సిబ్బందిని రిజర్వ్ లో ఉంచడం జరిగిందని, మొదటి విడతకు మొత్తం 1582 బృందాలను సిద్ధం చేశామని అన్నారు.

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ...**

ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామని అన్నారు. మొదటి విడత ఎన్నికలు జరగనున్న 192 గ్రామ పంచాయతీలకు, 1740 వార్డులకు 20 శాతం సిబ్బంది రిజర్వ్ కలిపి 1899 పోలింగ్ అధికారులు, 2321 ఓపిఓ లను నియమించామని తెలిపారు. 235 పోలింగ్ కేంద్రాలలో ఉన్న 1740 పోలింగ్ స్టేషన్ లలో మొదటి విడత పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేశామని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు సిబ్బంది సకాలంలో హాజరయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి టి. సునీల్ రెడ్డి, జిల్లా విద్యా శాఖ అధికారిణి చైతన్య జైని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

- సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామా రావు
- రఘునాథ పాలెం మండల ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన సాధారణ ఎన్నికల పరిశీలకులు

**ఖమ్మం, రఘునాథపాలెం, ఆర్గాన్, డిసెంబర్ 5:** పంచాయతీ ఎన్నికలు పగడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీ చరణ్ సుదామా రావు అన్నారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు, రఘునాథపాలెం మండల ఎంపీడీవో కార్యాలయాన్ని, పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుదామా రావు మాట్లాడుతూ.. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలని, స్థానికేతరులు వెళ్లేలా చూడాలని అన్నారు. పోలింగ్ నిర్వహణకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలని, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని అన్నారు. ఈ పర్యటనలో పరిశీలకుల వెంట రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# అశ్వారావుపేటలో ఘనంగా ప్రపంచ మృతిక దినోత్సవం

**అశ్వారావుపేట, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** అశ్వారావుపేట మండలం కేంద్రంలోని వ్యవసాయ కళాశాలలో ప్రపంచ మృతిక దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అసోసియేట్ డీన్ డా. జె. హేమంత్కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఓఎస్ఎ డా. ఎం. రాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి. స్రవంతి, డా. ఝాన్సీ రాణి సమన్వయం చేశారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డా. హేమంత్కుమార్ మాట్లాడుతూ భూసార పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భూసారాన్ని కాపాడినప్పుడే దీర్ఘకాలం పాటు సుస్థిరమైన దిగుబడులు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. నేల–నీటి వంటి సహజ వనరుల సంరక్షణతోనే భవిష్యత్ తరాలకు సుభిక్ష జీవనం అందించగలమని వివరించారు. తరువాత శాస్త్రవేత్త డా. ఎం. రాంప్రసాద్ రైతులు పాటించాల్సిన భూసార పరిరక్షణ పద్ధతులను వివరిస్తూ అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డా. కే. నాగాంజలి, ఆర్. శ్రీనివాస్రావు నేలకోత నివారణ మరియు సమస్యాత్మక భూముల యాజమాన్యంపై సూచనలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డా. శ్రవణ్, డా. శ్రీజన్తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# సైనిక అమర వీరుల కుటుంబాల కోసం ప్రతి పౌరుడు చేతులు కలపాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సైనిక సంక్షేమం కోసం అందించే సహాయం ఎప్పటికీ మరువలేని సేవ
- జిల్లా ప్రజలంతా ఉదారంగా సహకరించాలని పిలుపు
- ఫ్లాగ్ డే ఫండ్కు తనవంతు విరాళం అందించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, ఆర్గాన్ న్యూస్,డిసెంబర్ 5:** మన దేశం నేడు శాంతి, భద్రతలతో ముందుకు సాగుతున్నదంటే, అది సైనికుల త్యాగం వల్లే సాధ్యమవుతుందని, సైనిక అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం మనందరి నైతిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం సేకరించే సాయుధ దళాల పతాక దినోత్సవం నిధికి శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో, జిల్లా కలెక్టర్, దేశభక్తి చిహ్నమైన రిబ్బన్ ఫ్లాగ్ ను స్వీకరించి తన వంతు విరాళాన్ని అందజేశారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...**

దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ ప్రాణత్యాగం చేస్తున్న సైనికుల కుటుంబాల సంక్షేమం కోసం నిర్వహించే ఫ్లాగ్ డే ఫండ్ సేకరణ కు స్వచ్ఛందంగా ప్రజలు సహకరించాలని అన్నారు. సైనికులు దేశం కోసం ప్రాణాలను అర్పించినప్పుడు, వారి కుటుంబాలు కష్టాల్లో పడకుండా చూడటం ప్రతి పౌరుడి కర్తవ్యమూ కావాలన్నారు. మనం ఇచ్చే చిన్న సహాయం ఒక సైనికుని కుటుంబానికి ఆశగా మారుతుందని, సామర్థ్యాన్ని బట్టి ఎంతైనా ఈ నిధికి అందించాలని కోరారు. సాయుధ దళాల పతాక దినోత్సవం నిధి పూర్తిగా అమరవీరుల కుటుంబాలు, విధి నిర్వహణలో గాయపడ్డ జవాన్లు, వికలాంగులైన రిటైర్డ్ సైనికులు, వృద్ధ సైనికుల సంక్షేమ కార్యక్రమాలకు పారదర్శకంగా వినియోగించబడతాయని తెలిపారు. విద్యా, వైద్య సహాయం, పింఛన్లు, పునరావాస చర్యలు మొదలైన కార్యక్రమాల్లో ఈ నిధులు కీలక పాత్ర పోషిస్తాయి అని కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, వ్యాపారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, సాధారణ ప్రజలు ఫ్లాగ్ డే ఫండ్ కార్యక్రమానికి విస్తృతంగా సహకరించాలని కోరారు. గ్రామ, మండల స్థాయిలో కూడా అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అమరవీరుల కుటుంబాల కోసం అందించే సహాయం ఎప్పటికీ మరువలేని సేవ అని, ఇది మనం అందించే వారి త్యాగానికి కృతజ్ఞత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి యం. చంద్రశేఖర్, ఇసిహెచ్ఎస్ ఓఐసి వింగ్ కమాండర్ సురేంద్ర, ఎస్. అనూష, కళావాసు, వీరబాబు, సాయికుమార్ మాజీ సైనిక సంక్షేమ సంఘ అద్యక్షులు సుభాని, కృష్ణమూర్తి, మాజీ సైనికులు గోపాల రావు, ఎస్ యం అరుణ్, హనుమంత రావు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బాలికల మెరుపు ప్రదర్శన

## రాష్ట్ర జూనియర్ కబడ్డీలో ఖమ్మంకి మూడో స్థానం

**హాలియా/ఖమ్మం, ఆర్గాన్:** తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలు నల్గొండ జిల్లా హాలియాలో ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగాయి. మొత్తం 33 జిల్లాల జట్లు బరిలోకి దిగిన ఈ పోటీల్లో ఖమ్మం జిల్లా బాలికలు అద్భుత ప్రతిభ కనబరచి మూడో స్థానాన్ని సాధించారు. ఖమ్మం జట్టు సాధించిన విజయంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి క్రీడాకారిణులను అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, అసోసియేషన్ నాయకులు సామినేని హరిప్రసాద్, మోతారపు సుధాకర్, ప్రసాద్ రావు, డాక్టర్ సుధాకర్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కటికల క్రిస్టఫర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ బరిలోకి మళ్లీ జమలయ్య

## ప్రజల అండతో ముందుకెళ్లే అభివృద్ధి అజెండా



**కల్లూరు, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** స్థానిక టిడిపి మద్దతుతో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా జమలయ్యను బరిలోకి దింపారు. ఎమ్మెల్యేతో పాటు గ్రామ ప్రజల మద్దతు ఆయనకు లభించడంతో మరోసారి ఎన్నికల రంగంలో అడుగుపెట్టారు. 2001–2006 మధ్య సర్పంచ్గా పనిచేసిన జమలయ్య గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేసిన అనుభవం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోంది. ప్రజల అవసరాలను అర్థం చేసుకొని కార్యాచరణ చేపట్టే నాయకుడిగా ఆయనను గ్రామస్థులు అభిప్రాయపడుతు న్నారు. జమలయ్య ఈసారి అభివృద్ధిని ప్రధాన అజెండాగా తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పూర్తి శుద్ధ తాగునీటి సౌకర్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలాగే ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో స్మశాన వాటిక రోడ్లు, పంట పొలాలకు వెళ్లే మార్గాల అభివృద్ధిపై పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి లక్ష్యంతో తాను రూపొందించిన ప్రణాళికలకు టిడిపి నేతలు, కార్యకర్తలు అందిస్తున్న మద్దతుకు జమలయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దల ఆశీస్సులు, గ్రామ ప్రజల అండతో మరోసారి సర్పంచ్గా సేవ చేయడానికి అవకాశం కల్పించాలని కోరుకున్నారు.

# మంత్రి పొంగులేటి స్వగ్రామంలో ఏకగ్రీవం

- పార్టీలకతీత నిర్ణయం
- కాంగ్రెస్ అభ్యర్థికే సర్వసమ్మతి
- నారాయణపురం సర్పంచ్గా గొల్లమందల వెంకటేశ్వర్లు ఖరారు
- మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సమన్వయంతో ఏకాభిప్రాయం



**కల్లూరు ఆర్గాన్, డిసెంబర్ 5:** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురం పంచాయతీలో సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఖరారైంది. మండల పరిధిలో మూడో విడతలో జరగాల్సిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గొల్లమందల వెంకటేశ్వర్లు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో పోటీ లేకుండానే ఫలితం తేలిపోయింది.

**గ్రామ అభివృద్ధి కోసం ఏక కంఠం**

ఎస్సీ జనరల్కు రిజర్వ్ చేసిన ఈ స్థానానికి గ్రామాబివృద్ధి ప్రధాన ధ్యేయంగా గ్రామ పెద్దలు, యువకులు, అన్ని వర్గాల ప్రజలు ఒకే అభిప్రాయంతో ముందుకొచ్చారు. రాజకీయాలను పక్కనబెట్టి కాంగ్రెస్ అభ్యర్థికి సర్వసభ్య మద్దతు ప్రకటించారు. ఈ ఏకగ్రీవానికి మంత్రి సోదరుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. గ్రామంలోని అన్ని వర్గాల నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అభిప్రాయ భేదాలను సర్దుబాటు చేసి ఏకాభిప్రాయాన్ని ఏర్పరిచారు. దీంతో పంచాయతీ పాలకవర్గం మొత్తం ఏకగ్రీవంగా ఏర్పడే దిశగా మార్గం సుగమమైంది.

**మంత్రి పొంగులేటి అభినందనలు...**

ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేశ్వర్లుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రసాద్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపురం అభివృద్ధి పథంలో ఇది శుభ సూచికమని మంత్రి వ్యాఖ్యానించారు. స్వగ్రామం ఏకగ్రీవం కావడంతో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వెల్లివిరుస్తోంది.



# విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవు

- ఏసీపీ సాంబరాజు
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలి. ఎస్. హెచ్. ఓ. పొదిలి వెంకన్న

**బోనకల్ ఆర్గాన్ న్యూస్ డిసెంబర్ 5 :** ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రతి ఒక్కరు సహకరించాలని, విద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవని సిసిఆర్బి ఏసిపి సాంబరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎన్నికలలో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక ఎస్ హెచ్ ఓ పొదిలి వెంకన్న తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, ఎన్నికల నియమావళి గురించి అభ్యర్థులకు వివరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకునేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



# నోయెల్ టాటా తల్లి కన్నుమూత

**ముంబయి:** టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా తల్లి సిమోన్ టాటా అనారోగ్యంతో ముంబయిలోని సిటీ హాస్పిటల్లో శుక్రవారం కన్నుమూశారు. ఆమె వయస్సు 95 సంవత్సరాలు. 'దేశంలోని ప్రముఖ కాస్మొటిక్ బ్రాండు అయిన లాక్మే వృద్ధిలో, వెస్ట్సైడ్ ఫ్యాషన్ రిటైల్ ప్రారంభంలో ఆమె పోషించిన పాత్ర మరువలేనిది' అని టాటా ట్రస్ట్స్ నివాళి అర్పించింది. స్విట్జర్లాండ్లో జన్మించిన సిమోన్... వ్యాపార, దాతృత్వ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవారు. సర్ రతన్ టాటా ఇన్స్టిట్యూట్ సహా పలు దాతృత్వ సంస్థల కార్యకలాపాలకు ఆమె మార్గనిర్దేశం చేశారని టాటా ట్రస్ట్స్ వెల్లడించింది. కొలాబాలోని కేథడ్రల్ ఆఫ్ ద హోలీ నేమ్ చర్చిలో ఆమె అంత్యక్రియలు శనివారం జరుగుతాయని తెలిపింది.

# పుతిన్తో విందుకు థరూర్కు ఆహ్వానం


**న్యూఢిల్లీ :** భారత్లో పర్యటిస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విందు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలకు ఆహ్వానం లభించలేదు. కానీ, ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్కు ఆహ్వానం అందడం గమనార్హం. దీనిపై థరూర్ స్పందిస్తూ.. విపక్ష నేతను ఆహ్వానించని విషయం తనకు తెలియదని, తాను తప్పకుండా హాజరవుతానన్నారు. ఏ ప్రాతిపదికన ఆహ్వానం పంపించారోననే విషయం కూడా తనకు తెలియదన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు బ్రీఫింగ్ ఇచ్చేందుకు విదేశాలకు పంపించిన ఎంపీల బృందంలో థరూర్ కూడా ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల కొన్ని సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతుగా ఆయన వ్యాఖ్యలు చేస్తుండడంతో సొంత పార్టీ నుంచి విమర్శలు వస్తున్నాయి. అయితే, గతంలో ఐక్యరాజ్యసమితిలో దౌత్యవేత్తగా విధులు నిర్వర్తించిన థరూర్కు రష్యా అధికారులతో అనుబంధం ఉండడంతోనే ఈ విందుకు ఆహ్వానం అంది ఉండవచ్చని తెలుస్తోంది.

# ముస్లింల మెప్పు కోసమే చార్మినార్ జోన్ లోకి బడంగ్ పేట

**భారతీయ జనతా పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్**



**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ డిసెంబర్ 5:** మజిలీస్ పార్టీ ముస్లింల మెప్పు కోసమే బడంగ్ పేట ప్రాంతాన్ని పాత నగరంలోని చార్మినార్ జోన్ లో విలీనం చేశారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహే శ్వరం నియోజకవర్గం ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. విలీనంపై ఆయన శుక్రవారం నాగర్బుల్లో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నార్త్ వైపు ఉన్న బడంగ్ పేట తో పాటు ఆదిభట్ల, తుర్కయంజాల్, మున్సిపాలిటీలను సౌత్ జోన్ (చార్మినార్ జోన్) లో కలప డం ఎంతవరకు సమంజ సమని ప్రశ్నించా రు స్థానిక శాసన సభ్యు రాలు సవిత ఇంద్రారెడ్డి ఈ విషయంపై తక్షణమే స్పందించి ప్రభుత్వంతో మాట్లాడి చార్మినార్ లో బడంగ్ పేట విలీనం కాకుండా చూడాలని ఆయన సూచించారు.




# పోస్టల్ బ్యాలెట్తో ఓటు వినియోగం

**సూర్యాపేట ఆర్గాన్ న్యూస్ డిసెంబర్ 5:** సూర్యాపేట జిల్లా మోతే మండల పరిధిలోని 29 గ్రామాలలో ఉద్యోగం చేసే ఉద్యోగులందరు ఎలక్షన్ డ్యూటీలో ఉన్న ప్రతి ఒక్కరు ఈ నెల 7.8.9.10 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ కోసం యం పి డి ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల ఎన్నికల అధికారి టి ఆంజనేయులు చెప్పారు పోస్టల్ బ్యాలెట్ కు అవసరమైన పత్రాలను యం పి డి ఓ కార్యాలయం లో సమర్పించాలని కోరారు (1) పోస్టల్ బ్యాలెట్ అప్లికేషన్ పారం (2)ఓటర్ ప్రకటన పారం (గెజిటెడ్ అధికారి సంతకం తో (3)ఎన్నికల డ్యూటీ ఆర్డర్ జిరాక్స్( 4) ఎపిక్ కార్డు (ఓటర్ కార్డు )జిరాక్స్ వార్డు నెంబర్ సీరియల్ నెంబర్ తో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు సమర్పించాలని కోరారు.



ప్రాంతీయం

## ఏటూరు నాగారం ప్రజల కోరిక మేరకే
# సర్పంచ్ అభ్యర్థిగా పోటీ



- ఖచ్చితంగా ప్రజల ఆశీర్వాదం తో భారీ మెజారిటీతో గెలుస్తాం
- ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** ములుగు జిల్లా ఏటూరునాగారం బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత ప్రచారం సందర్భంగా స్వచ్ఛందంగా మహిళలు యువకులు ప్రచారంలో ఉంటున్నారు. ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ మా తాత ముత్తాతల నుంచి కూడా ఎంతో అనుబంధం ఉందని వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గోదావరి నది ఉప్పొంగడంతో మా తాతగారు మా పెదనాన్న వాగులోని వరద ఇళ్లలోకి చేరుకుండా కట్టలు కట్టిన చరిత్ర ఉన్నదని ఇక్కడున్న గ్రామ ప్రజలందరికీ ఆ విషయం తెలుసు మా తండ్రి కాకులమర్రి చక్రధర్ రావు సర్పంచ్ అయిన తర్వాత అప్పుడున్న ప్రభుత్వంతో అనేక ఇళ్ల స్థలాలను ఇళ్లను కట్టించడం కూడా జరిగింది మా తాత వాళ్ళ కాలం నుండి మా తాత మా నాన్న స్ఫూర్తితో వారు చేసిన సేవలో మేము కూడా నడుస్తూ నేడు ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తున్నాం ఏటూరు నాగారం ప్రజలు కూడా మమ్మల్ని అలాగనే గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు వారి ఆశలను వమ్ముచేయం ఈ గ్రామ పెద్దలు గ్రామంలో ఉన్న యువకులు ప్రజలు మా వద్దకు వచ్చి కచ్చితంగా మీరైతే ఊరు అభివృద్ధి చెందిందని సర్పంచిగా నిలబడాలని కోరడంతో ప్రజల కోరిక మేరకే మా సతీమణి కాకులమర్రి శ్రీలత బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్అభ్యర్థిగా ముందుకు వచ్చింది ప్రజలు బ్రహ్మాండంగా మమ్మలను ఆదరిస్తున్నారు భారీ మెజార్టీతో మేము గెలవడం ఖాయం అని లక్ష్మణ్ బాబు అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జవహర్ నవోదయ విద్యాలయ
# ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 515 మంది విద్యార్థులు
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్. జి

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** ములుగు జిల్లాలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలలో 515 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయనున్నారని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తన ఛాంబర్ లో జవహర్ నవోదయ విద్యాలయ అధికారులు సంబంధిత అధికారులతో పరీక్ష ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి మాట్లాడుతూ మామునూరు జవహర్ నవోదయ విద్యాలయ వరంగల్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరం లో ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు తేదీ 13.12.2025 ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని అన్నారు. ములుగు జిల్లాలో ప్రవేశ పరీక్ష కోసం ఏటూరు నాగారం లోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 162 మంది విద్యార్థులు , ములుగు బండారుపల్లి ఆదర్శ పాఠశాలలో 192 మంది విద్యార్థులు ములుగు జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 161 మంది విద్యార్థులు మొత్తం మూడు పరీక్షా కేంద్రాలలో 515 విద్యార్థులు పరీక్ష వ్రాయనున్నారని, ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు www.navodaya.gov.in వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారు విద్యాలయ హెల్ప్ లైన్ నెంబర్ 9110782213 కి ఫోన్ చేసి తమ వివరాలు తెలిపి హాల్ టికెట్ ను పొందవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు త్రాగునీరు ఎమర్జెన్సీ సర్వీస్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఇంచార్జి లక్ష్మ రెడ్డి కలెక్టరేట్ ఏ ఓ రాజ్ కుమార్ పర్యవేక్షకులు సలీం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌కు సైడ్ ఇవ్వలేదన్న అక్కసు
## బస్ డ్రైవర్‌పై దాడికి యత్నం

**వేములవాడ, డిసెంబర్ 5 :** ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ కారు డ్రైవర్ తనకు సైడ్ ఇవ్వలేదన్న కారణంతో తండ్రి వయసున్న ఆర్టీసీ డ్రైవర్ పై దారుణంగా దాడికి పాల్పడిన ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆ కారు డ్రైవర్ తీరుపై ప్రజలు మండిపడ్డారు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదుతో ఆ కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరవకముందే మళ్లీ ఇదే జిల్లాలో తన బైకుకు సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ డ్రైవర్ పై దాడికి యత్నించాడు ఓ వ్యక్తి. మద్యం మత్తులో వేములవాడ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ కండక్టర్ పై దాడికి యత్నించాడు ఆ వ్యక్తి. వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి వద్ద మూర్తి రెడ్డి అనే వ్యక్తి తన బైక్‌కు సైడ్ ఇవ్వలేదన్న చిన్న కారణంతో మద్యం మత్తులో వేములవాడ డిపోకు చెందిన బస్సు డ్రైవర్, కండక్టర్‌లపై దుర్భాషలాడుతూ దాడికి దిగేందుకు ప్రయత్నించాడు. ప్రయాణికుల ముందే బూతులు తిడుతూ నానా హంగామా సృష్టించాడు. ఘటన సమయంలో డ్రైవర్ తో పాటు స్థానికులు వీడియోలు రికార్డ్ చేయగా అవి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు విచారణ చేపట్టి, వీడియోలను ఆధారంగా తీసుకొని చర్యలకు సిద్ధమయ్యారు. డ్రైవర్లు, కండక్టర్ల భద్రతను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కూడా కోరుతున్నారు. గత 15 రోజుల క్రితం ఇదే జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన మరవకముందే మరోక ఘటన చోటు చేసుకోవడంతో ఆర్టీసీ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలను అతిక్రమిస్తూ, ప్రజలను భద్రంగా గమ్యస్థానాలకు చేర్చే తమపై వరుస దాడులు జరగడం ఆందోళన కలిగిస్తుందని ఆర్టీసీ సిబ్బంది వాపోతున్నారు.

## మేకిన్ ఇండియా కార్యాచరణపై
# ఖమ్మం ఎంపీ ప్రశ్నలు

- 'ఆత్మ నిర్భర్ భారత్' ద్వారా స్వదేశీ రక్షణ పరికరాల ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ చేపట్టింది?
- రక్షణ ఉత్పత్తి, ఎగుమతి ప్రమోషన్ విధానం (డిపిఈపిపి)-2020 వివరాలేంటి ?
- దేశీయ తయారీదారులకు సబ్సిడీ, ప్రోత్సాహకాలిస్తున్నారా ?
- రక్షణ సముపార్జన ప్రక్రియకు కేంద్రం ఏమైనా సవరణలు చేసిందా ?
- లోక్ సభలో కోరిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- లిఖితపూర్వక సమాధానమిచ్చిన కేంద్ర సహాయ మంత్రి సంజయ్ సేథ్



**న్యూఢిల్లీ డిసెంబర్ 5:** ఆత్మ నిర్భర్ భారత్ ప్రచారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్వదేశీ రక్షణ పరికరాల ఉత్పత్తిని పెంచేందుకు ఎలాంటి కార్యాచరణను ఆచరిస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. రక్షణ ఉత్పత్తి, ఎగుమతి ప్రమోషన్ విధానం (డీపీఈపీపీ)-2020 వివరాలేం టని, దేశీయ తయారీ దారులకు సబ్సిడీ, ప్రోత్సాహకాల గురించి, రక్షణ సమ-ుపార్జన ప్రక్రియకు కేంద్రం ఏమైనా సవరణలు చేసిందా..? వివరాలు తెలపాల్సిందిగా కోరారు. దీనికి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

### రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కొన్నేళ్లుగా కేంద్రం చర్యలు..

దేశ రక్షణ పరికరాల తయారీలో స్వదేశీ రూపకల్పన, పరిశోధనాభివృద్ధిని ప్రోత్సహించేందుకు గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్ ప్రచారం ద్వారా స్వదేశీ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ తెలిపారు. రక్షణ సముపార్జన విధానం (డీఏపీ)-2020 కింద మనదేశ వనరులకు, ఐడిడిఎం రూపొందించిన వాటికే ప్రాధాన్య మిస్తున్నామని పేర్కొన్నారు.

### 509 సేవలు, 5,012 వస్తువులతో స్వదేశీకరణ జాబితా..

మొత్తం 509 సేవల అంశాలు, 5,012 వస్తువులతో కూడిన ఐదు సానుకూల స్వదేశీకరణ జాబితాలతో పరిమితికి మించి దిగుమతులపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. స్వదేశీకరణను ప్రోత్సహించడానికి లైసెన్సింగ్ విధానాన్ని, ప్రభుత్వ మార్గంలో 100 శాతం వరకు ఎఫ్ డీఐని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని సరళీకరించి, మన సూక్ష్మ, చిన్న మరి మధ్య తరహా సంస్థలు( ఎంఎస్ఎం ఈ) పాల్గొని ఐడెక్స్ పథకాలతో డిఫెన్స్ ఎక్సలెన్స్ ఆవిష్కరణలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

### రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు, ఆర్థిక సహాయ నిధి సౌలభ్యం

దేశంలో రక్షణ తయారీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి పేర్కొన్నారు. లైసెన్సింగ్ అగ్రిమెంట్ ఫర్ ట్రాన్స్ఫర్ ఆఫ్ టెక్నాలజీ ( ఎల్ఏటిఓటి), డెవలప్మెంట్ కం ప్రొడక్షన్ పార్ట్నర్ (డిసిపిపీ) ద్వారా డిఆర్డిఓ అభివృద్ధి చేసిన టెక్నాలజీని పరిశ్రమలకు బదిలీ చేస్తున్నామని, భారతీయ పరిశ్రమలకు ఆర్థిక సహాయం అందించే టెక్నాలజీ డెవలప్మెంట్ నిధి (టీడీఎఫ్)ని ప్రారంభించామని, డిఆర్డిఓ వెబ్‌సైట్‌లోని పేటెంట్ల వివరాలను పరిశ్రమల్లో వినియోగానికి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఎగుమతి ప్రోత్సాహక విధానం (డీపీఈపిపీ)-2020 ముసాయిదా దశలోనే ఉందని, స్వదేశీకరణను ప్రోత్సహించేందుకు (డిఎపి)ని ఎప్పటికప్పుడు సవరించుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు వివరించారు.



# గిరిజనుల పట్టా భూమిలో అక్రమ నిర్మాణాల నిలుపుదల
## ఎల్‌టిఆర్ జడ్జిమెంట్ మేరకు నోటీసులు

**ములుగు జిల్లా, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** ములుగు జిల్లా షెడ్యూల్ ఏరియాలోని మంగపేట మండలం పద్మార్ రెవెన్యూ గ్రామంలో గిరిజనుల పట్టా భూమిపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ఎల్‌టిఆర్ జడ్జిమెంట్ ప్రకారం గిరిజనేతరులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. పట్టా రికార్డుల ప్రకారం ముక్తి పాపయ్య, ముక్తి పొట్టి, ముక్తి రాములు పేర్లలో సర్వే నంబర్ 95లో 0.24 గుంటలు, సర్వే నంబర్ 96లో 1.35 గుంటల భూమి ఉంది. అయితే గిరిజనేతరులు కళ్లబోయిన కోమరయ్య, కళ్లబోయిన శ్రీను ఈ భూమిని కబ్జా చేసి, గిరిజనులకు తెలియకుండా షెడ్యూల్ ఏరియాకు సంబంధించిన 1/59, 1/70, పీసా చట్టాలకి విరుద్ధంగా ఎండి హుస్సేన్ అనే మరో గిరిజనేతరుడికి విక్రయించారు. ఈ భూమిపై ఎండి హుస్సేన్ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించగా, అసలు వారసులైన ఆదివాసీ కుటుంబానికి చెందిన ముక్తి రాములు, ముక్తి లక్ష్మి ఇది తమ పూర్వీకుల పట్టా భూమి అని పునరావృతంగా తెలియజేశారు. అయినప్పటికీ డబ్బు, రాజకీయ మద్దతుతో అక్రమ నిర్మాణం కొనసాగించారని వారు ఆరోపించారు. దీంతో బాధితులు ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఆశ్రయించగా, షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరుల భూబదలాయింపులు చట్ట విరుద్ధమని గుర్తించి ఎల్‌టిఆర్ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేశారు. ఎల్‌టిఆర్ కేసు నం. ఎ/04/ఎల్‌టిఆర్/ఎంఎన్‌పీటి/2025 గా ట్రైబల్ కోర్టులో నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. కేసు పెండింగ్‌లో ఉన్నందున సంబంధిత స్థలంలో ఎవరూ పనులు కొనసాగించరాదని హెచ్చరికగా రెవెన్యూ అధికారులు ఫ్లెక్సీ బోర్డు ఏర్పాటు చేశారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజన భూహక్కులను రక్షించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# ముగిసిన మూడోదశ నామినేషన్లు

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రావారంతో నామినేషన్ల పక్రియ పూర్తయింది. మూడో దశ నామినేషన్ల స్వీకరణలో భాగంగా ఆఖరిరోజు నామినేషన్లు స్వీకరించారు. చివరి రోజు కావడంతో నామినేషన్ల పక్రియ ఊపందుకుంది. సాయంత్రం 5 గంటల వరకే నామినేషన్లు స్వీకరించాల్సి ఉన్నా.. ఎక్కువ మంది నామినేషన్లు వేయడంతో కేంద్రాలన్ని కిటకిటలాడాయి. గడువు లోను నామినేషన్ కేంద్రాలలోకి వచ్చిన అభ్యర్థులకు టోకెన్లు ఇచ్చి ఆలస్యంగానైనా నామినేషన్లను స్వీకరించారు దీంతో మూడో దశ ఆఖరిరోజు నామినేషన్ల స్వీకరణ పక్రియ ముగిసింది. మూడో విడతలో మొత్తం182 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. అందులో భాగంగా 4 వేల159 సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు వేశారు. శనివారం మూడో దశ నామినేషన్ల పరిశీలన ఉంటుంది. డిసెంబర్ 9న ఉపసంహరణ ఉంటుంది.

# రఘునాథగూడెం అభ్యర్థుల నామినేషన్ల పర్వం

- కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా సుధారాణి
- బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా వరలక్ష్మి

**కల్లూరు,ఆర్గాన్ న్యూస్,డిసెంబర్ 5:** మండలంలోని రఘునాథగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు వరుసగా నామినేషన్ దాఖలు చేశారు. తమ అనుచరులతో భారీ ర్యాలీలుగా బయల్దేరిన నాయకులు చంద్రుపట్ల గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రానికి చేరుకొని,ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పత్రాలను సమర్పించారు. సర్పంచ్





పదవికి గెలిపిస్తే గ్రామాభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తామని రెండు పార్టీల అభ్యర్థులు ప్రజలకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అనుచరుడు రానా సతీమణి కుక్కా సుధారాణి రాణా నామినేషన్ వేయడం జరిగింది. ఇక బీఆర్ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్యే సండ్ర సహకారంతో మాజీ సర్పంచ్ కుక్కా అంజన్ రావు సతీమణి వరలక్ష్మి నామినేషన్ పత్రాలను దాఖలు చేసినారు.

# దత్తత దిశగా అడుగులు


- రాజకీయంగా మూడు తరాల ప్రస్థానం
- అందుబాటులో ఉంటా.. ఆదరించండి
- సర్పంచ్ అభ్యర్థిగా యాస భాగ్యలక్ష్మి



**కల్లూరు,ఆర్గాన్ న్యూస్,డిసెంబర్ 5 :** మూడు తరాలుగా గ్రామానికి సేవ చేస్తున్నామని ప్రజల మద్దతుతోనే గ్రామాన్ని అభివృద్ధి చేశామని ప్రస్తుతం సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి యాస భాగ్యలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త యాస రామకృష్ణ మూడు తరాలుగా రాజకీయ ప్రస్తాన కొనసాగిస్తూ గ్రామాభివృద్ధి కోసం ఎనలేని కార్యక్రమాలు, నిర్మాణాలు, రోడ్లు వేశామని అన్నారు. గ్రామ ప్రజలు సర్పంచ్ గా గెలిపిస్తే మంత్రి పొంగులేటి దత్తత గ్రామంగా అన్ని విధాలా గ్రామాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో ప్రజావైద్యశాల, చిన్నకోరుకొండి నుండి వెన్నవల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణం,పటిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ,నిరుద్యోగుల కోసం లైబ్రరీ నిర్మాణాలను పూర్తి చేస్తామని అన్నారు. 500 ఎకరాల భూమి సాగు కోసం లిఫ్ట్ ఇరిగేషన్ ను తెచ్చి రైతులకు మేలు చేశామని, వృద్ధులకు రైతులకు నగదు లావాదేవిలకు ఇబ్బంది కలగకుండా బ్యాంకు సేవలను అందు బాటులోకి తెచ్చామని, విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రాన్ని చిన్న కోరుకొండిలో ఏర్పా టు చేయించామని అన్నారు. చింతలచెరువు, నల్ల చెరువుల పూడిక తీయించి నీటి నిల్వలను పెంచామని అన్నారు. అధికా రం ఉన్నా లేకున్నా స్వలాభం చూసుకోకుండా ప్రజా సేవ చేశామని అన్నారు. ప్రజలకు నిత్యం అందుబా టులో ఉంటూ అన్ని విధాల సహకరిస్తానని పొంగులేటి ప్రధాన అనుచరులుగా ఆయన సహకారంతో పని చేస్తామని అన్నారు. యాస కుటుంబం పదవుల కోసం పనిచేయదని ప్రజల ప్రయోజనార్థమే పనిచేస్తుందని అన్నారు. అదే ప్రజల మద్దతు కోరుతూ పోటీకి సిద్ధమవుతున్నానని, సహకరించాలని గ్రామస్తులను కోరారు.

# గీతా పారాయణం చెయ్యండి.. రాతను మార్చుకోండి

## ప్రముఖ న్యాయవాది మాత శ్రీ జానకమ్మ



**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ డిసెంబర్ 5:** గీతను పారాయణం చేయండి రాతను మార్చుకోండి అని అన్నారు. ప్రముఖ న్యాయవాది మాత శ్రీ జానకమ్మ మహబూబ్నగర్ జిల్లా పరిధిలోని బాలానగర్ మండలం ఇన్సూరెన్స్బద్ద రేవల్లి గ్రామంలో జరిగిన గీతా సప్తాహక ఉత్సవాలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంట్లో గీతా పారాయణం జరగాలని ప్రతివారు గీతను అర్థం చేసుకోవాలని రాతను మార్చుకోవాలని, శ్రీకృష్ణుని బోధన ను ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని కోరారు. భగవద్గీత అనేది చావు దగ్గర వాడే గీతం కాదని బతికున్న వాడి జీవితాన్ని మార్చేది గీత అని అన్నారు. కిషన్ ప్రభు గీతా ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి అధ్యక్షులు ఉమ్మెత్తల మహేశ్వర్, శ్రీనివాసరెడ్డి, భూమా నంద స్వామి, తిరుమలనాథ స్వామి ఆలయ చైర్మన్, సాదు వెంకటరెడ్డి, పెద్ద రేవల్లి భజన మండలి అధ్యక్షులు గన్నోజు వెంకటయ్య చారి, శేఖర్ గౌడ్, బత్తుల చెన్నయ్య మాదుగుల చిన్న ఆంజనేయులు, అయ్యప్ప దీక్ష పరులు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## కోకాపేటలో మరికొంత
# భూమి వేలం
### ఎకరాకు రూ.77 కోట్ల 75 లక్షలకు పలికిన ధర

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** కోకాపేట భూములు భూములకు ఉన్న డిమాండ్ ప్రస్తుతం తెలంగాణలో ఎక్కడా లేదు. వేలంలో హెచ్ఎండిఎకు కోట్లు కురిపిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.151 కోట్లు పలికి రికార్డు సృష్టించిన భూములు.. నాలుగో విడతలో కూడా భారీగా అమ్ముడుపోయాయి. శుక్రవారం కోకాపేట గోల్డెన్ మైల్ లోని 1.98 ఎకరాలకు ఈ వేలం వేశారు అధికారులు. వేలంలో ఎకరాకు రూ.77 కోట్ల 75 లక్షలకు దక్కించుకుంది ప్రైవేట్ ఎడ్యుకేషన్ మేనేజ్మెంట్ సంస్థ. 1.98 ఎకరాలకు వేలంగా వేయగా.. రూ.154 కోట్లు పొందించినట్లు ప్రకటించింది. ఈసారి నాలుగు విడతల్లో విడతల్లో కోకాపేట లో 29 ఎకరాలకు 3,862 కోట్ల రూపాయలు పొందింది.

# ప్రాంతీయం

# అన్ని వసతులతో
# అంధుల పాఠశాల నిర్మాణం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- విద్య, భద్రత, నైపుణ్యాభివృద్ధి కోసం ఆధునిక వసతులతో ప్రత్యేక స్కూల్ నిర్మాణం
- అంధ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌళిక సదుపాయాల ఏర్పాటు
- ఖమ్మం జెడ్పీ సెంటర్ లోని నిజాంపేట ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అంధుల ప్రత్యేక స్కూల్ నిర్మాణ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం,ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** అంధుల విద్యాభివృద్ధి కోసం అత్యున్నత ప్రమాణాలతో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం జెడ్పీ సెంటర్ లోని నిజాంపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక అంధుల పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి భవన నిర్మాణ నాణ్యత, ప్రహారీ గోడ గేట్, ప్రవేశ మార్గాలు, అంతర్గత గదుల రూపకల్పన, ఆర్కిటెక్చర్ ఆకృతిని విషయ నిర్ధారణతో మానిటర్ చేశారు. తరగతి గదులు, నైపుణ్యాభివృద్ధి కోసం ఏర్పాట్లు, మ్యూజికల్ పార్క్, సదుపాయాల నమూనా మ్యాప్‌లు, డిజైన్ ఫోటోలను పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. అంధులు పాఠశాలలో ప్రవేశించిన క్షణం నుంచి బయటికి వెళ్లే వరకు పూర్తిస్థాయి భద్రత, సౌలభ్యం లభించేలా నిర్మాణంలో ప్రతిదీ ఖచ్చితత్వంలో ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...**

అంధుల విద్యా అవకాశం దృష్ట్యా ప్రత్యేక పాఠశాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తూ, పనులను వేగవంతం చేసి అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. అంధ విద్యార్థులు స్వతంత్రంగా కదలాడేందుకు వీలుగా పాఠశాలను పూర్తిగా బారియర్ ఫ్రీ విధానంలో నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. పాఠశాల అంతటా టాక్టైల్ పాత్‌లు, గైడింగ్ రైలింగ్స్, రఫ్-సర్ఫేస్ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేయనున్న సెన్సరీ రూమ్, సెన్సరీ గార్డెన్ అంధ విద్యార్థులలో స్పర్శ, శబ్దం, వాసన, దిశ అవగాహన వంటి సామర్థ్యాలను పెంచుతాయని కలెక్టర్ వివరించారు. హైదరాబాద్ లాంటి ప్రత్యేక విద్యా మోడళ్లను ఆధారంగా తీసుకుని ఈ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంధ విద్యార్థులకు పాఠశాలలో బ్రెయిల్ లిపి పుస్తకాలు, ఆడియో బుక్స్, లెర్నింగ్ డివైజ్‌లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని అన్నారు. నేటితరానికి అనుగుణంగా అంధుల్లో ముఖ్యమైన నైపుణ్యం, కంప్యూటర్ స్కిల్స్ కోసం ల్యాబ్‌ను స్మార్ట్ టెక్నాలజీతో ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ స్క్రీన్ రీడర్లు, డిజిటల్ లెర్నింగ్ మాడ్యూల్స్ ద్వారా పాఠాలు నేర్చుకునేలా వాతావరణం ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ప్రమాదావకాశం లేకుండా చైల్డ్-సేఫ్ స్విచ్‌లు, హై క్వాలిటీ వైరింగ్, అనుకూలమైన లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అంధ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన డెస్కులు, కుర్చీలు, నేర్చుకునే పరికరాలు వినియోగించాలన్నారు. అంధుల పాఠశాల పూర్తయిన తర్వాత ఖమ్మం జిల్లాలోని అంధ విద్యార్థులకు ఇది ఒక ఆధునిక విద్యా కేంద్రంగా నిలువాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, పంచాయతీరాజ్ ఇఇ మహేష్ బాబు, ఏఈ చిరంజీవి, సంబంధిత విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో
# పల్లె సీమకు ప్రాణం పోద్దాం

**శ్రీ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మిడిదొడ్డి నరసింహ**



**రంగారెడ్డి ప్రతినిధి ఆర్గాన్ న్యూస్ డిసెంబర్ 5:** పచ్చటి పల్లెలు కునారిల్లుతున్నాయని శ్రీ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, మిడిదొడ్డి నరసింహ అన్నారు. శుక్రవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ పల్లె దేశాలకు బొడ్రాయి లాంటిదని, గ్రామాలలో గెలిచే సర్పంచులు ఇంటికి పెద్దగా గ్రామాలను తీర్చిదిద్దవలసిన అవసరం ఉందని ఆ బాధ్యతను యువనాయకత్వం, ఈసారి తమ చేతుల్లోకి తీసుకోవాలని శ్రీ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, మిడిదొడ్డి నరసింహ అన్నారు. పల్లెలు, కునారిల్లిపోతున్నాయి అనే విషయాన్ని గమనంలోకి తీసుకొని మన తరం అధికారంతీసుకుంటే గ్రామ స్వరాజ్యాలు వర్ధిల్లుతాయని అన్నారు . గ్రామ అభివృద్ధిని మన అందరి అభివృద్ధి గా భావించి యువనాయకత్వం సర్పంచులుగా ఎదగాలని అవినీతితో నిండిపోయిన వ్యవస్థ ప్రక్షాళన జరగాలంటే సామాజిక స్పృహ కలిగిన యువనాయకత్వం ముందుకు రావాలని కోరారు. ప్రపంచీకరణతో చేతివృత్తులు వ్యవస్థలు ధ్వంసమై గ్రామీణ భారతం వలస బాట పట్టిందని గ్రామం సగర్వంగా అభివృద్ధి ఆత్మ గౌరవంతో నిలిచినప్పుడే దేశం ప్రగతి పథంలో పురోగమిస్తుందని అన్నారు గ్రామాలు అన్ని రంగాలలో స్వయం సంప్రదిద్ధితో నిలిచినప్పుడే నిజమైన భారత్ విలసిల్లుతుందని అన్నారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా గ్రామాలకు మరిన్ని నిధులు ఇవ్వాలని ప్రాణాపాయ సమయాలలో పేదలను తరలించేందుకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని మధ్యాహ్నం భోజన పథకం అల్పాహారం వంటి అత్యవసర సర్వీసులను ఆగకుండా చూడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల అన్నింటిని కిందిస్థాయి వరకు అందరికీ అందేలా చూసే నేటి యువతరం తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పితే ప్రతి గ్రామం ఆర్థికంగా నిలదొక్కుకుంటుందని ఆర్థిక సామాజిక శాస్త్ర సాంకేతిక రంగాలను గ్రామ రాజ్యం పునర్నిర్మాణం జరగాలని ప్రతి గ్రామం ఉత్పత్తి కేంద్రంగా మారాలని గ్రామం ఉపాధి కేంద్రంగా మారినప్పుడే నిరుద్యోగ సమస్య పోతుందని, మా గ్రామాన్ని నేనే బాగు చేసుకుంటాను అని ప్రతి యువకుడు ప్రతిన పూనాల్సిన సమయం ఆసన్నమైనదని అన్నారు. గ్రామ అభ్యుదయమే ధ్యేయంగా పనిచేసే గ్రామాన్ని స్వయం సమృద్ధిగా నిలిపే కొత్తతరం నాయకుల కోసం ప్రతి గ్రామం ఎదురుచూస్తుందని, అందుకే యువత పెద్ద ఎత్తున స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి మన గ్రామాన్ని మనమే బాగు చేసుకుందామని ప్రతిజ్ఞ చేయవలసిన అవసరం ఉంది అన్నారు.



# కారణజన్ములు ఘంటసాల

**కరుణాకర్ టైమ్స్ ఆఫ్ ఇండియా**

**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** కారణజన్ములు ఘంటసాల వెంకటేశ్వరరావు అని టైమ్స్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్న జర్నలిస్టు కరుణాకర్ అన్నారు. నల్లగొండలో ఘంటసాల 103 వ జయంతి సందర్భంగా గురువారం చిన్న వెంకటరెడ్డి మినీ ఫంక్షన్ హాల్ రవీందర్ నగర్ లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంగీత సాధన కోసం జోలె పట్టి వారాలు చేసుకుని అన్నం తిని, ఎంతోమంది దర్శకులు నీ గొంతు సినిమాకు పనికిరాదు అని దూషణ భూషణలు చేసిన పట్టు పట్టి సంగీత ప్రపంచంలో తెలుగు ప్రజలు చేసుకున్న కొంచెం పుణ్యంతో తెలుగు వాడిగా పుట్టిన ఘంటసాల నిజంగా అద్భుతమైన వ్యక్తి అని అలాంటి శక్తి వ్యక్తి మళ్ళీ పుట్టడని కరుణాకర్ అన్నారు. గౌరవ అతిథి ప్రసిద్ధ న్యాయవాది అక్కినేపల్లి మురళీధర్ రావుమాట్లాడుతూ సంగీతం, రాష్ట్రాలకు ప్రాంతాలకు, దేశాలకు, అతీతం అని ఎక్కడో చౌటపల్లిలో పుట్టిన ఘంటసాల వెంకటేశ్వరరావు ఈరోజు ప్రతి ఇంట్లో ఒక గీతామృతాన్ని పంచుతు నభూతో నభవిష్యతి అనే చందంగా తెలుగు వారి హృదయాలలో గూడు కట్టుకొని ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. సింధూర ఎం ఉన్నతి ప్రార్థన గీతం పాడగా కార్యక్రమాన్ని గుండ్లపల్లి సుమలత వి ఆర్ కే పణి, టి అంజి బాబు, ప్రధాన్య, రిషిల్( హైదరాబాద్) పాల్గొనగా కార్యక్రమం సమర్పణ కొలనుపాక రవికుమార్ ఎం.వి.ఆర్ విద్యాసంస్థల అధినేత. హాజరయ్యారని కార్యక్రమ పర్యవేక్షణ ఘంటసాల కల్చర్ అసోసియేషన్ నల్లగొండ డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది

**అలరించిన సంగీత విభావరి...** కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన అక్కినేపల్లి మురళీధర్ రావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయని గాయకులు పాడిన గోరింక గూటికే చేరావే చిలక, నిన్న లేని అందం ఏదో నిదుర లేపేనెందుకో అలిగిన వేళ ని చూడాలి, ఈనాటి ఈ హాయి ఏనాటిదో,, పాట పాడనా ప్రభు అనే ఘంటసాల గొంతు నుండి జాలువారిన పాటలు గాయనీ గాయకులు పాడి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమం అనంతరం కార్యక్రమాన్ని నిర్వాహకులు శ్రీ ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ నల్లగొండ నిర్వాహకులు పురుషోత్తమాచార్యులు వందన సమర్పణతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# బిజెపి మహాధర్నాను జయప్రదం చేయండి

- రెండేళ్లుగా అమలుకు నోచుకోని హామీల కోసం ప్రజా వంచన కాంగ్రెస్ పాలనపై నిరసన
- భారతీయ జనతా పార్టీ బడంగ్ పేట క్లస్టర్ల అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీర కర్ణ రెడ్డి

**రంగారెడ్డి ప్రతినిధి,ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** రెండు సంవత్సరా లుగా అమలు కాని హామీల కోసం ప్రజా వంచన కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ బిజెపి చేప ట్టిన మహా ధర్నాను డిసెంబర్ 7 ఉదయం 9 గంటలకు ఇందిరాపార్క్‌లో జయప్రదం చేయాలని మహేశ్వరం నియో జకవర్గం బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ క్లస్టర్ 1 అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృ ష్ణారెడ్డి, క్లస్టర్ 2. రామిడి వీర కర్ణ రెడ్డి కోరారు. ఈ ధర్నా కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ శ్రేణులన్నీ కదలి రావాలని పిలుపునిచ్చారు కాంగ్రెస్ మోసపూరిత పాలనకు వ్యతిరేకంగా రెండు సంవత్సరాలుగా అమలు కానీ హామీల సాధనే ధ్యేయంగా సమర శంఖం పూరించాల్సిన సమ యం ఆసన్నమైందని అన్నారు. ప్రజలను వంచిస్తున్న కాం గ్రెస్ ప్రభుత్వం మెడలు వంతడానికి ప్రజల పక్షాన నిలబ డేందుకు బిజెపి నిర్వహిస్తున్న మహా ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు.

# కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్

**కల్లూరు, ఆర్గాన్ న్యూస్,డిసెంబర్ 5:** స్థానిక సంస్థల పోరులో స్వపక్షమే ప్రతిపక్షంగా పోటీ పడుతూ ఎవరికి వారే నామినేషన్ దాఖలు చేస్తున్నారు.పలు గ్రామాలలో త్రిముక పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్ గా పోటీ చేయడం స్థానిక ప్రజలలో చర్చనీయాంశమైంది. రిజర్వేషన్ల పరంగా అవకాశం రావడంతో నేనంటే నేను అన్న చందాగా సర్పంచ్ పదవి దక్కించుకునే విధంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే కొంతమంది నామినేషన్లు వేయగా అదే పార్టీ నుంచి మరికొందరు నామినేషన్లు వేశారు.మండలంలోని చిన్న కోరుకొండి,మర్లపాడు,పెద్ద కోరుకొండి, పేరువంచ,గ్రామాలలో అభ్యర్థులు బరిలో ఉండడం విశేషం.పోటీలో ఉన్న అభ్యర్థి మాత్రం ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన ఆలోచనలతో పోటీలో ఉన్నానని తెలిపారు.మండల పరిధిలోని పెద్ద కోరుకొండి గ్రామపంచాయతీ నందు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీపడుతున్న దేవవరపు సత్యనారాయణ నాగమణి దంపతులు తన తండ్రి దేవవరపు సుబ్బయ్య ఆశయం కోసమే సర్పంచ్ పోటీకి సిద్ధమవుతున్నానని తెలిపారు. గ్రామపంచాయతీలో పార్టీ బలోపేతానికి కీలకంగా వ్యవహరించారని అన్నారు. సహజంగా దానగుణం





కలిగిన ఆయన పలు సందర్భాలలో దాతృత్వం చాటుకున్నారని అన్నారు.మూడు లక్షల రూపాయలతో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని పీర్ల సావిడికి సైడ్ వాల్ మట్టితోలించారని రామాలయం మండపానికి బొడ్రాయికి మండపాలు ఏర్పాటు చేశారని నవగ్రహాల మండపం ఏర్పాటుకి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రతికినంత కాలం పార్టీ కోసమే పని చేసి అవకాశం రాక తన కోరిక అలాగే మిగిలిపోయిందని అందుకు తగ్గట్టుగానే దేవవరపు సుబ్బయ్యను సర్పంచ్ గా చూడాలని ప్రజల కోరిక నెరవేర్చడానికి ఆయన వారసుడుగా ప్రజల మద్దతుతో సర్పంచ్ పోటీకి బరిలో ఉన్నానని తెలిపారు.శుక్రవారం స్థానిక నాయకులు,కార్యకర్తలు అభిమానుల నడుమ భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేశారు.అధిష్టానం స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల సహకారంతో ముందుకెళ్తారని అన్నారు, ఎక్కడైతే రెబల్ అభ్యర్థులుగా పోటీ జరుగుతుందో ఆ గ్రామాలలో స్థానిక నేతలతో చర్చించి సమన్వయ పరుస్తారని గెలుపు రేసులో ఉన్నవారికి అవకాశం ఇచ్చి తదుపరి సమయాల్లో పార్టీకి పదవులు కట్ట పెడతారని సమాచారం,ఏం జరుగుతుందో వేచి చూడాలి.



## హైదరాబాద్‌లో ‘ఆపరేషన్ కవచ్’..

**హైదరాబాద్:** నగరంలో శాంతి భద్రతలు పటిష్టం చేసేందుకు హైదరాబాద్ పోలీసులు ‘ఆపరేషన్ కవచ్’ పేరుతో అకస్మాత్తుగా నాకాబందీ చేపట్టారు. శుక్రవారం రాత్రి దాదాపు 5 వేల మంది పోలీసులతో ఏకకాలంలో 150 కీలక ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, టాస్క్ ఫోర్స్, ఏఆర్, కోల్ట్స్, పెట్రోలింగ్ బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఇవి జరిగాయి. ప్రజా భద్రతకు చేస్తున్న తనిఖీలకు ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ కోరారు. అనుమానాస్పద కదలికలపై డయల్ 100కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కమిషనరేట్ చరిత్ర ఓలో ఇంత మంది పోలీసులతో నాకాబందీ చేపట్టడం ఇదే తొలిసారి.

## తీన్మార్ మల్లన్న ఆఫీస్ వద్ద యువకుడి ఆత్మహత్యాయత్నం

**రంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, డిసెంబర్ 5:** తీన్మార్ మల్లన్న కార్యాలయం ముందు ఒక యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు జగద్గిరిగుట్టకు చెందిన సాయి ఈశ్వర్ (30) కార్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు గురువారం సాయంత్రం పీర్జాదిగూడలోని వరంగల్ హైవే పక్కన ఉన్న తీన్మార్ మల్లన్న కార్యాలయం వద్దకు వచ్చి మల్లన్నను కలవాలని ఆఫీసు సిబ్బందికి చెప్పాడు. మల్లన్న కార్యాలయంలో లేడని రేపు రమ్మని సిబ్బంది తిప్పి పంపారు దీనితో సాయి ఈశ్వర్ మెట్లపై నుంచి కిందికి వచ్చి పెట్రోల్ ఒంటి మీద పోసుకొని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పారు అనంతరం అతడి ని ఎందుకు ఆత్మహత్య ప్రయత్నం చేసావు అని అడగగా బీసీ ఉద్యమం కోసం అనడం వినిపించిందని స్థానికులు తెలిపారు. తీవ్ర గాయాలతో ఉన్న సాయి ఈశ్వర్ ని మేడిపల్లి పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తీన్మార్ మల్లన్న గాంధీ ఆసుపత్రికి వెళ్లినట్లు ఈశ్వర్ ని పరామర్శించినట్లు తెలిసింది.దీనిపై పోలీసులు ఇంకా వివరాలు వెల్లడించలేదు.

# కమలాపురం పంచాయతీ ఏకగ్రీవం

- సర్పంచ్‌గా వడ్డె సులోచన... ఉప సర్పంచ్‌గా దూదిపాళ్ల భాస్కర్‌రావు
- ఏకగ్రీవం కావడంలో సీఎం రేవంత్ పీఆర్వో ఎన్ఆర్ఐల కృషి..



**కారేపల్లి,ఆర్గాన్ న్యూస్ డిసెంబర్ 5:** సింగరేణి మండల పరిధిలోని కమలాపురం పంచాయతీ ఎన్నిక ఏకగ్రీవమైంది.నామినేషన్ల గడువు ఆఖరిరోజైన శుక్రవారం సాయంత్రానికి అన్ని స్థానాలకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది.ఏకగ్రీవాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.గ్రామంలో 8 వార్డులుండగా రెండు వార్డులు జనరల్,రెండు వార్డులు జనరల్ మహిళ,నాలుగు వార్డులు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. సర్పంచిగా వడ్డె సులోచన అలియాస్ రాథోడ్ సులోచన (కాంగ్రెస్)1వ వార్డు సభ్యునిగా గుత్తా గంగయ్య (కాంగ్రెస్) 2వ వార్డు సభ్యునిగా దూదిపాళ్ళ భాస్కర్ రావు (టీడీపీ)5వ వార్డు సభ్యురాలిగా అన్నాప్రగడ శాంత కుమారి (టీడీపీ)6వ వార్డు సభ్యురాలిగా శాగంటి వాణిశ్రీ (కాంగ్రెస్)7వ వార్డు సభ్యురాలిగా బండి జ్యోతి (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.రెండో వార్డు సభ్యుడు దూదిపాళ్ళ భాస్కర్ రావును (తెలుగు దేశం పార్టీ) ఉప సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు.

**నాడు రాజకీయ ఘర్షణలు.. నేడు ఐక్యతా రాగం**

సింగరేణి మండలంలో కమలాపురం అంటేనే రాజకీయ ఘర్షణలకు కేంద్రం. సీపీఐ-కాంగ్రెస్ వర్గాల మధ్య 40 ఏళ్లకుపైగా టీడీపీ-కాంగ్రెస్ వర్గాల మధ్య పాతికేళ్లకుపైగా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఘర్షణలను నివారించలేని పోలీసు శాఖ ఓ దశలో చిన్నకేసులో గ్రామానికి చెందిన 70 మందికిపైగా వరంగల్ సెంట్రల్ జైలుకు పంపింది.తర్వాత కాలంలో క్రమంగా ఘర్షణలు తగ్గుముఖం పట్టినా రాజకీయ వైరం కొనసాగింది.గత శాసనసభ ఎన్నికల సమయంలోనూ కొంత ఉద్రిక్తత నెలకొంది.గ్రామానికి చెందిన ముఖ్యమంత్రి పీఆర్వో దూదిపాళ్ళ విజయ్, ఎన్ఆర్ఐలు రేపాల సతీష్, వడ్డె సంపత్,శాగంటి లక్ష్మీనారాయణ తదితరులు గ్రామస్థులను ఐక్యం చేసి ఏకగ్రీవంగా చేసేందుకు ప్రయత్నించారు.ఇందుకు గ్రామానికి చెందిన కాంగ్రెస్, టీడీపీ,బీఆర్ఎస్ నాయకులు సహకరించారు. వడ్డె సులోచన గత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతుతో సర్పంచిగా పోటీ చేసి ఓడిపోయారు.ఈ దఫా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .సీనియర్ కాంగ్రెస్ నేత వడ్డె సీతారామయ్య చిన్న కుమారుడైన రంగారావు సతీమణి ఆమె సీతారామయ్య కుటుంబం తొలి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతోంది.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతూ మండలంలో ముఖ్య నాయకునిగా ఉన్న దూదిపాళ్ళ భాస్కర్ రావు ఉప సర్పంచిగా ఎన్నికయ్యారు. భాస్కర్ రావు ఆధ్వర్యంలో కమలాపురంలో ప్రతి ఏటా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 2016లో కమలాపురంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. భారీ ఎత్తున జరిగిన కార్యక్రమంలో నాడు టీడీపీ నేతలుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి, సీతక్క,సండ్ర వెంకటవీరయ్య,పోట్ల నాగేశ్వరరావు,హరిప్రియ, ప్రస్తుత ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఒక్క ఎస్టీ కుటుంబం లేని గ్రామం**

షెడ్యూల్ ఏరియాలోని కమలాపురం గ్రామంలో ఒక్క ఎస్టీ కుటుంబం లేదు. ప్రస్తుతం సర్పంచిగా ఎన్నికైన సులోచన, అయిదో వార్డు సభ్యురాలు శాంత కుమారికి గ్రామానికి చెందిన జనరల్ కులాలకు చెందిన వ్యక్తులను వివాహం చేసుకున్నారు.రిజర్వేషన్లు వీరికి అనుకూలించాయి. రిజర్వేషన్లకు తగినట్లు అభ్యర్థులు లేకపోవడంతో 3, 4,8వ వార్డులు వచ్చే అయిదేళ్లు ఖాళీగానే ఉండనున్నాయి.

# దావోస్ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్

## వార్ రూమ్‌ను సందర్శించిన సిఎం రేవంత్



**హైదరాబాద్, డిసెంబర్ 5 :** తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్లోబల్ సమిట్‌ను దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు స్థాయిలో నిర్వహించాలని సీఎం చెప్పారు. ప్రజాభవన్‌లో గ్లోబల్ సమిట్ వార్ రూమ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించి.. ఏర్పాట్లపై సమీక్షించారు. తెలంగాణ దీర్ఘకాలిక భవిష్యత్ లక్ష్యాలు, ప్రపంచంతో పోటీ పడే సామర్థ్యాన్ని ప్రతిబింబించేలా విజన్ డాక్యుమెంట్‌కు తుది మెరుగులు దిద్దాలని అధికారులకు సీఎం చెప్పారు. విజన్ డాక్యుమెంట్‌ను డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులో ఉంచి.. పారదర్శకతకు, ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. తెలంగాణ సామర్థ్యం, ఆకాంక్ష, వ్యూహాత్మక ప్రాధాన్యతలను ప్రతిపాదించేలా సదస్సు ఉండాలని సీఎం స్పష్టం చేశారు.





# కేసీఆర్‌తో ఏకగ్రీవ సర్పంచ్‌ల భేటీ

## మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే అని వ్యాఖ్య

**గజ్వెల్, డిసెంబర్ 5 :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల జోష్ ఊపందుకుంది. తొలి విడత పోలింగ్ ఈ నెల 11న జరుగనున్నది. అయితే పలు గ్రామాల్లోని ప్రజలు తమ గ్రామం అభివృద్దే లక్ష్యంగా సర్పంచ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నారు. ఈ క్రమంలో ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామ పంచాయతీలకు సర్పంచ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఏకగ్రీవంగా ఎన్నికైన ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామ పంచాయతీల సర్పంచులు కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తనను కలిసిన గ్రామస్తులతో కేసీఆర్ మాట్లాడుతూ.. మనకు అన్ని కాలాలు అనుకూలంగా వుండవని అన్నారు. కొన్ని కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయి వాటికి వెరవకూడదన్నారు. మళ్లా మన ప్రభుత్వమే వస్తుంది. తెలంగాణ పల్లెలకు తిరిగి మంచిరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడిదాకా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అధైర్య పడొద్దన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయంశక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలని సూచించారు. ఇప్పుడు నూతనంగా ఎన్నికైతున్న సర్పంచులు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రచించుకోవాలన్నారు. గంగదేవిపల్లి లాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకొని, మన పని మనం చేసుకుంటూ, మన పల్లె అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఎవరో ఏదో చేస్తారని ఏదో ఇస్తారని ఆశలు పెట్టుకొని ఆగం కావద్దని కేసీఆర్ తెలిపారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో తమ పల్లెలను సామాజిక ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చి దిద్దుకోవాలని కేసీఆర్ కోరారు.



# దేవాలయాల డబ్బు సహకార బ్యాంకుల కోసమా?

- డిపాజిట్లను వెంటనే వాపస్ చేయాలన్న సుప్రీం
- కేరళ ఆలయ కేసులో ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** ఆలయాలకు చెందిన డబ్బును ఇతరత్రా పనులకు వినియోగించరాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కో–ఆపరేటివ్ బ్యాంకులను రక్షించేందుకు ఉపయోగించొద్దంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేరళలో ఓ ఆలయానికి చెందిన సొమ్మును వాపస్ చేయడంలో కో ఆపరేటివ్ బ్యాంకులు తాత్సారం చేయడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ సొమ్ము పూర్తిగా దేవుడికి చెందినదని తేల్చి చెప్పింది. ఆ నిధులను ఆలయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సహకార బ్యాంకులకు ఆదాయ వనరుగా లేదా అవి మనుగడ సాగించేందుకు ఆలయ నిధులు ఉపయోగించొద్దని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. కేరళలోని తిరునెల్లి దేవస్థానం చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు గతంలో ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ మనాంతవాడి కో–ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సహా కొన్ని సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌ను విచారిస్తూ న్యాయస్థానం పైవ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా.. మీరు ఆలయ డబ్బును ఉపయోగించి బ్యాంకును రక్షించాలను కుంటున్నారా? కష్టాల్లో ఉన్న ఒక సహకార బ్యాంకులో డబ్బు ఉంచే బదులు, ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుకు ఆ నిధులను మార్చాలని ఆదేశించడంలో తప్పేముందని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల వల్ల ఇబ్బందులు ఎదు–రవుతున్నాయని బ్యాంకుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. దేవుడి డబ్బును తిరిగి చెల్లించడానికి సమయం పొడిగించాలని కోరుతూ మాత్రమే కో–ఆపరేటివ్ బ్యాంకులు హైకోర్టును ఆశ్రయించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ బ్యాంకుల పిటిషన్లను విచారించడానికి మాత్రం నిరాకరించింది. తిరునెల్లి దేవస్థానం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన ఐదు సహకార బ్యాంకులు గడువు ముగిసినా, తిరిగి చెల్లించాలని పదేపదే అడిగినా.. డబ్బు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో దేవస్థానం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ తర్వాత రెండు నెలల్లోగా దేవస్థానం డిపాజిట్ మొత్తాన్ని తిరిగివ్వాలని బ్యాంకులను హైకోర్టు ఆదేశించింది.

# ఈ సంక్షోభం మరో పదిరోజులు

- అసౌకర్యానికి క్షమించండి
- ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ వీడియో ప్రకటన




**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** ఇండిగో విమాన సర్వీసుల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతూనే ఉంది. మరో పదిరోజుల వరకు ఈ వెతలు తప్పవని ఆ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియో సందేశం విడుదలయ్యింది. శుక్రవారం వెయ్యికి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ క్రమంలో సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ మరోసారి స్పందిస్తూ.. ప్రయాణికులకు కలుగుతోన్న అసౌకర్యానికి క్షమాపణ చెప్పారు. శనివారం ఈ సంఖ్య వెయ్యి కన్నా తక్కువ ఉండేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. డిసెంబర్ 10–15 మధ్య కాలంలో పరిస్థితులు సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని పేర్కొంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. గత కొన్ని రోజులుగా తీసుకుంటున్న ముందస్తు చర్యలు సరిపోవడం లేదని రుజువైంది. అందుకే.. అన్ని వ్యవస్థలు, షెడ్యూల్‌లను రీబూట్ చేయాలని నిర్ణయించాం. ఫలితంగా నేడు భారీ సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. రేపటి నుంచి పరిస్థితులు మెరుగుపడాలంటే ఈ చర్యలు తప్పనిసరి. దీంతో శనివారం 1000 కన్నా తక్కువ సర్వీసులు రద్దవుతాయని అంచనా వేస్తున్నాం. ఎఫ్‌డీటీఎల్ విషయంలో డీజీసీఏ తీసుకున్న ఉపశమన చర్యలు చాలా దోహదపడ్డాయని పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. ఇండిగో నిత్యం దాదాపు 2300 జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను నడుపుతోంది. కొన్ని రోజులుగా వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దుకాగా.. శుక్రవారం ఆ సంఖ్య వెయ్యి దాటినట్లు అంచనా. సాంకేతిక లోపాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, షెడ్యూల్ మార్పులు, అప్‌డేట్ చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాల అమలు వంటి అంశాలు ఈ సంక్షోభానికి కారణాలుగా తెలుస్తున్నాయి.

# కొలిక్కి వస్తున్న ఇండిగో వ్యవహారం

## పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** ఇండిగో విమానాల సర్వీసుల రద్దు వ్యవహారం కొలిక్కి వస్తోందని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గత రెండు రోజులుగా రద్దయిన సర్వీసులు క్లియర్ అయ్యాయని వెల్లడించారు. నేటి నుంచి ఎయిర్‌పోర్టుల్లో సాధారణ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రద్దీ లేదా వేచి ఉండే పరిస్థితి ఉండదని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే మొదలుపెట్టగలిగే అన్ని కార్యకలాపాలను ప్రారంభించాలని ఇండిగోను ఆదేశించామని తెలిపారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావడం తమ తక్షణ కర్తవ్యమని మంత్రి తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.÷÷–లట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనలు, షెడ్యూలింగ్ నెట్‌వర్క్‌ను తాము నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. అన్ని విమానయాన సంస్థలు నిబంధనలు సరిగా పాటిస్తున్నాయో, లేదో నిర్ధారిస్తామని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడ, ఎలా తప్పు జరిగిందో తెలుసుకోవడానికి ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేశామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. బాధ్యులైన వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు, వృద్ధులు, పాలిచ్చే తల్లులు, వికలాంగులకు విమానయానంలో ప్రాధాన్యం ఇవ్వాలని అన్ని ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్ ఆపరేటర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

# జనన ధృవీకరణ గడవు వార్తలు అబద్ధం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసేందుకు వచ్చే ఏప్రిల్ 27వ తేదీని తుది గడువుగా నిర్ణయించినట్లుగా సామాజిక మాధ్యమాల్లో జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం ఖండించింది. వాట్సప్‌లో ప్రచారం అవుతున్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఈ తప్పుడు సందేశాన్ని ఎవరూ నమ్మవద్దని కోరుతూ పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. జనన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నోటిఫికేషన్‌ను గానీ, నిర్దేశిత గడువును గానీ జారీ చేయలేదని స్పష్టం చేసింది. ప్రజలు ఇలాంటి ధ్రువీకరణలేని సమాచారాన్ని షేర్ చేయొద్దని కోరింది. కచ్చితమైన సమాచారం కోసం ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లలో చెక్ చేసుకోవాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద సమాచారం ప్రజల దృష్టికి వస్తే వెంటనే ఫ్యాక్ట్‌చెక్ విభాగాం 91 8799711259 నంబర్‌కు వాట్సప్ ద్వారా లేదా మెయిల్ ద్వారా పంపాలని కోరింది.

# నిర్లక్ష్యపు వైద్యం

## నరసరావుపేట వైద్యుడి సస్పెన్షన్

**అమరావతి, డిసెంబర్ 5 :** విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించిన నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి.నారాయణ స్వామిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గత నెల 26న నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళకు ట్యూబెక్టమీ ఆపరేషన్ చేసి.. ఆమె శరీరంలో సర్జికల్ బ్లేడ్‌ను వదిలేశారు. అనంతరం జరిపిన వైద్య పరీక్షల్లో సర్జికల్ బ్లేడ్ శరీరంలో వదిలేసినట్లు వెలుగులోకి వచ్చింది . దీనిపై విచారణ జరిపిన అధికారులు ఆపరేషన్ చేసిన డాక్టర్ నారాయణ స్వామి.. విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించారని నివేదికలో పేర్కొన్నారు. ఘటనపై ఆరా తీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు డాక్టర్ టి.నారాయణ స్వామిని సస్పెండ్ చేస్తూ వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.









# వివిధ రాష్ట్రాల్లో మంత్రుల పర్యటన

## గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికలు అందచేత

**హైదరాబాద్, డిసెంబర్ 5 :** ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్–2047 గ్లోబల్ సమ్మిట్ కు హాజరవ్వాలని వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన మంత్రులు ఆయా సిఎం లకు ఆహ్వానాలు అందించారు. డిప్యూటి సిఎం జాఖండ్ సిఎంను ఆహ్వానించారు. అలాగే జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను, తమిళనాడు సిఎం స్టాలిన్‌ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. న్యూఢిల్లీలోని జమ్ముకశ్మీర్ హౌస్‌లో సీఎం ఒమర్ అబ్దుల్లాను శుక్రవారం మంత్రి ఉత్తమ్ కలిశారు. ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన ఆహ్వాన పత్రికను జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు ఉత్తమ్ కుమార్ రెడ్డి అందజేశారు. అలాగే స్టాలన్‌కు కూడా పత్రికను అందించారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్?–2047 విజన్? డాక్యుమెంట్?ను రూపొందించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. నీతి అయోగ్?సలహాలు సూచనలతో పాటు.. అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒమర్ అబ్దుల్లాకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం ఒమర్ అబ్దు ల్లా మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కి ఆహ్వానించి నందుకు తెలంగాణ ముఖ్యమంత్రి, స్వయంగా ఆహ్వానపత్రాన్ని అం దచేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రత్య క్షంగా హాజరు కాలేకపోతున్నానని కానీ గ్లోబల్ సమ్మిట్ విజయవం తం కావాలని ఆశిస్తున్నానని అన్నారు. అదేవిధంగా హైదరాబాద్ ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్నానని చెప్పారు.

అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు అంటారు ఇది ఒకప్పటి మాట... కానీ ఇప్పుడు అడిగి మరీ అప్పులు ఇస్తామంటూ వెంటపడి మరీ నిండా ముంచుతున్నారు. సామాన్యుడి అవసరమే పెట్టుబడిగా ఎంచుకొని లెక్కకు మించి పుట్టగొడుగుల్లా అప్పులు ఇచ్చే యాప్స్ ఇప్పుడు సామాన్యుల పాలిట యమగండంలా తయారయ్యాయి. మేమంటే మేము అప్పు ఇస్తాం. మీరు సరే అంటే చాలు... క్షణాల్లో మీ అకౌంట్లో డబ్బులు వేస్తాం అంటూ వెంటపడుతున్నారు. తీసుకున్న డబ్బు సమయానికి కట్టకుంటే వాటికి వడ్డీతో పాటు చక్రవడ్డీ కలిపి వసూలు చేసే దాకా వదలడం లేదు. అంతటితో ఆగకుండా రకరకాల తరహాలో వేధింపులకు గురిచేస్తున్నారు.


### స్నేహితులు ధైర్యం చెప్పడం తో ఆత్మహత్య నిర్ణయం విరమించుకున్న యువకుడు

మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఓ ప్రైవేట్ యాప్ లో రూ. 2 వేల లోన్ తీసుకుని సమయానికి కట్టకపోవడంతో తన ఫోటోలను వీడియో రూపంలో మార్ఫింగ్ చేసి తన ఫోన్ కాంటాక్ట్ లో ఉన్న పలువురి వాట్సాప్ నంబర్లకు పంపడంతో అయోమయానికి గురైన సదరు యువకుడు ఆత్మహత్య చేసుకోవాలని ఇంట్లో చెప్పకుండా బయటకి వెళ్లిన విషయం తెలుసుకున్న పలువురు బాధితుని స్నేహితులు అడ్డుకుని ధైర్యం చెప్పడంతో ఊరుకుని స్నేహితుల వద్ద చేతి బదులు తీసుకుని సుమారు తీసుకున్న రెండు వేల రూపాయలకు 25వేల వరకు చెల్లించాడు.




# ప్రైవేట్ లోన్ యాప్స్ దారుణాలు

- వెంటపడి మరీ క్షణాల్లో రుణాలు
- చెల్లింపులో ఆలస్యమైతే రకరకాల వేధింపులు
- పరువు పోతుందని ఆత్మహత్యలు
- ప్రైవేట్ లోన్ యాప్ లకు దూరంగా ఉండాలని పోలీసుల హెచ్చరికలు
- సర్వీస్ చార్జీలు, పెనాల్టీలతో 40శాతం వరకు అధిక వడ్డీ చెల్లింపు
- స్నేహితులు ధైర్యం చెప్పడంతో ఆత్మహత్య చేసుకొని యువకుడు




**మేడ్చల్ :** అడగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదు అంటారు ఇది ఒకప్పటి మాట... కానీ ఇప్పుడు అడిగి మరీ అప్పులు ఇస్తామంటూ వెంటపడి మరీ నిండా ముంచుతున్నారు. సామాన్యుడి అవసరమే పెట్టుబడిగా ఎంచుకొని లెక్కకు మించి పుట్టగొడుగుల్లా అప్పులు ఇచ్చే యాప్స్ ఇప్పుడు సామాన్యుల పాలిట యమగండంలా తయారయ్యాయి. ఒకప్పుడు అప్పు కావాలంటే బ్యాంకుల్లో సవాలక్ష కాగితాలు, విచారణ, తనఖా పెడితే గాని అప్పు ఇవ్వని పరిస్థితి నుండి మేమంటే మేము అప్పు ఇస్తాం... మీరు సరే అంటే చాలు క్షణాల్లో మీ అకౌంట్లో డబ్బులు వేస్తాం అంటూ వెంటపడుతున్నారు. డబ్బులు వేయడం వరకు బాగానే ఉన్నా ఒకసారి వేసిన తర్వాత అసలు పంచాయితీ మొదలయినట్లే. తీసుకున్న డబ్బు సమయానికి కట్టకుంటే వాటికి వడ్డీతో పాటు చక్రవడ్డీ కలిపి వసూలు చేసే దాకా వదలడం లేదు. అంతటితో ఆగకుండా రకరకాల తరహాలో వేధింపులకు గురిచేస్తున్నారు. ఇటీవల కాలంలో ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగం పెరిగిపోయింది. చిన్న పిల్లాడి నుంచి పెద్దవారి వరకు సెల్ ఫోన్ అనేది తప్పనిసరి అయింది. ప్రధానంగా యువకుల వద్ద మాత్రం మంచి మంచి ఆండ్రాయిడ్ ఫోన్లు ఉండడం సర్వ సాధారణం అయిపోయింది. యువత కరోనా తర్వాత ఇళ్లకే పరిమితం కాగా చాలా మంది ఉ ద్యోగాలు కోల్పోయి ఆర్థిక మాంధ్యంలో చిక్కుకపోయారు. దీనినే ఆసరగా చేసుకున్న కొందరు ఆన్లైన్ ద్వారా అప్పులు ఇచ్చే దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్లే స్టోర్ ఓపెన్ చేస్తే చాలు విచ్చలవిడిగా లోన్ యాప్స్ కనిపిస్తుండడంతో పాటు మరికొన్ని లింకుల ద్వారా రుణాలను అందిస్తున్నాయి. వెయ్యి నుండి మొదలు రూ.50 వేల వరకు అప్పటికప్పుడు లోన్ అందజేస్తుండగా పది రోజుల్లో తిరిగి డబ్బులు చెల్లించే విధంగా ఈ యాప్ లు అందిస్తున్నాయి. ఇచ్చిన డబ్బుకు తిరిగి చెల్లించే వరకు సర్వీస్ చార్జీలు, వడ్డీతో పాటు పెనాల్టీలతో కలుపుకొని 35 నుంచి 40 శాతం వరకు వడ్డీ చెల్లించవలసి వస్తోంది.

## ఆలస్యం అయిందా వారి పని గోవిందా...:

ప్లే స్టోర్ నుండి ఈ లోన్లకు సంబంధించిన యాప్స్ డౌన్లోడ్ చేసి ఇన్స్టాల్ చేసుకున్న తర్వాత ఫోన్లోని కాంటాక్ట్స్, ఫోటోలు, వ్యక్తిగత సమాచారం మొత్తం ఆ యాప్ తీసుకోవడం జరుగుతోంది. దీంతో ఆ



వ్యక్తి యొక్క వ్యక్తిగత సమాచారం పూర్తిగా తెలియడంతో పాటు ఫోన్ వారి కంట్రోల్లోకి వెళ్ళిపోతుంది. అప్పు తీసుకున్న వ్యక్తి సకాలంలో అప్పు చెల్లించకపోవడంతో సదరు అప్పు ఇచ్చిన సంస్థలు బెదిరింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు కట్టాలని అదే పనిగా ఫోన్లు చేస్తుండగా ఫోన్ లిఫ్ట్ చేయకుంటే సదరు వ్యక్తికి సంబంధించి వ్యక్తి గత సమాచారం ఆధారంగా అతడి ఫోన్ నెంబర్లతోనే అందరికి అప్పు చెల్లించడం లేదని వాట్సాప్, సాధారణ సందేశాలు పంపుతూ వేధింపులకు గురిచేస్తున్నారు. అంతే కాకుండా ఎవరితో అయితే ఎక్కువగా ఫోన్లో మాట్లాడుతున్నారో చూసి వారికి ఫోన్ చేసి ఫలానా వ్యక్తి మా దగ్గర అప్పు తీసుకొని మీ నెంబర్ ఇచ్చారు. అతడు స్పందించడం లేదు. మీకు లీగల్ నోటీసులు పంపిస్తున్నాం అని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

### ప్రైవేట్ లోన్ యాప్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి

**సీహెచ్.శంకర్ రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, మేడ్చల్ డివిజన్**



ఇటీవల కాలంలో అప్పులు ఇచ్చే యాప్స్ ఎక్కువయ్యాయి. వీటిని షార్క్ యాప్స్ అంటారు. ఈ పేరు ఎందుకంటే సొరచేప మాదిరిగా ఓ వ్యక్తి ఆర్థికస్థితిని తినేస్తాయని అర్థం. ఈ యాప్స్ క్షణాల్లో రుణాలు మంజూరు చేసి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. డబ్బులు సకాలంలో కట్టని వారికి వారి ఫోన్లలో వ్యక్తిగత సమాచారాన్ని ముందే సేకరించి రుణగ్రస్తులను రకరకాలుగా వేధింపులకు గురి చేస్తున్నట్లు మాకు సమాచారం అందుతోంది. ఇలాంటి యాప్స్ పట్ల యువకులు జాగ్రత్తగా ఉండాలి. ఎవరైనా అసభ్య పదజాలంతో సందేశాలు పంపితే అది ఐటి యాక్టు 67 కిందకు వస్తుంది. అలాంటి వారిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ఎవరికైనా రుణాలు అవసరమైనప్పుడు ఆర్బీఐ అధీనంలో ఉండే సంస్థల నుంచి మాత్రమే తీసుకోవాలి.

---

## మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా..

### మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కోర్డుటీ యశోద రత్నం



**మొయినాబాద్ :** గతంలో చేసిన అభివృద్ధిని చూసి మరోసారి అవకాశం ఇవ్వాలని మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కోర్డుటీ యశోద రత్నం కోరుతు న్నారు. మరోసారి తనకు ఓటు వేసి గెలిపిస్తే.. మరిం త అభివృద్ధి చేసి చూపిస్తా నని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వారు గతంలో ఐదేళ్ల పాటు సర్పంచ్ గా సేవలందించిన సమయం లో వాడవాడలా డ్రైనేజీల నిర్మాణం, సీసీ రోడ్లు నిర్మాణం విద్యుత్ దీపాలు చేపట్టా మన్నారు. గ్రామంలో పేద ప్రజల పెళ్లికి పుస్తే మెట్టలు అందజేశామని అన్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబనికి ఆర్థికసాయంగా 10,000 రూపాయలు ఇవ్వడం జరిగిందని, మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కోర్డుటీ యశోద రత్నం తెలిపారు. మరోసారి అవకాశం ఇస్తే.. మరింత అభివృద్ధి చేస్తామని మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి కోర్డుటీ యశోద రత్నం గ్రామ ప్రజలను కోరారు.

---



## బీజ్జాల సోమన్న కుటుంబాన్ని పరామర్శించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**పాలకుర్తి :** బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్, ఎంపీటీసీ కీ. శే బీజ్జాల సోమన్న కుటుంబాన్ని పరామర్శించిన ఐవిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, పిసిసి ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా. ఈ సందర్భంగా సోమన్న ప్రజలకు, వైశ్య జాతికి చేసిన సేవను గుర్తు చేసుకు న్నారు. సోమన్న మరణం కాంగ్రెస్ పార్టీకి, వైశ్య జాతికి తీరని లోటని తెలియచేసారు. వారి కుటుంబ ప్రస్తుత అవసరాల దృష్ట్యా ఆర్థిక సహాయం అందచేస్తూ, అమ్మాయిల చదువు విషయంలో మరింత సహాయం చేస్తామ ని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో అం తర్జాతీయ ఆర్య వైశ్య సంఘం (ఐ వి ఎఫ్ ) జనగామ జిల్లా కోశాధికారి రాపాక విజయ్, వికాస తరంగిని నాయకులు ఇమ్మడి దామోదర్, యువ నాయకులు కొండా సునీల్, రాజు ఇతర జిల్లా మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

---

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగదేవత విగ్రహ ప్రతిష్ట

- బుద్ధ నగర్ సాయిబాబా ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం
- స్వామివారిని దర్శించుకున్న ఆలయ ప్రతినిధులు, స్థానిక నాయకులు



**పీర్జాదిగూడ :** శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగదేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కన్నుల పండువగా సాగింది. పీర్జాదిగూడ నగర పరిధిలోని బుద్ధ నగర్ సాయిబాబా ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగదేవత విగ్రహ ప్రతిష్ట శుక్రవారం నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణతో శాస్రోక్తంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగదేవత విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వేద మంత్రోచ్చారణతో మార్మోగింది. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ అనిల్ సింగ్, ప్రధాన కార్యదర్శి బొందుగుల కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, మద్ది యుగంధర్ రెడ్డి, కౌడె పోచయ్య, ఆలయ కమిటీ ప్రతినిధులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, వంగేటి బాల్ రెడ్డి, బొడిగె రాందాస్ గౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

---

## హిమాయత్‌నగర్‌లో ఘనంగా అయ్యప్ప పూజ



**మొయినాబాద్ :** హిమాయత్ నగర్ లో అయ్యప్పస్వామి నామస్మరణ మార్మోగింది. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో శుక్రవారం అయ్యప్పస్వామి మహాపడి పూజ అంగరంగవైభవంగా జరిగింది. హిమాయత్ నగర్ వార్డుకు చెందిన ముదిగొండ ప్రేమ్ యాదవ్(కత్తిస్వామి) శుక్రవారం ఏర్పాటు చేసి అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాండూరు ప్రాంతానికి చెందిన వినోదశర్మ గురుస్వామి కరకములచే ఎంతో భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి విగ్రహానికి పూలు పండ్లతో అభిషేకం నిర్వహించారు. అనంతరం 18 మెట్లపై కర్పూర హారతిని వెలిగించారు. పూజ కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సీఎస్. రంగరాజన్ పాల్గొని మాట్లాడుతూ. కార్తీకమాసంలో వేసే అయ్యప్ప మాల, దీక్ష ఎంతో కఠినమైందని, ఈ దీక్షలో కులమతాలకు తావు లేదని చెప్పారు. అందరినీ ఐక్యంగా ఉ ంచేందుకు ఈ దీక్ష ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఈ పూజ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నేత, మహేశ్వరం నియోజకవర్గం నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మె-యినాబాద్ మాజీ ఎంపీపీ అనితా శ్రీహరియాదవ్ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిగొండ రవియాదవ్, మంజుల, స్వప్న, కొత్త నరసింహారెడ్డి, నరోత్తం రెడ్డి, కొత్త మాణిక్ రెడ్డి, సన్నిదానం గురుస్వామి మురళి, స్వాములు మహేందర్ యాదవ్, రవిశాస్త్రీ, బీసా శ్రీనివాస్, రాఘవేందర్, శ్రీశైలం, వెంకటేష్ గౌడ్, వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---



## అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల దిశగా ప్రభుత్వం

### మార్కెట్ కమిటీ చైర్మన్ నూనముంతల విమల వేంకటేశ్వర్లు

**గుండాల :** గుండాల మండలంలోని మాసన్ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎలిపెద్ది అనురాధ రామ్ దయాకర్ రెడ్డి నీ స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీ భారీ మెజార్టీతో ఎన్నుకోవాలని మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు శుక్రవారం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎలిపెద్ది అనురాధ రామ్ దయాకర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలూరి రామ్ రెడ్డితో పాటు గ్రామ నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కార్యకర్తలు కష్టపడి పనిచేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు గ్రామాలలో అభ్యర్థులు అందరితో సమన్వయం చేసుకొని గెలుపుకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే స్థానిక శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం గ్రామ అభివృద్ధికి అధిక నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందని తెలిపారు ఈ సందర్భంగా అభ్యర్థి ఎలిపెద్ది అనురాధ రామ్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ మీ ఇంటి ఆడబిడ్డగా ఈ గ్రామానికి సేవ చేయడానికి మీ ముందుకు వస్తున్నానని మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

---

## గుడికుంటతండా బిఆర్ఎస్ కైవసం

### సర్పంచిగా జ్యోతి మహేందర్ నాయక్



**పాలకుర్తి :** పాలకుర్తి మండలం లో గుడికుంట తండాలో బిఆర్ఎస్ సర్పంచ్ గా జ్యోతి మహేందర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనితో పాలకుర్తి నియోజకవర్గంలో బోనీ చేసిన బీఆర్ఎస్. గుడికుంట గ్రామపంచాయతీ నుండి ఎవరు నామినేషన్ వేయకపో వడంతో ఏకగ్రీవమైన గ్రామపంచాయతీ సర్పంచ్. ఈ సందర్భంగా జ్యోతి మహేం దర్ నాయక్ మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీ లుగా మార్చిన ఘనత కేవలం బిఆర్ఎస్ కే దక్కుతుందని, బంజారాల అభివృద్ధి కేవలం బిఆర్ఎస్ కే సాధ్యమని అన్నారు. తండా వాసులు సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం కావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# గుడ్ న్యూస్ చెప్పిన ఆర్‌బీఐ

- వడ్డీ రేట్లపై మరో 0.25 శాతం కోత
- ఆర్‌బిఐ మరోమారు కీలక నిర్ణయం
- తాజా నిర్ణయంతో తగ్గనున్న రుణాల వడ్డీలు

**ముంబై, డిసెంబర్ 5 :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త ప్రకటించింది. కీలక వడ్డీ రేట్లను మరో 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్టు పేర్కొంది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. అయితే.. ఈ ఏడాదిలో ఇప్పటికే వడ్డీ రేట్లపై ఆర్బీఐ ట్రిపుల్ బొనాంజా ప్రకటించింది. ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో కీలక వడ్డీరేట్లపై 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఆ తర్వాత జూన్ నెలలో మరోసారి ఏకంగా 50 పాయింట్ల మేర కోత విధించింది. దీంతో 2025 ఏడాదిలోనే మొత్తం రెపో రేటు 1.25 మేర తగ్గింది. మొత్తంగా ఏడాది ముగింపు దశలో ఈ ఏడాది ఇప్పటికే వడ్డీ రేట్లపై ట్రిపుల్ బొనాంజా ప్రకటించిన ఆర్‌బీఐ.. మరోసారి గుడ్‌న్యూస్ చెప్పింది. దీంతో రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. రూపాయి పతనం కొనసాగుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి పడిపోవడం, వృద్ధిరేటు పెరగడంతో రేట్ల కోత చేపట్టినట్లు మల్హోత్రా వెల్లడించారు. వడ్డీ రేట్లను తగ్గించడంతో గృహ, వాహన రుణ గ్రహీతలకు మరికొంత ఉపశమనం లభించినట్లయ్యింది. జీఎస్టీ హేతుబద్ధీకరణతో కొనుగోళ్లు పెరగడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 8.2శాతం వృద్ధి నమోదైంది. దీంతో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నాం. ద్రవ్యోల్బణం కూడా తగ్గుముఖం పట్టింది. అందువల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 2.6శాతం నుంచి 2 శాతానికి తగ్గిస్తున్నాం అని ఆర్‌బిఐ గవర్నర్ వివరించారు. రూ.1 లక్ష కోట్ల




విలువైన ప్రభుత్వ సెక్యూరిటీస్‌ల విక్రయాల కోసం ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించాం. విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఇవి ఉపయోగపడతాయి. తాజాగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గడంతో 5.50 శాతంగా ఉన్న రెపో రేటు 5.25 శాతానికి దిగొచ్చింది. దీంతో వడ్డీ రేట్ల తగ్గింపుతో దేశ వ్యాప్తంగా బ్యాంకులు తమ లోన్ వడ్డీ రేట్లను త్వరలోనే సవరించనున్నాయి. ఫలితంగా.. హోమ్ లోన్, కారు లోన్, పర్సనల్ లోన్‌లపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశముంది. ఇది సామాన్యుడికి గొప్ప ఊరట కలిగించే నిర్ణయమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ఆర్బీఐ తాజా నిర్ణయంతో హోమ్ లోన్ ఖాతాదారుల చెల్లింపు విధానం ఎలా ఉంటుందో ఓసారి పరిశీలిస్తే.. 8.5 శాతం వడ్డీ రేటుతో 15 ఏళ్లు, 20 ఏళ్లు, 25 ఏళ్ల చొప్పున కట్టేందుకు తీసుకున్న లోన్.. 25 బేసిస్ పాయింట్ల రెపో రేటు తగ్గింపుతో 8.25 శాతం వడ్డీతో కట్టాల్సి ఉంటుంది. రూ.25 లక్షలు హోమ్ లోన్ 15 ఏళ్ల కాల పరిమితితో తీసుకున్నట్టయితే గతంలో 8.5 శాతం వడ్డీతో రూ.24,254 ఈఎంఐ కట్టాల్సి ఉండేది. కానీ, ప్రస్తుతం.. 8.25 శాతం వడ్డీతో రూ.24,254 ఈఎంఐ చెల్లిస్తే చాలు. ఇలా మొత్తం కాల పరిమితిలో రూ.65,696 ఆదా చేసుకునేందుకు వెసులుబాటు ఏర్పడింది. ఇదే రూ.25 లక్షల మొత్తాన్ని 20 ఏళ్ల కాల పరిమితికి తీసుకున్నట్టయితే.. గతంలో రూ.21,696 ఈఎంఐ కట్టాల్సి ఉండగా.. తాజాగా రూ.21,302 పే చేస్తే సరిపోతుంది. ఇలా మొత్తమ్మీద రూ.94,545 సొమ్ము ఆదా అవనుంది. ఇంతే రూ.25 లక్షల మొత్తాన్ని 25 ఏళ్ల కాల పరిమితికి తీసుకున్నట్టయితే రూ.20,131 చొప్పున కాకుండా రూ.19,711 కట్టాల్సి ఉంటుంది. ఫలితంగా రూ.1,25,827 ఆదా అవుతుంది.ఇక 30 ఏళ్లకు రూ.19,223 ఈఎంఐ కట్టే రుణ గ్రహీతలు రూ.18,782 చొప్పున చెల్లించడం వల్ల రూ.1,58,822 మొత్తం తగ్గించబడుతుంది. రూ.50 లక్షల రుణానికి ప్రస్తుతం రూ.43,391 ఈఎంఐతో కట్టాల్సిన వారు.. తాజా తగ్గింపుతో రూ.42,603(8.25 శాతం వడ్డీ రేటు ప్రకారం) చొప్పున చెల్లిస్తూ 20 ఏళ్లకు రూ.1,89,091 ఆదా చేస్తారు. రూ.75 లక్షల రుణం తీసుకున్న వారు ప్రస్తుతం రూ.60,392 ఈఎంఐ ద్వారా చెల్లించేవారు తగ్గింపు తర్వాత రూ.59,134 పే చేయాల్సి ఉంటుంది. ఇలా వీరికి 25 ఏళ్లలో రూ.3,77,481 నగదు ఆదా అవుతుంది. రూ.1 కోటి రుణ గ్రహీతలు.. రూ.76,891 చొప్పున ప్రస్తుతం ఈఎంఐ ద్వారా చెల్లిస్తుండగా.. సవరించబోయే వడ్డీ రేట్ల ప్రకారం రూ.75,127 కట్టాల్సి ఉంటుంది. ఇలా వీరు 30 ఏళ్లలో రూ.6,35,287 సొమ్మును ఆదా చేసుకున్నట్టవుతుంది. రెపో రేటు తగ్గింపుతో ఫ్లోటింగ్ రేట్ లోన్ రుణాలు తీసుకున్న వారు వెంటనే ఈ ప్రయోజనాన్ని పొందుతారు. అనగా 2019 అక్టోబర్ 01 తర్వాత బ్యాంకు నుంచి లోన్ పొందిన కస్టమర్లు. ఈ గృహ రుణాల్లో చాలా వరకూ రెపో రేటుకు అనుసంధానమై ఉంటాయి. కాబట్టి ఆర్బీఐ రెపో రేటును తగ్గించినప్పుడు.. ఆయా బ్యాంకులు వెంటనే వడ్డీ రేట్లను సవరిస్తాయి. దీంతో హోమ్ లోన్లు తగ్గింపులు వెంటనే అమల్లోకి వస్తాయి.



## శ్రీలంకను కుదిపేసిన దిత్వా తుఫాన్

- ఇప్పటి వరకూ 486 మంది మృత్యువాత
- సుమారు 341 మంది ఆచూకీ గల్లంతు

**కొలంబో, డిసెంబర్ 5 :** దిత్వా తుఫాన్ ద్వీప దేశం శ్రీలంకను భారీగా కుదిపేసింది. తుఫాను బీభత్సానికి కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. అనేక పట్టణాలు పూర్తిగా నీట మునిగాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. శ్రీలంక విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం.. 20 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మౌలిక సదు–పాయాలు దెబ్బతిన్నాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో జనజీవనం స్తంభించింది. దిత్వా తుఫాను బీభత్సానికి భారీగా ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. నవంబర్ 16 నుంచి ఇప్పటి వరకూ 486 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 341 మంది ఆచూకీ గల్లంతయింది. ఈ సంక్షోభ సమయంలో భారత దేశం శ్రీలంకకు అండగా నిలుస్తోంది. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో మానవతా సాయాన్ని అందజేస్తోంది. జాతీయ విపత్తు స్పందన దళం , భారత వాయు సేన ప్రజల ప్రాణాలను కాపాడుతున్నాయి.



## గ్లూకోజ్ మానిటర్ల వాడకం ఆపండి

### అమెరికా ఎఫ్‌డీఏ హెచ్చరికలు

**యూఎస్ :** గ్లూకోజ్ మానిటర్ల విషయంలో అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరికలు చేసింది. ‘అబాట్ డయాబెటిస్ కేర్’ తయారు చేసిన గ్లూకోజ్ మానిటర్లు సరిగా పనిచేయకపోవడం.. ఏడుగురి మరణానికి, వందల మంది గాయపడేందుకు కారణమైందని వెల్లడించింది. వాటి వాడకాన్ని ఆపాలని సూచించింది. ఫ్రీస్టైల్ లిబ్రే 3, ఫ్రీస్టైల్ లిబ్రే 3 ప్లస్‌లో తప్పుడు రీడింగ్‌లు రావొచ్చని ముందస్తు హెచ్చరిక చేసింది. అబాట్ నిర్వహించిన అంతర్గత తనిఖీల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. నవంబర్ వరకు ఈ మానిటర్ల వాడకం వల్ల 736 ప్రతికూల ఘటనలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయని అబాట్ వెల్లడించింది. అందులో 57 అమెరికాలోనే వెలుగుచూశా యని తెలిపింది. అమెరికా వెలుపల ఏడు మరణాలు సంభవించాయని పేర్కొంది. ఈ సంస్థ అమెరికాలో 30 లక్షల పరికరాలు విక్రయించగా.. ఆస్ట్రియా, బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, నార్వే, స్పెయిన్, స్వీడన్, స్విట్జర్లాండ్,యూకే లక్షల్లో ఈ పరికరాలు అమ్ముడయ్యాయి. దీంతో సదరు సంస్థ పెద్ద సంఖ్యలో ఆ పరికరాలను రీకాల్ చేసింది. మధుమేహం ప్రభావం నుంచి సురక్షితంగా ఉండేందుకు ఆ బాధితులు కచ్చితమైన గ్లూకోజ్ రీడింగ్‌లపై ఆధాపడుతుం టారు. ఆ రీడింగ్‌లో లోపాలు వారికి ప్రమాదకరంగా పరిణమిస్తాయి. అసలు ఈ సమస్యకు గల కారణాన్ని గుర్తించామని, ప్రభావితమయ్యే అవకాశం ఉన్న వినియోగదారులకు పరిష్కారం చూపేలా చర్యలు ప్రారంభించామని సదరు కంపెనీ వెల్లడించింది.



## ఆ విషయంలో ప్రపంచ దేశాలు మమ్మల్ని అనుసరించాలి : ఆస్ట్రేలియా

**ఆస్ట్రేలియా :** పదహారేళ్ల కన్నా తక్కువ వయసున్నవారు సోషల్ మీడియా వాడకుండా నిషేధిస్తూ చట్టం తెచ్చిన ఆస్ట్రేలియా ప్రభుత్వం.. డిసెంబర్ 10 నుంచి అమలుకు సిద్ధమైన విషయం తెలిసిందే. గడువుకు ముందే ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మొదలైన సోషల్ మీడియాల్లో అక్కడి పిల్లలను మెటా బ్లాక్ చేస్తోంది. పిల్లలను సోషల్ మీడియాలకు దూరంగా ఉంచడానికి తాము తీసుకుంటున్న చర్యలను ప్రపంచ దేశాలు అనుసరించాలని ఆస్ట్రేలియా ఇంటర్నెట్ రెగ్యులేటరీ సూచించింది. 16 ఏళ్ల లోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలనే నిర్ణయం గురించి మొదట తాను ఆందోళన చెందానని.. కానీ ఈ విధానాన్ని చాలామంది తల్లిదండ్రులు ఆహ్వానిస్తుండడంతో తన ఆలోచనను మార్చుకున్నానని ఇ–సేఫ్టీ కమిషనర్ జూలీ ఇన్మాన్ గ్రాంట్ పేర్కొన్నారు. దేశంలోని పిల్లలపై సోషల్ మీడియా బ్యాన్ విధించడాన్ని ప్రపంచదేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని.. ఈ విషయంలో అన్ని దేశాలకు ఆస్ట్రేలియా ఉదాహరణగా నిలవనుందన్నారు. పిల్లల ఖాతాలు బ్లాక్ చేస్తున్న నేపథ్యంలో అందులో ఉన్న ఫొటోలు, ఇతర డేటాను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా సోషల్ మీడియా సంస్థలు వారికి సూచించాయి. పదహారేళ్ల కన్నా తక్కువ వయసున్న వారు సోషల్ మీడియాను వాడకుండా నిషేధిస్తూ చేసిన చట్టం వల్ల వేలాది మంది టీనేజర్ల సామాజిక మాధ్యమ ఖాతాలు ప్రభావితం కానున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ ప్రభుత్వం మాత్రం చట్టం అమలుచేస్తామని స్పష్టం చేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘించిన సోషల్ మీడియా ఖాతాలపై పెద్ద మొత్తంలో జరిమానాను విధిస్తామని ఆస్ట్రేలియా ప్రభుత్వం వెల్లడించింది. టిక్‌టాక్, ఫేస్‌బుక్, స్నాప్‌చాప్, రెడిట్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాలకు ఈ చట్టం వర్తించనుంది. ఇది అమల్లోకి వస్తే.. ప్రపంచంలోనే ఈ తరహా నిబంధనలు ఉన్న తొలి చట్టంగా ఇది నిలవనుంది.

## మనం ఇక్కడ అరవడానికి రాలేదు

### పార్లమెంట్‌లో గందరగోళంపై శశిథరూర్

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఇతర అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళనలు లేవనెత్తుతుండడంతో పార్లమెంట్ సమావేశాల్లో అంతరాయాలు నెలకొంటుండడంపై కాంగ్రెస్ నేత శశిథరూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పార్లమెంటులో చర్చించడానికి గందరగోళం సృష్టించాల్సిన అవసరం లేదని ప్రతిపక్షాలను విమర్శించారు. ఇక్కడ దేశం కోసం, ప్రజల కోసం మాట్లాడాలే తప్ప, అరిచి గందరగోళం సృష్టించొద్దని సహచర ఎంపీలకు సూచించారు. “నేను మొదటినుంచీ ఇదే చెబుతు న్నాను. సోనియాగాంధీతో సహా నా పార్టీ నాయకులకు ఈ విషయం బాగా తెలుసు. పార్టీలో నేను ఒంటరిని కావచ్చు. కానీ, ప్రజలు తమకు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడా నికి నన్ను ఎన్నుకున్నారు. అంతేకానీ ఇక్కడ అరవడానికి, గందరగోళం సృష్టించడానికి కాదు. వారి కోసం, దేశం కోసం నా తెలివి తేటలు ఉపయోగించి మాట్లాడాలనే ఉద్దేశంతో నన్ను ఇక్కడికి పంపారు” అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. సోమవారం శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. సభా సమయాల్లో డ్రామాలు వద్దని, చట్టసభల్లో చర్చలు తప్పనిస రని ప్రతిపక్షాలకు హితవు పలికారు. సానుకూల వాతావరణం లో చర్చలు జరగాలని.. నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాల కు అడ్డుపడొద్దని కోరారు. కొత్త ఎంపీలకు స్ఫూర్తి కలిగించేలా మన ప్రవర్తన ఉండాలని ఎంపీలకు సూచించారు. అయినప్పటికీ సమావేశాలు మొదలైన తొలిరోజు నుంచి వివిధ విషయాలపై ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుండడంతో తరచూ సభా కార్యకలాపాల్లో ప్రతిష్టంభన నెలకొంటుంది. ఈ నేపథ్యంలో థరూర్ ప్రతిపక్షాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.





## అమెరికా ఆంక్షలు ఫలించకపోవచ్చు


### పుతిన్ పర్యటనపై ‘చైనా’ వ్యాఖ్యలు

**రష్యా :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనను ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయి. అమెరికా ఆంక్షలు, సుంకాల మధ్య ఆయన భారత్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్రమంలో చైనా మీడియా కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రపంచంలో ఏ దేశమూ ఒంటరి కాదన్న స్పష్టమైన సందేశాన్ని పుతిన్ పర్యటన చాటుతోందని అభిప్రాయపడింది. చైనా ఫారిన్ అఫైర్స్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ లీ హైడాంగ్ గ్లోబల్ టైమ్స్‌తో మాట్లాడుతూ పుతిన్ పర్యటనపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్–రష్యా ఎవరిపైనా ఆధారపడకుండా, తమ సామర్థ్యాలను తామే సొంతంగా, మరింత శక్తిమంతంగా తయారుచేసుకోవాలని నిర్ణయించుకున్నాయని అర్థమవుతోందన్నారు. ఇరు దేశాల మధ్య సమన్వయం, సహకారమే అందుకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఉభయ పక్షాలూ పరస్పర మద్దతుతో బలమైన బంధాన్ని ఏర్పరచుకున్నా యన్నారు. ఫలితంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆంక్షలు, ఒత్తిడి అంతగా ఫలించకపోవచ్చని విశ్లేషించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం రాత్రి పుతిన్ దిల్లీకి చేరుకున్న విషయం తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో పుతిన్, మోదీ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికాతో భారత్ సంబంధాలు కొంత దెబ్బతిన్న నేపథ్యంలోనూ ఇది కీలకంగా మారింది.

## ప్రభుత్వ గుత్తాధిపత్యమే కారణం

### ఇండిగో విమాన సర్వీసులపై రాహుల్

**న్యూఢిల్లీ :** దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయం కొనసాగుతుంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రభుత్వ గుత్తాధిపత్యమే దీనికి ప్రధాన కారణమంటూ ఆయన ఆరోపణలు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రభుత్వ గుత్తాధిపత్యమే ఇండిగో విమానాల రద్దు, ఆలస్యాలకు ప్రధాన కారణాలన్నారు. ఎప్పటిలాగానే ఈ నిస్సహాయతకు సాధారణ పౌరులే మూల్యం చెల్లిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇలాంటివి మరోసారి జరగకుండా ఉండేందుకు విమానయాన రంగంతో సహా అన్నింట్లోనూ న్యాయమైన పోటీ ఉండాలని పిలుపునిచ్చారు. మ్యాచ్‌ఫిక్సింగ్, గుత్తాధిపత్యాలు కాదంటూ మండిపడ్డారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. శివసేన యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది రాజ్యసభలో పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు నోటీసులు ఇచ్చారు. ఇండిగో విమానాల్లో అంతరాయం వల్ల దేశవ్యాప్తంగా అనేకమంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వేల మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయి తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. విమానాశ్రయాల కార్యకలాపాలు కూడా దెబ్బతిన్నాయన్నారు. దీనిపై తక్షణమే



ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. గత మూడు రోజులుగా ఇండిగో విమానాల సర్వీసుల్లో గందరగోళం కొనసాగుతుంది. నిర్వాహణలోపాల వల్ల అనేక విమానాల రద్దు, ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం కూడా మరో 400కి పైగా విమాన సర్వీసులను రద్దు చేసింది.




## సర్వీసుల్లో అంతరాయం..

### రీఫండ్‌పై ఇండిగో కీలక ప్రకటన

**న్యూఢిల్లీ :** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. వందల సర్వీసులు రద్దు, ఆలస్యం కావడం వల్ల వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో పడిగాపులు కాస్తున్నారు. ఇదంతా గందరగోళ పరిస్థితులకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ఇండిగో విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా బహిరంగ ప్రకటన విడుదల చేసింది. “క్షమించండి.. మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటాం” అని ప్రయాణికులను ఉద్దేశించి వెల్లడించింది. డిసెంబర్ 5–15 మధ్య ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకొని, ఈ అంతరాయాల కారణంగా వాటిని రద్దు లేదా రీషెడ్యూలింగ్ చేసుకుంటే పూర్తి రీఫండ్ ఇస్తామని పేర్కొంది. “కొన్నిరోజులుగా పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నాయో మేం అర్థం చేసుకోగలం. ఈ సంక్షోభం రాత్రికి రాత్రే ఒక కొలిక్కి రాకపోయినా.. మీకు సహకరించేందుకు, కార్యకలాపాలు సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రతిదీ చేస్తున్నాం” అని పోస్టులో పేర్కొంది. గత 19 ఏళ్లుగా ప్రయాణికుల నుంచి తాము పొందిన విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించింది. ఇదిలా ఉంటే.. దేశీయ సర్వీసులే రద్దు, జాప్యం కావడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. “ఈ రద్దులు అనూహ్యంగా జరిగినవి కాదు. అంతా వ్యూహాత్మకం. అంతర్జాతీయ సర్వీసుల్లో పది శాతం రద్దు కూడా లేదు. ఆ మార్గాల్లో ఆదాయం ఎక్కువ. ఆ సర్వీసుల్ని రద్దు చేస్తే కఠినమైన ప్యాసింజర్ రూల్స్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది” అని మండిపడ్డారు. ఈ అంతరాయాల వేళ పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడితో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారు. ఇండిగో సంక్షోభాన్ని సమీక్షించారు. మరోవైపు రామ్మోహన్ నాయుడు కూడా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. కంట్రోల్ రూమ్‌కు వెళ్లి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇక, శుక్రవారం కూడా వందలకు పైగా విమాన సర్వీసులు రద్దయిన సంగతి తెలిసిందే. ఇందులో సగానికి పైగా ఒక్క దిల్లీ విమానాశ్రయంలోనే రద్దవడం గమనార్హం.

## హైదరాబాద్ వచ్చే విమానానికి బాంబు బెదిరింపు..

**న్యూఢిల్లీ :** హైదరాబాద్‌కు వచ్చే విమానాలే లక్ష్యంగా వరుసగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. శుక్రవారం దుబాయ్ నుంచి హైదరాబాద్ వస్తోన్న ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈకే526 విమానం దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తోంది. ఈ క్రమంలో విమానాన్ని పేల్చేస్తామంటూ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి ఎయిర్‌పోర్ట్ కస్టమర్ సపోర్ట్ కేంద్రానికి ఇ–మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్టులో ఆ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దింపారు. ఆ తర్వాత విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. కాగా.. గురువారం కూడా హైదరాబాద్‌కు వచ్చే విమానాలు లక్ష్యంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. సౌదీ అరేబియాలోని మదీనా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానంలో




బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విమానాన్ని అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేసి.. తనిఖీలు చేశారు. షార్జా నుంచి హైదరాబాద్ వస్తున్న మరో విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఈ క్రమంలో దాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 5 :** మగువలకు బంగారం ధరలు మళ్లీ షాకిచ్చాయి. నిన్న స్వల్పంగా తగ్గిన ధరలు.. శుక్రవారంమళ్లీ పెరిగిపోయాయి. రోజుకోలాగా బంగారం ధరలు హెచ్చు తగ్గులు అవుతున్నాయి. శుక్రవారం తులం గోల్డ్‌పై రూ.270 పెరగగా.. సిల్వర్ ధర మాత్రం దిగొచ్చింది. ఏకంగా రూ.4,000 తగ్గింది.బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.270 పెరిగి రూ.1,29, 930 దగ్గర ట్రేడ్ అవుతుండగా.. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల ధరపై రూ.250 పెరిగి రూ.1,19,100 దగ్గర అమ్ముడవుతోంది. ఇక 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.210 పెరిగి రూ.97, 450 దగ్గర ట్రేడ్ అవుతోంది.వెండి ధర మాత్రం ఈరోజు భారీ ఉపశమనం కలిగింది. ఈరోజు బులియన్ మార్కెట్‌లో కిలో వెండిపై రూ.4,000 తగ్గి రూ.1,87, 000 దగ్గర ట్రేడ్ అవుతోంది. చెన్నై, హైదరాబాద్‌లో మాత్రం రూ.1,96,000 దగ్గర అమ్ముడవుతోంది. ఇక ఢిల్లీ, ముంబై, కోల్‌కతాలో మాత్రం కిలో వెండి రూ.1,87,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.



## బిజినెస్



## 10 నిమిషాల డెలివరీ సర్వీసులను నిషేధించాలి: రాఘవ్ చద్దా

క్విక్ కామర్స్ సంస్థలు అందిస్తున్న 10 నిమిషాల డెలివరీ వ్యవస్థను నిషేధించాలని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా డిమాండ్ చేశారు. ఈ పద్ధతిలో గిగ్ కార్మికుల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడిన ఆయన.. డెడ్‌లైన్‌ను అందుకునేందుకు కార్మికులు తీవ్ర ఒత్తిడిలో పనిచేయాల్సి వస్తోందన్నారు. రాజ్యసభ జీరో అవర్‌లో ఇదే అంశాన్ని ఆప్ ఎంపీ ప్రస్తావించారు. "గిగ్ కార్మికులు రోబోలు కాదు. ఈ విషయంపై సభ ఆలోచన చేయాలి. 10 నిమిషాల క్రూరత్వ పద్ధతికి ముగింపు పలకాలి. వేగంగా సేవలు అందుతున్నాయని వినియోగదారులు ఆశిస్తున్నప్పటికీ.. గిగ్ కార్మికుల సంక్షేమం గురించి చట్టసభ ఆలోచించాలి" అని రాఘవ్ చద్దా పేర్కొన్నారు. రేటింగ్ తగ్గించడం, ప్రోత్సాహకాల్లో కోత, ఐడీ బ్లాక్ వంటి భయాలతో నిర్దిష్ట సమయంలో డెలివరీ చేసేందుకు కార్మికులు వేగంగా, సిగ్నల్స్ జంప్ చేస్తూ వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని.. వీటితోపాటు కస్టమర్ల వేధింపులు, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సి రావడం వంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గిగ్ కార్మికులు భారత ఆర్థిక వ్యవస్థకు కనిపించని చక్రాలుగా సేవలందిస్తున్నారని ఆప్ ఎంపీ పేర్కొన్నారు. కంపెనీలకు తమ బిలియన్ డాలర్ల విలువను పెంచుకునేందుకు, యూనికార్న్‌గా ఎదగడానికి క్విక్ కామర్స్, ఇన్‌స్టంట్ డెలివరీ వంటి వ్యవస్థలు దోహదపడినప్పటికీ.. గిగ్ కార్మికుల పరిస్థితులు మాత్రం రోజువారీ కూలీల కంటే దారుణంగా ఉన్నాయన్నారు.



## లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. ఉదయం స్వల్ప నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు.. ఆర్‌బీఐ రేట్ల కోత ప్రకటన ఊరటనిచ్చింది. దీనికితోడు రూ.1.45 లక్షల కోట్ల విలువైన బాండ్ల కొనుగోలు ద్వారా మార్కెట్‌లో లిక్విడిటీ పెంచే చర్యలను ప్రకటించడం మరింత ఊతమిచ్చింది. దీంతో సూచీలు వరుసగా రెండోరోజూ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85,125.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,265.32) నష్టాల్లో ప్రారంభమైంది. ఆర్‌బీఐ ప్రకటన వెలువడిన కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. ఆపై రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,796.72 వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. చివరికి 447.05 పాయింట్ల లాభంతో 85,712.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 152.70 పాయింట్ల లాభంతో 26,186.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.99గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటెర్నల్, టీఎంపీవీ, సన్‌ఫార్మా, ట్రెంట్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63.10 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4223 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## మరో 8 దేశాలకు మన యూపీఐ!



దిల్లీ: డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు కారణమైన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ మరిన్ని దేశాలకు విస్తరించనుంది. మరో 8 దేశాలతో భారత్ చర్చలు జరుపుతోందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు వెల్లడించారు. ప్రస్తుతం భూటాన్, సింగపూర్, ఖతార్, మారిషస్, నేపాల్, యూఏఈ, శ్రీలంక, ఫ్రాన్స్ దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆయా దేశాలకు భారత పర్యాటకులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు వీలుపడుతోంది. ఇప్పుడు యూపీఐ లావాదేవీలను అనుమ తించేలా మరో 7-8 దేశాలతో భారత్ చర్చలు జరుపుతోందని నాగరాజు అన్నారు. అందులో తూర్పు ఆసియా దేశాలు ఉన్నాయని చెప్పారు. కొన్ని దేశాలతో వాణిజ్య చర్చలు జరుపుతున్నామని, ఇందులో భాగంగా యూపీఐ కోసం ఒక మార్గం అన్వేషిస్తున్నామని చెప్పారు. తద్వారా యూపీఐ సేవలం దిస్తున్న ఫిన్‌టెక్ పరిశ్రమ.. ఆర్థిక రంగంలో కూడా అడుగు పెట్టడానికి వీలవుతుందన్నారు. తద్వారా దేశానికీ ప్రయోజనం చేకూరుతుందని నాగరాజు చెప్పారు.

## మళ్లీ రిలయన్స్ గ్రూప్ ఆస్తుల అటాచ్..
## మొత్తం రూ.10వేల కోట్లు



రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొం టున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముమ్మర దర్యాప్తు నిర్వహిస్తోంది. దీనిలోభాగంగా మరో రూ.1,120 కోట్ల ఆస్తుల్ని అటాచ్ చేసినట్లు తాజాగా అధికారులు వెల్లడిం చారు. దాంతో ఈడీ ఇప్పటివరకు ఆయ నకు చెందిన రూ.10వేల కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేసినట్లయింది. ముం బయిలోని బల్లార్డ్ ఎస్టేట్, ఫిక్స్‌డ్ డిపాజి ట్లు, బ్యాంక్ బ్యాలెన్స్ వంటివి అటాచ్ చేసిన వాటిలో ఉన్నాయి. గతంలో ముంబయిలోని పాలీహిల్ ప్రాంతంలోని అనిల్ అంబానీ నివాసం, దిల్లీలోని రిలయన్స్ సెంటర్‌కు చెందిన కొంత భూమిని ఈడీ అటాచ్ చేసింది. వీటితో పాటు దిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబయి, పుణె, ఠాణె, హైదరాబాద్, చెన్నై, తూర్పుగోదావరిలో అనిల్ అంబానీ కంపెనీలకు చెందిన పలు నివాస, వాణిజ్య ఆస్తులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17 వేల కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జులైలో రిలయన్స్ గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించింది. ఆగస్టులో అనిల్ అంబానీ సహా కంపెనీకి చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్ అధికారులను విచారించిన సంగతి తెలిసిందే.



## ఐసీసీ ప్లేయర్ ఆఫ్‌ది మంత్..
### షఫాలీ వర్మ నామినేట్

మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన షఫాలీ వర్మ నవంబర్ నెలకు.. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నామినేటైంది. సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు ప్రతికా రావల్ గాయపడటంతో అనూహ్యంగా జట్టులోకి షఫాలీ వచ్చింది. మొదటి మ్యాచ్‌లో విఫలమైంది. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో.. 78 బంతుల్లో 87 పరుగులు చేసి సత్తా చాటింది. బంతి తోనూ విజృంభించింది. కీలకమైన రెండు వికెట్లను నేలకూల్చింది. ఇలా షెఫాలీ వర్మ తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో రాణించి.. టీమ్‌ఇండియా తొలిసారి విశ్వవి జేతగా అవతరించడంలో కీలకంగా నిలిచింది. తాజాగా ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ కోసం యూఏఈకి చెందిన ఈషా ఓజా, థాయ్‌లాండ్‌కు చెందిన తి పట్చా పుట్టావాంగ్ కూడా షఫాలీ వర్మతో పాటు నామినేట్ అయ్యారు. ఐసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ సందర్భంగా ఓజా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసింది. ఏడు టీ20 మ్యాచ్‌ల్లో ఆమె 137.50 స్ట్రైక్ రేట్‌తో 187 పరుగులు చేసింది. బంతితో కూడా రాణించింది. 18.14 సగటుతో 7 వికెట్లు తీసింది. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన ఎడమచేతి వాటం స్పిన్నర్ తిపట్చా పుట్టావాంగ్ ఐసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ టోర్నమెంట్‌లో 15 వికెట్లు సాధించింది.

## పెళ్లి వాయిదా తర్వాత.. స్మృతి మంధాన తొలి పోస్ట్



భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల తర్వాత స్మృతి మంధాన సోషల్ మీడియాలో తొలిసారిగా యాక్టివ్‌గా కనిపించారు. ఓ వాణిజ్య ప్రకటనకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాలో పోస్టు చేశారు. అందులో ఆమె చేతికి ఉంగరం లేకపోవడం ఆసక్తిగా మారింది. దీంతో ఆ షూట్ నిశ్చితార్థానికి ముందు చేశారా లేక తర్వాత చేశారా అనే చర్చ మొదలైంది. అభిమానులు ఆమెకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. స్మృతి, ముచ్చల్ వివాహం నవంబర్ 23న జరగాల్సి ఉంది. కానీ.. పెళ్లికి కొన్ని గంటల ముందు స్మృతి నాన్న అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. ఆ తర్వాత ఆమెకు కాబోయే భర్త పలాశ్ ముచ్చల్ సైతం అనారోగ్యానికి గురయ్యారు. ఈ క్రమంలో వివాహాన్ని వాయిదా వేసినట్లు మంధాన ప్రతినిధి ప్రకటించారు. ఆ తర్వాత తన వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా ఖాతా నుంచి స్మృతి తొలగించడం పలు ఊహాగానాలకు కారణమైంది. ఈ పరిణామాల నడుమ పలాశ్ తల్లి అమిత ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పుడు అంతా బాగానే ఉందని, త్వరలో వారిద్దరి వివాహం జరుగుతుందని చెప్పారు.

## మ్యాచ్ టికెట్ల కోసం ఎగబడ్డ జనం



టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా జట్ల మధ్య అయిదు టీ20ల సిరీస్ జరగనుంది. మొదటి మ్యాచ్ డిసెంబర్ 9న కటక్ వేదికగా నిర్వహిం చనున్నారు. ఒడిశా క్రికెట్ అడ్మినిస్ట్రేషన్ తక్కువ సంఖ్యలో టికెట్లను కౌంటర్లలో విక్రయానికి (ఆఫ్‌లైన్) ఉంచింది. దీంతో టికెట్ల కోసం అభిమానులు పోటీపడ్డారు. టికెట్ కౌంటర్లు తెరుచుకోకముందే ఉదయం నుంచీ మైదానం బయట వేల సంఖ్యలో అభిమానులు పొడవాటి క్యూలైన్లలో వేచి ఉన్నారు. కౌంటర్లు తెరుచుకోగానే టికెట్ల కోసం ఎగబడ్డారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ఎక్కువ సంఖ్యలో టికెట్లను వారి సభ్యులు, వీఐపీలకు కేటాయించి.. చాలా తక్కువ టికెట్లను మాత్రమే కౌంటర్లలో విక్రయానికి ఉంచడం వల్లే ఈ సమస్య తలెత్తిందని పలువురు ఆరోపిస్తున్నారు. టికెట్ల ధరలు రూ.700 నుంచి రూ.20,000 మధ్య ఉన్నాయి. అయితే ఫ్యాన్స్ కోసం తక్కువ సంఖ్యలో టికెట్లు మాత్రమే విడుదల చేసినట్లు తెలుస్తోంది. దక్షిణాఫ్రికాతో టీమ్‌ఇండియా టీ20 మ్యాచ్‌లు కటక్, ముల్లాన్‌పూర్, ధర్మశాల, లఖ్‌నవూ, అహ్మదాబాద్ వేదికగా జరగనున్నాయి. ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న టీ20 వరల్డ్ కప్ 2026 సన్నాహకాల్లో భాగంగా ఈ సిరీస్ ఇరు జట్లకు కీలకం కానుంది.

# విరాట్ వరుస సెంచరీలు..
### పూర్తిగా అమ్ముడుపోయిన విశాఖ టికెట్లు



టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికాల మధ్య మూడు వన్డేల సిరీస్ జరుగుతోంది. ఇందులోభాగంగా రాంచీ, రాయ్‌పుర్‌లలో ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ముగిశాయి. మూడో మ్యాచ్ విశాఖపట్నం వేదికగా శనివారం జరగనుంది. విరాట్ కోహ్లీ రాంచీ, రాయ్‌పుర్‌లలో వరుస సెంచరీలతో కదం తొక్కాడు. అతడు రాణించడంతో ఒక్కసారిగా టికెట్లకు డిమాండ్ పెరిగిందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. డిసెంబర్ 6న జరగనున్న మ్యాచ్‌కు సంబంధించి, మొదటివి డతగా నవంబర్ 28న టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయానికి అందుబాటులోకి వచ్చాయి. తర్వాత ఆఫ్‌లైన్‌లోనూ టికెట్ల విక్రయాల కోసం కౌంటర్లు ఏర్పాటుచేశామని అధికారులు వెల్లడించారు. రూ.15 వేలు టికెట్లు మాత్రం అదేరోజు కాస్త ఆలస్యంగా అమ్ముడుపోయాయి. రెండోవిడత టికెట్ల అమ్మకాలు నవంబర్ 30, డిసెంబర్ 3న జరిపారు. అయితే విరాట్ కోహ్లీ రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో సూపర్ సెంచరీ (135) సాధించిన తర్వాత టికెట్ల అమ్మకాలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి.

'టికెట్ల విక్రయం నవంబర్ 28న ప్రారంభమైంది. మొదట్లో అభిమానుల నుంచి మేం ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. కానీ కోహ్లీ రాంచీలో సెంచరీ చేసిన తర్వాత.. రెండు, మూడో విడతల్లో అమ్మకానికి పెట్టిన టికెట్లన్నీ నిమిషాల్లో అమ్ముడుపోయాయి' అని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మీడియా అండ్ ఆపరేషన్స్ టీమ్ అధికారి వై.వెంకటేశ్ తెలిపారు. విరాట్ కోహ్లీ.. ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతడు కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. వన్డే వరల్డ్ కప్ 2027లో భాగం కావాలనే ఆశయంతో ముందుకుసాగుతున్నాడు. విశాఖలో ఇప్పటివరకు కోహ్లీ ఏడు మ్యాచ్‌లు ఆడి, 97.83 యావరేజ్‌తో 587 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, రెండు అర్ధ శతకాలు ఉన్నాయి.

**విశాఖలోనూ శతకం బాదాలని..**

ప్రస్తుత వన్డే సిరీస్‌లో ఇప్పటికే వరుసగా రెండు సెంచరీలు చేసిన విరాట్.. విశాఖ వన్డేలోనూ శతకం బాదాలని అభిమానులు కోరుకుంటున్నారు. కోహ్లీ వరుసగా మూడు సెంచరీలు చేసిన ఘనతను 2018లోనే వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచుల్లో సొంతం చేసుకున్నాడు. దీంతో వన్డే ఫార్మాట్‌లో వరుసగా మూడు, అంతకంటే ఎక్కువ మ్యాచుల్లో వరుస సెంచరీలు చేసిన 12వ బ్యాటర్‌గా నిలిచాడు.

## అందుకే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికా : ఆండ్రీ రస్సెల్

**వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఇటీవలే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్‌కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు అతడిని రిలీజ్ చేసింది. అనంతరం అతడు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం రస్సెల్‌ను పవర్ కోచ్‌గా నియమించుకుంది. అయితే తాను ఐపీఎల్‌కు వీడ్కోలు నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో, తాజాగా.. 'క్రిక్‌బజ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించాడు.**



'ఐపీఎల్ పెద్ద టోర్నీ. ఇందులో మ్యాచ్‌లు ఎక్కువ. ప్రయాణాలు కూడా అధికం. ప్రాక్టీస్, జిమ్, వర్క్‌లోడ్.. వీటన్నింటినీ సమతూకం చేసుకోవడం చాలా కష్టం. ఆల్‌రౌండర్‌గా నాకు మరింత ఛాలెంజింగ్. నేను కేవలం బ్యాటింగ్ చేస్తేనే సరిపోదు. ఒక మ్యాచ్‌లో కనీసం రెండు ఓవర్లపాటు బౌలింగ్ చేయాలి. నేను చక్కగా బౌలింగ్ చేయగలిగాను అనుకున్నప్పుడే.. బ్యాటింగ్‌లో కూడా రాణించగలను. నేను కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు వచ్చి, సిక్స్‌లు కొడితే సరిపోతుందనుకోను. బ్యాటింగ్, బౌలింగ్ రెండూ చేసినప్పుడే నేను ఆటను ఆస్వాదించగలను' అని ఆండ్రీ రస్సెల్ వివరించాడు. "హాయ్ కేకేఆర్ ఫ్యాన్స్, నేను మీ ఆండ్రీ రస్సెల్. కేకేఆర్ అభిమానులకు ఓ విషయం చెప్పాలి. ఐపీఎల్ నుంచి నేను రిటైర్ అవుతున్నా. కేకేఆర్ నాకు ఎన్నో మంచి అవకాశాలను, అద్భుతమైన జ్ఞాపకాలను ఇచ్చింది. భారీ సిక్స్‌లు కొట్టడం, మ్యాచ్‌లు గెలవడం ఇవన్నీ ఒక గొప్ప ఆటగాడిలా మీ ముందుంచాయి. ఈ నిర్ణయం తీసుకుందాం అనుకుంటున్నప్పుడు ఇది నా కెరీర్‌లో బెస్ట్ నిర్ణయం అవుతుందని అనిపించింది. నేను ఐపీఎల్‌లో ఫేడౌట్ అవ్వాలని అనుకోవడం లేదు. ఓ లెగసీని అందించి వెళ్లాలని అనుకున్నాను. ప్రేక్షకులు 'రిటైర్‌మెంట్ ఎందుకు?' అని ప్రశ్నించే రోజుల్లోనే రిటైర్ అవ్వడం ఉత్తమం అనేది నా భావన." అని ఆండ్రీ రస్సెల్ ఇటీవల సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో వివరించాడు. రస్సెల్.. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 140 మ్యాచుల్లో 174.18 స్ట్రైక్ రేట్‌తో 2,651 పరుగులు చేశాడు. ఇందులో 12 హాఫ్ సెంచరీలున్నాయి. అలాగే బౌలింగ్‌లో 9.51 ఎకానమీతో 123 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకసారి అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.

## కేఎల్ రాహుల్ టాప్ ఆర్డర్‌లో ఆడితే మరిన్ని సెంచరీలు చేస్తాడు : డేల్ స్టెయిన్



ప్రస్తుతం టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ జరుగుతోంది. ఇందులోభాగంగా ఇప్పటికే రాంచీ, రాయ్‌పుర్ వేదికగా రెండు వన్డేలు ముగిశాయి. తొలి వన్డేలో టీమ్‌ఇండియా 17 పరుగులతో విజయం సాధిస్తే, రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ రెండు మ్యాచుల్లోనూ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీలతో రాణించాడు. మొదటి వన్డేలో 60 (56 బంతుల్లో), రెండో మ్యాచ్‌లో 66లి (43 బంతుల్లో) పరుగులు చేశాడు. బ్యాటింగ్‌లో నిలకడ ప్రదర్శిస్తున్న అతన్ని దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ ప్రశంసించాడు. 'కేఎల్ రాహుల్‌కు ఎలా ఆడాలో తెలుసు. ఒకవేళ అతడు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగితే.. కచ్చితంగా సెంచరీలు సాధించగల డు. కానీ ప్రస్తుతం అతడు ఆడుతున్న స్థానాల్లో... జట్టు కోసం తాను ఎలాంటి పాత్ర పోషించాలో తెలుసు. మొదటివన్డేతో పాటు, రెండో మ్యాచ్‌లోనూ అతడు హాఫ్ సెంచరీలు చేశాడు. ఎప్పుడు తగ్గాలో.. ఎప్పుడు వేగంగా ఆడాలనే విషయంపై అతడికి అవగాహన ఉంది' అని డేల్ స్టెయిన్ కొనియాడాడు. కేఎల్ రాహుల్ ఇప్పటివరకు వన్డేల్లో 83 ఇన్నింగ్స్‌ల్లో 49.50 యావరేజ్‌తో 3,218 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, 20 హాఫ్ సెంచరీలున్నాయి. అతడు చివరిసారిగా వన్డే వరల్డ్‌కప్ 2023లో నెదర్లాండ్స్ మీద సెంచరీ చేశాడు. ఆ మ్యాచ్‌లో అతడు కేవలం 64 బంతుల్లోనే 102 పరుగులు సాధించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాల కారణంగా వన్డే జట్టుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో కేఎల్ రాహుల్ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో టీమ్‌ఇండియా 17 పరుగులతో విజయం సాధించింది. రాయ్‌పుర్ వన్డేలో సఫారీల జట్టు 4 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్ విజేతను నిర్ణయించే కీలకమైన మూడో వన్డే విశాఖపట్నం వేదికగా రేపు (శనివారం) జరగనుంది. దీంతో అభిమానుల్లో ఈ మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది.




## సైక్ సిద్ధార్థ నుంచి సాంగ్ విడుదల

శ్రీనందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్ధార్థ' వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోంది. యామిని భాస్కర్ కథానాయిక. డిసెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని లవ్‌సాంగ్‌ను విడుదల చేశారు. 'ధుమ్ తకుమ్..' అంటూ సాగే ఈ పాటకు కాశర్ల శ్యామ్ లిరిక్స్ రాయగా.. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు.

## జపాన్‌లో బాహుబలి ప్రత్యేక ప్రదర్శన
### కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరోసారి తన క్రేజ్‌ను విదేశాల్లో నిరూపించాడు. జపాన్‌లో జరిగిన 'బాహుబలి: ది ఎపిక్' ప్రత్యేక ప్రదర్శనకు హాజరైన ప్రభాస్, అక్కడ అభిమానులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఇప్పుడు దుమ్ము రేపుతున్నాయి. ఈ ఫోటోలలో ప్రభాస్ కనిపించిన కొత్త లుక్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇప్పటివరకు చూడని స్టైలిష్ అవతారంలో కనిపించిన డార్లింగ్, జపాన్ అభిమానులను మాత్రమే కాదు, ఇండియన్ సినీ లవర్స్‌ని కూడా షాక్‌కి గురి చేశారు. ప్రభాస్ తాజా లుక్ చూసిన అభిమానులు.. ఈ లుక్ స్పిరిట్‌ది అయి ఉంటుందేమో అని అంటున్నారు. జపాన్ ఫ్యాన్స్‌తో ప్రభాస్ ఆప్యాయంగా మాట్లాడిన వీడియోలు, ఫోటోలు జపనీస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో తెగ వైరల్ అవుతున్నాయి. దీంతో మరోసారి 'బాహుబలి' మేనియా కనిపిస్తోంది. ఇటీవల బాహుబలి ది ఎపిక్ చిత్రం ఇండియాలో విడుదలై మంచి టాక్ అందుకుది. బాహుబలి రెండు పార్ట్‌లని ఒక పార్ట్‌గా చేసి బాహుబలి ది ఎపిక్ పేరుతో విడుదల చేశారు. ఇక ఇదిలా ఉంటే ప్రభాస్ ప్రస్తుతం రెండు భారీ పాన్-ఇండియా ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ చాలా కాలం క్రితమే ప్రారంభమైంది. ఆర్మీ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం ప్రభాస్ కొత్త లుక్ ట్రై చేస్తున్నాడనే ప్రచారం వినిపిస్తోంది. మరోవైపు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ ఇటీవలే మొదలైంది. సందీప్ వంగా సినిమా కోసం ప్రభాస్ మరింత రగ్గడ్, ఇటనెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడా? అంటూ అభిమానులు అనుమానిస్తున్నారు. ప్రభాస్ కొత్త ఫోటోలు షేర్ అయిన కొన్ని గంటల్లోనే వేలాది లైక్స్, రీట్వీట్లతో రచ్చ చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డార్లింగ్ అభిమానులు ఈ లుక్‌ను చూసి మైమరిచిపోతున్నారు.





# బాలకృష్ణ అభిమానులకు నిరాశ


## అఖండ-2 వాయిదా వేసిన నిర్మాణ సంస్థ



**హైదరాబాద్, డిసెంబర్ 5 :** బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' వాయిదా పడింది. ఈ సినిమా విడుదలపై కొన్ని గంటలుగా సందిగ్ధత నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం సమస్యల్లో చిక్కుకున్నట్లు వార్తలొచ్చాయి. గురువారం రాత్రి ప్లాన్ చేసిన ప్రీమియర్స్‌ను చిత్ర బృందం రద్దు చేయడంతో.. ఆ వార్తలకు బలం చేకూరింది. తాజాగా చిత్ర విడుదలను వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 5న థియేటర్లలో ఈ చిత్రం విడుదల కావాల్సిఉంది. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ సంస్థ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. 'అనివార్య కారణాల వల్ల 'అఖండ 2' షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదు. ఈ విషయం పట్ల చింతిస్తున్నాం. ఈ క్షణం మాకు చాలా బాధాకరమైనది. ప్రతి అభిమాని, సినీ ప్రేమికుడికి ఇది కలిగించే నిరాశను మేము అర్థం చేసుకుంటాము. ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాము. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి మా హృదయపూర్వక క్షమాపణలు. ఈ సమయంలో మీ మద్దతు మాకు చాలా అవసరం. అతి త్వరలో సానుకూల నిర్ణయంతో మీ ముందుకు వస్తాం అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

## ఆర్థిక లావాదేవీలపై అనవసర వార్తల తగదు

### త్వరలోనే అఖండ-2 విడుదల : సురేష్ బాబు



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో భారీ అంచనాల మధ్య రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' విడుదల వాయిదా పడటం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. కొన్ని ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై తాజాగా టాలీవుడ్ అగ్ర నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అయిన సురేష్ బాబు స్పందించారు. 'అఖండ 2' వాయిదాకు గల అసలు కారణాలను బయటపెట్టకుండా అనవసరపు ఊహాగానాలకు తెరదించారు. సైక్ సిద్ధార్థ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు 'అఖండ 2' ఇష్యూ గురించి ప్రస్తావిస్తూ.. నేను కూడా ఆ సమస్య గురించి మాట్లాడాటానికే వెళ్లాను. త్వరలోనే 'అఖండ 2' సమస్య పరిష్కారమవుతుంది. అఖండ 2 కి సంబంధించి అన్నీ ఆర్థికపరమైన ఇబ్బందులే అవి బయటకు వెల్లడించకూడదు అని అన్నారు. అలాగే సినిమాకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల గురించి ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు రాస్తున్నారు. ఇది దురదృష్టకరం. ప్రతిఒక్కరూ 'అఖండ 2' రిలీజ్ కాకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. అన్ని కోట్లు చెల్లించాలట అని రాస్తున్నారు. అవి అన్నీ అనవసరపు ప్రస్తావనలు అని సురేష్ బాబు స్పష్టం చేశారు. ఆడియన్స్ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమై సినిమా విడుదలవుతుంది. అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## అవతార్-3లో వారణాసి స్పెషల్ వీడియో

'వారణాసి' సినిమాను దర్శకధీరుడు రాజమౌళి భారీ స్థాయిలో తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసినప్పటినుంచే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఏర్పడింది. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం హాలీవుడ్‌లోనూ వైరల్ అవుతోంది. అవతార్ 3 సినిమాలోను 'వారణాసి' సర్‌ప్రైజ్ ఉండనున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. దీంతో ఈ న్యూస్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది.'అవతార్' డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అంటే రాజమౌళికి ఎంత అభిమానమో తెలిసిన విషయమే. సందర్భం వచ్చినప్పుడల్లా జక్కన్న ఆయన గురించి చెబుతూనే ఉంటారు. ఇప్పుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్ 3' సినిమాలో రాజమౌళి 'వారణాసి' సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 19న 'అవతార్ 3' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలోనే 'వారణాసి'కి సంబంధించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించే ఆలోచన చేస్తున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో మహేశ్ రుద్ర పాత్రలో నటిస్తున్నారు. విలన్ పాత్ర కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ప్రియాంకా చోప్రా.. మందాకినిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి లుక్స్‌కూ విశేష స్పందన దక్కింది.

## పుష్ప-2 విడుదలకు ఏడాది

### ఎమోషనల్ పోస్ట్ చేసిన అల్లు అర్జున్
### విమల్ థియేటర్‌లో పుష్ప-2 టిక్కెట్ల రగడ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రూల్' గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌ను అందుకోవడమే కాకుండా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం విడుదలై నేటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీని గుర్తుచేసుకుంటూ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుష్ప' ఫ్రాంచైజీ తన జీవితంలో ఒక మరువలేని ప్రయాణంగా మిగిలిందని అల్లు అర్జున్ పేర్కొన్నారు. 'పుష్ప' మా జీవితంలో ఐదేళ్ల పాటు సాగిన మరువలేని ప్రయాణంగా నిలిచింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన అపారమైన ప్రేమ, శక్తి, మా కళను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమైన ధైర్యాన్ని అందించింది. ఈ చిత్రాన్ని ఒక అద్భుతంగా మార్చినందుకు ఈ దేశంలోని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాము. నా కళాకారులందరితో, సాంకేతిక నిపుణులతో, మొత్తం యూనిట్‌తో, నిర్మాతలు, పంపిణీదారులు మరియు ముఖ్యంగా మా కెప్టెన్ సుకుమార్ గారితో కలిసి ఈ ప్రయాణంలో నడవడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ ప్రయాణంలో భాగమైన మీ ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మరోసారి, హృదయం నిండా కృతజ్ఞతతో ధన్యవాదాలు అంటూ అల్లు అర్జున్ రాసుకొచ్చాడు. ఇదిలావుంటే బాలానగర్ విమల్ థియేటర్‌లో పుష్ప 2 టికెట్ల రగడ కొనసాగింది. పుష్ప 2 రిలీజ్‌కు ఏడాది పూర్తయిన సందర్భంగా విమల్ థియేటర్‌లో పుష్ప 2 సినిమా వేశారు. ఈ నేపథ్యంలో పలువురు అభిమానులకు టికెట్స్ అందలేదు దీంతో ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. టికెట్స్ లేకపోవడంతో ఆగ్రహంతో రెండు వర్గాలకు చెందిన ఫ్యాన్స్ పొట్టుపొట్టు కొట్టుకున్నారు. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## 'ది హంటర్'.. మెప్పించే థ్రిల్లర్

**రివ్యూ:**

చెన్నైలోని మాధవరంలో వరుసగా హత్యలు జరుగుతుం టాయి. కాలిపోయిన ఓ శవం కాళ్లు, చేతులు, తలను వేర్వేరు అట్టపెట్టెల్లో ఓ మాస్క్‌తోపాటు పెట్టి, హంతకుడు పలు ప్రదేశాల్లో పడేస్తాడు. అలా పోలీసు స్టేషన్ ఎదుట ఓ బాక్స్ కనిపించడం కలకలం రేపుతుంది. దాన్ని సవాలుగా తీసుకుం టాడు సీఐ రాజేంద్రన్. ఆ కేసు వీలైనంత వేగంగా సాల్వ్ చేసేందుకు ఫేషియల్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్టిస్ట్ శివ (వైభవ్) సాయం తీసుకుంటాడు. గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న శవాల ముఖాలు ఒకప్పుడు ఎలా ఉండేవో ఊహించి స్కెచ్ వేయడంలో అతడికి మంచి పేరుంటుంది. పోలీసుల అవసరం మేరకు క్రైమ్ రిపోర్టులూ రాస్తుంటాడు. ఆ కేసును ఛేదించే క్రమంలో అనూహ్యంగా రాజేంద్రన్ కిడ్నాప్ అవుతాడు. ఆయన స్థానంలో ఇందూజ (తాన్యా హోప్) కేసు బాధ్యతలు స్వీకరిస్తుంది. మరి, రాజేంద్రన్‌ను టార్గెట్ చేసిందెవరు? ఓ సమస్యతో సతమతమయ్యే శివ.. కేసును పరిష్కరించేందుకు ఇందూజకు ఎలా హెల్ప్ చేయగలిగాడు? అసలు ఆ హత్యలకు కారణమేంటి? అన్నది కథ

హీరో టాలెంట్ ఏంటన్నది సినిమా ప్రారంభంలోనే ప్రేక్షకుడికి తెలిసిపోతుంది. దీంతో, పోలీసు అధికారుల కన్నా వేగంగా అతడే కేసుకు పరిష్కారం చూపగలడన్న అభిప్రాయం వచ్చేస్తుంది. సాఫీగా కాకుండా సవాళ్ల ప్రయాణమైతేనే కదా మజా. దానికి ఏమాత్రం లోటు లేకుండా స్క్రీన్‌ప్లే సాగింది. 'రాజేంద్రన్‌తో శివ చేయి కలిపాడు.. ఇంకేం? కేసు క్లోజ్' అని అనుకునేలోపు ఆ సీఐ అదృశ్యమవడం ఫస్ట్ ట్విస్ట్. దీంతో, ఒకేసారి రెండు కేసులతో (వరుస హత్యలు, రాజేంద్రన్ కిడ్నాప్) తలమునకలై ఉన్న ఇందూజకు శివ ఎలా హెల్ప్ చేశాడన్నది ఆసక్తికరం. ఆ క్రమంలో పరిచయమయ్యే నర్సు కల్కి (నందితా శ్వేత) పాత్ర కథను మరో మలుపు తిప్పుతుంది. తల్లికూతుళ్ల




అనుబం ధానికి పెద్ద పీట వేస్తూనే సింగిల్ పేరెంట్ కష్టాలు ఎలాంటివో చూపిస్తూ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ను ఎమోషనల్‌గా నడిపించారు. కల్కి కుమార్తె రోడ్డు ప్రమాదానికి గురికావడం నుంచి.. వరుస హత్యల వెనుక ఎవరున్నారన్న చిక్కుముడిని విప్పుతూ వెళ్లారు. కొన్ని సన్నివేశాలు.. వైద్యం ముసుగులో శవాలపై ఇంత ఘోరంగా అకృత్యాలకూ పాల్పడతారా? అని విస్తుపోయేలా చేస్తాయి. కల్కి తనయ ప్రమాదానికి– శివకు ఉన్న కనెక్షన్‌ను రివీల్ చేస్తూ రూపొందించిన క్లైమాక్స్ థ్రిల్ చేస్తుంది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఓకేగానీ హీరోకి ఉద్దేశపూర్వకంగానే ఓ సమస్యను సృష్టించినట్టు అనిపిస్తుంది. హీరో గతమేంటో చెప్పేలా రూపొందించిన లవ్‌ట్రాక్, పాట వల్ల పెద్దగా ప్రయోజనం లేదు. ఇతర సినిమాల్లోని నటనతో పోలిస్తే.. వైభవ్ ఇందులోని పాత్రలో పర్‌ఫెక్ట్‌గా కనిపించారు. నందితా శ్వేత అభినయం ఆకట్టుకుంటుంది. పోలీసు అధికారిగా తాన్యా హోప్ ఓకే. శివ లవర్‌గా నటించిన సరస్వతీ మేనన్‌కు స్క్రీన్ ప్రెజెన్స్ చాలా తక్కువ.

Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers - ID : PRESS/2025/125/00007278, Address : Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam - 507002.Telangana. EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in